ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం | సంపుటి : 11 | పేజీలు : 12
31.03.2025 | సంచిక : 251 | వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# పేదలకు సన్నబియ్యం.. ఓ చారిత్రాత్మక ఘట్టం

## ఈ పథకం నా మదిలో శాశ్వతంగా నిలిచి ఉంటుంది:సీఎం రేవంత్

*శ్రీమంతులు తినే సన్నబియ్యం పేదలు కూడా తినే రోజులు వచ్చాయి. ఉగాది రోజున సన్నబియ్యం పంపిణీని ప్రారంభించటం సంతోషకరం. పేదలకు 25 లక్షల ఎకరాలను అసైన్డ్ భూములుగా పంచిన చరిత్ర ఇందిరాగాంధీ సొంతం. రూ.1.90కే పేదలకు కిలో బియ్యం ఇవ్వాలని మొదట కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి భావించారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో రూ.2లకు కిలో బియ్యం పథకాన్ని ఎన్టీఆర్ ప్రారంభించారు. పేదలకు బియ్యం ఇచ్చేందుకు 1957లోనే రేషన్ దుకాణాలను ప్రారంభించింది కాంగ్రెస్ పార్టీ. దేశంలోనే అత్యధికంగా వడ్లు పండించే జిల్లాల్లో ఒకటి నల్గొండ జిల్లా.''*

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



సూర్యాపేట(జనంసాక్షి):శ్రీమంతులు తినే సన్నబియ్యం పేదలు కూడా తినే రోజులు వచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఉగాది రోజున సన్నబియ్యం పంపిణీని ప్రారంభించడం సంతోషకరంగా ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సభలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీమంతులు తినే సన్నబియ్యం పేదలు కూడా తినే రోజులు వచ్చాయని అన్నారు. ''రూ.1.90కే పేదలకు కిలో బియ్యం ఇవ్వాలని మొదట కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి భావించారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో రూ.2 కిలో బియ్యం పథకాన్ని ఎన్టీఆర్ ప్రారంభించారు. పేదలకు బియ్యం ఇచ్చేందుకు మిగతా 2లో..

- ప్రభుత్వాలు మారినా ఈ పథకం ఎప్పటికీ కొనసాగుతుంది
- శ్రీమంతులు తినే సన్నబియ్యం పేదలు కూడా తినే రోజులు వచ్చాయి
- తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకే పథకానికి శ్రీకారం చుట్టాం
- దీని ద్వారా ప్రభుత్వంపై ఆర్థికంగా భారమైన వెనక్కుతగ్గం
- నల్గొండపై పగతోనే కేసీఆర్ ఎస్ఎల్‌బీసీని పూర్తి చేయలేదు
- హుజూర్‌నగర్‌లో పంపిణీని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- సన్న బియ్యం ఇస్తున్న తొలి రాష్ట్రం తెలంగాణ: మంత్రి ఉత్తమ్




*దేశంలో ఏ రాష్ట్రంలోనూ రేషన్ కార్డులపై సన్నబియ్యం ఇవ్వడంలేదు.. తొలిసారిగా తెలంగాణ రాష్ట్రమే ఇస్తోంది.దొడ్డు బియ్యంపై ప్రభుత్వం కిలోకు రూ.40 ఖర్చు చేస్తోంది. అయినా ప్రజలు వాటిని తినడం లేదు. దీంతో అవి పక్కదారి పడుతున్నాయి. ఇంకొంచెం అధిక ధరకు కొనుగోలు చేసి సన్నబియ్యం ఇస్తున్నాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు రేషన్‌కార్డులు ఇవ్వలేదు.ఈ ప్రభుత్వం త్వరలోనే కొత్త రేషన్ కార్డులు ఇవ్వనుంది. ఆహార భద్రత చట్టాన్ని చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే''*

- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

## గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ

### రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు



హైదరాబాద్(జనంసాక్షి):గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సీఎం రేవంత్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి ఉగాది శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం ఆయనను శాలువతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డితో పాటు మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్‌లు పాల్గొన్నారు. రేవంత్ రెడ్డి గవర్నర్‌ను కలిసిన సందర్భంగా ప్రధానంగా మంత్రివర్గ విస్తరణపైనే చర్చ కొనసాగినట్లుగా ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 3వ తేదీన మంత్రివర్గ విస్తరణ, మంత్రుల ప్రమాణ స్వీకారం, వారికి శాఖల కేటాయింపులు మిగతా 2లో..

## గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ జాబితా విడుదల



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ జాబి తాను విడుదల చేసింది. మిగతా 2లో..



## హైదరాబాద్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొస్తాం

- లక్షలాది మందికి ఉపాధి కల్పించేలా 'ఫ్యూచర్ సిటీ'
- దేశానికి ఆదర్శంగా ఉండేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం
- రవీంద్రభారతిలో ఉగాది వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచస్థాయిలో హైదరాబాద్‌కు గుర్తింపు తీసుకురావాలని యత్నిస్తున్నామని చెప్పారు.నగరంలోని రవీంద్రభారతిలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు.''ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నా. భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ షడ్రుచుల కలయికలా ఉంది. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలనేదే ఆయన ఆలోచన. బడ్జెట్‌లో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలకు అధిక నిధులు కేటాయించాం. పెట్టుబడులు మిగతా 2లో..

## ఒడిశాలో పట్టాలు తప్పిన రైలు

### ఒకరి మృతి.. 8 మందికి గాయాలు


### ఘటనలో పక్కకు పడిపోయిన 11 బోగీలు

భువనేశ్వర్(జనంసాక్షి):ఒడిశాలో రైలు ప్రమాదం జరిగింది. నెర్గుండి సమీపంలో కామాఖ్య ఎక్స్‌ప్రెస్ ట్రైన్ పట్టాలు తప్పింది. ఈ ఘటనలో 11 బోగీలు పక్కకు పడిపోయాయి.ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పలువురు గాయపడినట్లు తెలుస్తోంది. ఈస్ట్‌కోస్ట్ రైల్వే సీపీఆర్వో అశోక్ కుమార్ మిశ్రా వివరాల మేరకు.. కటక్‌లోని నెర్గుండి రైల్వే స్టేషన్ సమీపంలో ట్రైన్ నెంబర్ 12551 కామాఖ్య సూపర్ పాస్ట్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ట్రైన్ ప్రమాదం జరిగిన వెంటనే మెడికల్ ఎమర్జెన్సీ టీం ఘటనా స్థలానికి చేరుకుంది. గాయపడిన క్షతగాత్రులకు చికిత్స అందించారు.



## 65ఏళ్లలో చేయలేనిది.. పదేళ్లలో చేసి చూపించాం

- నాటి ఆటవిక రాజ్యం కావాలా? నేటి అభివృద్ధి కావాలా?:
- బిహార్ గోపాల్‌గంజ్ బహిరంగ సభలో అమిత్ షా వార్త 9లో



## మాస్కో నడిబొడ్డున కలకలం

### పుతిన్ కారులో భారీ పేలుడు

### అగ్నికి ఆహుతైన అధికారిక వాహనం లిమోజిన్

### రష్యా అధ్యక్షుడి భద్రతపై రేకెత్తుతున్న అనుమానాలు




మాస్కో(జనంసాక్షి):రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కు చెందిన అధికారిక కార్లలో అత్యంత లగ్జరీ కారు లిమోజిన్‌లో భారీ పేలుడు సంభవించింది.మాస్కో నడిబొడ్డున జరిగిన ఈ ఘటన రష్యా అధ్యక్షుని భద్రతపై పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. ఈ ఘటనతో ప్రపంచ నేతలంతా ఉలిక్కిపడ్డారు. 'ది సన్' తెలిపిన వివరాల ప్రకారం పుతిన్‌కు చెందిన ఈ అత్యంత ఖరీదైన కారు లుబియాంకాలోని ఎఫ్ఎస్‌బీ ప్రధాన కార్యాలయం సమీపంలో కాలిపోతూ కనిపించింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మిగతా 2లో..

## పండగపూట విషాదం..

### ప్రమాదవశాత్తు చెరువులో పడి పిల్లలు, వారిని కాపాడబోయి తల్లి

### మొత్తం నలుగురు మృతి

### కామారెడ్డి జిల్లాలో ఎల్లారెడ్డిలో ఘటన



కామారెడ్డి(జనంసాక్షి): పండగపూట కామారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసు కుంది. చెరువులో మునిగి తల్లి, ముగ్గురు పిల్లలు మృతిచెందారు. ఎల్లారెడ్డి మండలం వెంకటాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది.మృతులను మౌనిక (26), మైథిలి (10), అక్షర (8), వినయ్‌గా గుర్తించారు.ఆదివారం ఉదయం మిగతా 2లో..



## హెచ్‌సీయూ భూములు అమ్మొద్దు

### యూనివర్సిటీలో మరోసారి హై టెన్షన్..

### మళ్లీ నిరసనలకు ప్రయత్నించిన విద్యార్థులు

### తోపులాటలో విద్యార్థులకు గాయాలు

### పలువురిని అరెస్టు చేసిన పోలీసులు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్న 400 ఎకరాలు భూమి వేలంపై తీవ్ర వివాదం నెలకొంది. యూనివర్సిటీ లో ఉన్న ఈ భూములను వేలం వేయాలన్న ప్రభుత్వ ఆలోచనకు వ్యతిరేకంగా విద్యార్థులు మిగతా 2లో..

## మళ్లీ భూకంపం

### మయన్మార్‌లో 5.1 తీవ్రతతో కంపించిన భూమి

### భూవిలయంలో 1700 దాటిన మృతుల సంఖ్య

- అంతకంతకూ పెరుగుతున్న మరణాల సంఖ్య
- శిథిలాలు తొలగించేకొద్దీ బయటపడుతున్న మృతదేహాలు
- వేలల్లో క్షతగాత్రులు..
- సాయమందిస్తున్న ప్రపంచదేశాలు



నేపిడా(జనంసాక్షి):మయన్మార్‌లో మళ్లీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 5.1గా నమోదైంది. దీంతో ఇళ్ల నుంచి ప్రజలు భయంతో బయటికి పరుగులు తీశారు. ఆదివారం మయన్మార్‌లోని రెండో అతిపెద్ద నగరమైన మాండలే సమీపంలో 5.1 తీవ్రతతో భూకంపం సంభవించిందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే నివేదించింది. వెంటనే స్పందించిన సహాయక బృందాలు ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను బయటకు తీసుకురావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే శుక్రవారం సంభవించిన భారీ భూకంపం వల్ల రోడ్లు, వంతెనలు, కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బ తినడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు.శుక్రవారం మయన్మార్‌లో 7.7 తీవ్రతతో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 1600 మందికిపైగా మృతి చెందారు. 3,400 మందికి పైగా అదృశ్యమయ్యారు. శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ మృతుల సంఖ్య పెరుగుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. శనివారం ఉదయం 11.53 గంటల సమయంలో 4.3 తీవ్రతతో, మధ్యాహ్నం 2.30 గంటలకు 3.8 తీవ్రతతో, 20 నిమిషాల వ్యవధిలో 4.7 తీవ్రతతో వరుసగా మిగతా 2లో..

## అమెరికాతో ఇరాన్ ప్రత్యక్ష చర్చలుండవు



### కానీ.. పరోక్ష చర్చలకు మాత్రం దారులు తెరిచే ఉన్నాయి

### ట్రంప్ లేఖపై స్పందించిన ఆ దేశ అధ్యక్షుడు పెజెష్కియాన్

టెహ్రాన్(జనంసాక్షి):అణు ఒప్పందంపై ఇరాన్‌తో చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీకి లేఖ రాసినట్లు చెప్పారు. అయితే, అగ్రరాజ్యంతో ప్రత్యక్ష చర్చల ఆహ్వానాన్ని తిరస్కరించినట్లు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ తాజాగా వెల్లడించారు. దీంతో ట్రంప్ లేఖపై టెహ్రాన్ ఏ విధంగా స్పందించిందనేదానిపై అధికారికంగా స్పష్టత వచ్చింది.''రెండు పక్షాల మధ్య ప్రత్యక్ష చర్చల అవకాశాన్ని తిరస్కరించాం. అయితే.. పరోక్ష చర్చలకు దారులు తెరిచే ఉన్నాయి'' అని పెజెష్కియాన్ తెలిపారు. ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘీ సైతం పరోక్ష చర్చలకు మార్గం తెరిచే ఉందని వ్యాఖ్యానించారు. తమ దేశం విషయంలో ప్రత్యర్థుల వైఖరిలో మార్పు రానంతవరకు ప్రత్యక్ష చర్చలకు అవకాశం లేదని తేల్చి చెప్పారు. అయితే, ట్రంప్ పరోక్ష చర్చలకు అంగీకరిస్తారా? అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ట్రంప్ మొదటి హయాంలో టెహ్రాన్‌తో సంబంధాలు అంతంతమాత్రంగానే సాగాయి. ఆయన అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే 2018లో అణు ఒప్పందం నుంచి అమెరికా వైదొలిగింది. అప్పటినుంచి అనేక ఏళ్లుగా పరోక్ష చర్చలు విఫలమయ్యాయి.ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకోకుండా నిలువరించేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే మరోసారి అణు ఒప్పందం కుదుర్చుకోడానికి ట్రంప్ ఇటీవల సంసిద్ధత వ్యక్తం చేశారు. ''టెహ్రాన్ ముందు రెండు మార్గాలున్నాయి. సైనిక శక్తి, లేదా ఒప్పందం చేసుకోవడం. ఒప్పందానికే మిగతా 2లో..



## ఛత్తీస్‌గఢ్‌లో 50 మంది మావోయిస్టుల లొంగుబాటు

రాయ్‌పూర్(జనంసాక్షి): ఛత్తీస్‌గఢ్‌లో బీజాపూర్ ఎస్పీ ఎదుట 50 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో 10 మంది మహిళలు ఉన్నారు. వారిలో ఆరుగురిపై రూ.8లక్షల, 13మందిపై రూ.68లక్షల రివార్డ్ ఉంది.మావోయిస్టు సిద్ధాంతాలకు దూరంగా ఉండాలని నిశ్చయించుకువడం, వారి సీనియర్ కేడర్ స్థానిక గిరిజనుల్ని దోచుకోవడం, అంతర్గత విభేదాల కారణంగా లొంగిపోయినట్లు బీజాపూర్ సీనియర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా వారికి పునరావసం కల్పిస్తామని చెప్పారు.అయితే, మార్చి 31, 2026లోపు నక్సలిజాన్ని నిర్మూలించేందుకు కేంద్రం కట్టుబడి మిగతా 2లో..

### మనమంతా కలిసికట్టుగా ఉండి

## ఐక్యతా స్ఫూర్తిని బలోపేతంచేద్దాం

### ప్రపంచవ్యాప్తంగా భారత సంస్కృతి ప్రతిబింబిస్తోంది: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ(జనంసాక్షి):విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'మన్‌కీ బాత్' 120వ కార్యక్రమంలో ప్రధాని ఈ పండుగ ప్రాముఖ్యాన్ని వివరించారు.దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తనకు ఉగాది శుభాకాంక్షలు అందాయని తెలిపారు. భారత్‌లోని ఆయా పండుగల గురించి ఆయన ప్రసంగించారు. ''భారత్‌లో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి ఆయా భాషల్లో నాకు శుభాకాంక్షలు అందాయి. బిహార్, బెంగాల్, తమిళనాడు, గుజరాత్ ఇలా ఎన్నో ప్రాంతాల నుంచి లేఖలు వచ్చాయి. ఈ రోజు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉగాది.. మహారాష్ట్రలో గుడి పద్వా పేరుతో నూతన సంవత్సరానికి ప్రజలు ఆహ్వానం పలుకుతున్నారు. మరి కొన్ని రోజుల్లో అస్సాంలో రొంగాలి బిహు, బెంగాల్‌లో పొయిలా బోయిషాఖ్, కాశ్మీర్‌లో నవ్రేహ్ మిగతా 2లో..



### హిమాచల్‌ప్రదేశ్‌లో

## విరిగిపడ్డ కొండచరియలు

### భారీ వృక్షాలు వాహనాలపై పడటంతో ఆరుగురు మృతి

శిమ్లా(జనంసాక్షి): హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. కొండచరియలు, చెట్లు విరిగి వాహనాలపై పడడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలోని కులు సమీపంలో ఉన్న పర్యాటక ప్రాంతంలో ఆదివారం సాయంత్రం బలమైన గాలులు వీచాయి.అదే సమయంలో అటు నుంచి వెళుతున్న వాహనాలపై మిగతా 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో 50 మంది మావోయిస్టుల లొంగుబాటు



ఉంది. ఆ దిశగా మావోయిస్టులను ఏరిపారేస్తుంది. శనివారం శనివారం ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, బీజాపూర్ జిల్లాల్లో భద్రతా దళాలు రెండు ప్రాంతాల్లో జరిపిన ఎదురుకాల్పుల్లో 18 మావోయిస్టులను మట్టుబెట్టాయి. వీరిలో 11 మంది మహిళలు ఉన్నారు. ఆ భారీ ఎన్‌కౌంటర్ జరిగిన కొన్ని గంటల వ్యవధిలో మావోయిస్టులు లొంగిపోయారు.కాగా,ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఇప్పటివరకు మొత్తం 134 మావోయిస్టులు ఎదురుకాల్పుల్లో హతమయ్యారు. వీరిలో 118 మంది బస్తర్ డివిజన్‌లోనే మృతి చెందారు.2024లో, బస్తర్ ప్రాంతంలోని ఏడు జిల్లాల్లో కలిపి మొత్తం 792 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు.

## హెచ్‌సీయూ భూములు అమ్మొద్దు

గత కొద్ది రోజులుగా నిరసన లు ర్యాలీలు చేస్తున్నారు. గచ్చి బౌలి సర్వే నెంబర్ 27 లోని 400 ఎకరాల భూముల వేలా న్ని ఆపాలంటూ హెచ్ సీయూ విద్యార్థులు గత కొద్ది రోజు లుగా ఆందోళన బాట పట్టా రు. ఈ అంశంపై సీఎం రేవం త్ రెడ్డి అక్కడ కొన్ని గుంట నక్కలు చేరాయని అసెంబ్లీలో వ్యాఖ్యానించారు. దీనిపై హెచ్ సీయూ విద్యార్థులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వ్యాఖ్యలకు నిరసనగా శనివారం రాత్రి సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించారు. వారిని పోలీసులు అడ్డుకునే క్రమంలో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పలువురు విద్యార్థులు గాయపడ్డారు. రాత్రి నుండి యూనివర్సిటీ లో పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. ఆదివారం ఉదయం విద్యార్థులు మరోసారి తమ నిరసన వ్యక్తం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అయినా విద్యార్థులు ముందుకు సాగడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. పలువురు విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు. అయితే శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న తమపై పోలీసులు లాఠీచార్జి చేశారని విద్యార్థులు ఆరోపించారు. యూనివర్సిటీ భూముల వేలాన్ని వెంటనే ఆపాలని, ఇక్కడ అనేక జీవజాతులు, వృక్ష సంపద, వైవిధ్యమైన రాళ్లు ఉన్నాయని అన్నారు. విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసిన గచ్చిబౌలి సీఐ, ఇతర పోలీసులపై చర్యలు తీసుకోవాలంటూ విద్యార్థుల తరఫు న్యాయవాదులు జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించనున్నట్లు తెలిపారు.శనివారం పలు ప్రాంతాల్లో జేసీబీలతో చెట్లను నరికి వేస్తున్నట్లు గమనించిన విద్యార్థులు ర్యాలీగా వచ్చి నిరసనలు చేపట్టారు. దీంతో పోలీసులు, విద్యార్థులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలోనే పోలీసులు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. రేవంత్ రెడ్డి సర్కారుకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులను "గుంట నక్కలు"గా వర్ణించిన రేవంత్ రెడ్డి అభ్యంతరకర వ్యాఖ్యలపై విద్యార్థులు మండిపడ్డారు! కాంగ్రెస్ సర్కారు తీరుపై, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఆందోళనకు దిగారు. రేవంత్ రెడ్డి అహంకారపూరితంగా వ్యాఖ్యలను వెనుకకు తీసుకొని, భేషరతుగా క్షమాపణ చెప్పి, %ఎజఖ% భూముల అమ్మకాన్ని ఆపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

## మాస్కో నడిబొడ్డున కలకలం

వివరాల ప్రకారం కారు ఇంజిన్ నుండి మంటలు ప్రారంభమై, వాహనం లోనికి వ్యాపించాయి.అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు అక్కడికి సమీపంలోని రెస్టారెంట్‌లోని సిబ్బంది కారుకు అంటుకున్న మంటలను ఆర్పేందుకు ముందుకు వచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఫుటేజీలో వాహనం నుండి దట్టమైన నల్లటి పొగ రావడం, కారు వెనుక భాగం దెబ్బతిడాన్ని చూడవచ్చు. ఈ పేలుడుకు గల కారణం ఇంకా తెలియరాలేదని, ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని 'ది సన్' పేర్కొంది. ఈ కారును ప్రెసిడెన్షియల్ ఎస్టేట్ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షిస్తుంటుంది. ఇదిలావుండగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆరోగ్యం క్షీణిస్తోందని, ఆయన త్వరలో చనిపోతారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ వ్యాఖ్యానించారు. బుధవారం జరిగిన ఒక ఇంటర్వ్యూలో జెలెన్స్కీ ఈ విధమైన వ్యాఖ్యలు చేశారు. పుతిన్ కారు తగలబడిన ఘటన నేపథ్యంలో ఆయన మరణాన్ని జెలెన్స్కీ ముందే ఊహించారంటూ పలు కథనాలు వెలువడుతున్నాయి. కైవ్ ఇండిపెండెంట్ వెబ్‌సైట్‌లోని వివరాల ప్రకారం యూరోవిజన్ న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో జెలెన్స్కీ మాట్లాడుతూ పుతిన్ త్వరలో చనిపోతారని, ఇరు దేశాల యుద్ధం కూడా త్వరలో ముగుస్తుందని అన్నారు.

## గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ జాబితా విడుదల

అధికారిక వెబ్‌సైట్‌లో దీన్ని అందుబాటులో ఉంచింది. గతేడాది అక్టోబర్‌లో గ్రూప్–1 పరీక్షలు నిర్వహించిన టీజీపీఎస్సీ.. ఈ ఏడాది మార్చి 10న ప్రొవిజినల్ మార్కులు విడుదల చేసింది. తాజాగా జనరల్ ర్యాంకింగ్ జాబితాను అందుబాటులోకి తీసుకొచ్చింది.

## ఎస్పీ నేతకు బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి తనకు బెదిరింపులు వస్తున్నట్లు సమాజ్‌వాదీ పార్టీ జాతీయ ప్రతినిధి తారిఖ్ ఖాన్ పేర్కొన్నారు.గత రెండు నెలలుగా బి గ్యాంగ్‌కు చెందిన వ్యక్తి తనకు ఫోన్‌కాల్స్ చేస్తూ.. బెదిరింపులకు పాల్పడుతున్నా తాను పట్టించుకోలేదని అన్నారు. తాజాగా మరోసారి కాల్ చేసి తాము చంపబోయే వ్యక్తుల జాబితాలో నెక్స్ట్ నువ్వే ఉన్నవంటూ బెదిరించారని.. రెండు రోజులు ఆగితే తాము ఏం చేస్తామో తెలుస్తుందని అన్నారని వెల్లడించారు.వెంటనే ఈ విషయాన్ని ఎస్పీకి, తమ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌కు తెలియజేశానన్నారు. దీనిపై పోలీసు సూపరింటెండెంట్ రామానంద్ ప్రసాద్ మాట్లాడుతూ.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నిజంగానే బిష్ణోయ్ గ్యాంగ్ వ్యక్తులు ఈ కాల్ చేశారా లేక సైబర్ నేరగాళ్ల పనా అనే కోణంలో విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఎస్పీ నేతకు రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పలుమార్లు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి పలుమార్లు సల్మాన్‌ఖాన్‌కు బెదిరింపులు ఎదురయిన విషయం తెలిసిందే. గతేడాది ఏప్రిల్‌లో సల్మాన్ నివాసం ఉంటున్న బాంద్రాలోని గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద ఆ గ్యాంగ్‌కు చెందిన వ్యక్తులు కాల్పులు జరిపారు. సల్మాన్ స్నేహితుడు, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ ని వీరు దారుణంగా హత్య చేయడంతో గతంలో వీరి పేరు తెరపైకి వచ్చింది. ఈ గ్యాంగ్ నాయకుడైన లారెన్స్ బిష్ణోయ్ ప్రస్తుతం జైల్లో ఉన్నాడు. బ్యారక్‌ల్లోకి అక్రమంగా వచ్చే సెల్‌ఫోన్ల ద్వారా అనుచరులతో నిరంతరం టచ్‌లో ఉంటూ హత్యలకు ప్రణాళికలు రచిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. సిద్ధూ మూసేవాలా, బాబా సిద్ధిఖీపై దాడులు ఈవిధంగానే చేసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

# పేదలకు సన్నబియ్యం.. ఓ చారిత్రాత్మక ఘట్టం



1957లోనే రేషన్‌కార్డు దుకాణాలు ప్రారంభించింది కాంగ్రెస్ పార్టీ.ప్రస్తుతం ప్రభుత్వం ఉచితంగా ప్రజలకు సన్నబియ్యం ఇస్తోంది. అయితే, ఉచితంగా వచ్చిన బియ్యాన్ని ప్రజలు రూ.10కి అమ్ముకుంటున్నారు. మిల్లర్లు వాటిని కొని రీసైక్లింగ్ చేసి మళ్లీ రూ.50కి అమ్ముతున్నారు. పేదల నుంచి రేషన్‌బియ్యాన్ని కొన్న మిల్లర్లు రూ. కోట్లలో దందా చేస్తున్నారు. ఆర్థిక పరిస్థితి మెరగవడంతో రాష్ట్ర ప్రజలు సన్న బియ్యానికి మొగ్గు చూపుతున్నారు. అందుకే ప్రజల ఆకాంక్ష మేరకు రేషన్‌కార్డులపై సన్నబియ్యం పథకానికి శ్రీకారం చుట్టాం"అని అన్నారు.భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం సాయుధ పోరాటాలు చేసిన గడ్డ ఇది అని, రజాకార్లకు వ్యతిరేకంగా ఎందరో ప్రాణాలు అర్పించిన గడ్డ ఇదని, రావినారాయణరెడ్డిని దేశంలోనే అత్యధిక మెజార్టీతో లోక్‌సభకు పంపిన గడ్డ ఇదని గుర్తు చేశారు. వచ్చే నెల నుంచి సన్నబియ్యం పంపిణీ ప్రారంభమవుతుందని, దాదాపు 10 లక్షల కొత్త రేషన్‌కార్డులు జారీ కానున్నాయని సీఎస్ శాంతి కుమారి తెలిపారు. సన్నబియ్యం పంపిణీతో ప్రభుత్వంపై రూ.2,800 కోట్ల అదనపు భారం పడుతుందని అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సభలో సీఎం, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.“ ప్రజలకు సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన గత సీఎంకు ఎప్పుడూ రాలేదు. వరి వేస్తే ఉరే అని.. గత సీఎం వరి పండించనివ్వకుండా రైతులను బెదిరించారు. ఈ ప్రభుత్వం మాత్రం సన్న వడ్లపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తోంది. సన్నబియ్యం పథకాన్ని భవిష్యత్‌లో రద్దు చేసే సాహసం ఎవరూ చేయరు. ప్రభుత్వాలు మారినా ఈ పథకం కొనసాగుతుంది. రాష్ట్రంలో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తాం.పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ఎస్ఎల్‌బీసీని పూర్తి చేయలేదు. నల్గొండ జిల్లాపై పగతో ఆ ప్రాజెక్టును పక్కన పెట్టారు. ఏడాదికొక కిలోమీటర్ తవ్వినా పదేళ్లలో పూర్తయ్యేది. ఎస్ఎల్‌బీసీ పూర్తయితే.. నల్గొండ జిల్లాలో లక్షల ఎకరాలకు సాగునీరు వచ్చేది. రూ. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం నిర్మిస్తే.. అది మూడేళ్లకే కూలింది. ప్రపంచంలో ఏడోవింత అని చెప్పుకున్న కాళేశ్వరం.. కూలేశ్వరం అయ్యింది" అని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

**సన్న బియ్యం ఇస్తున్న తొలి రాష్ట్రం తెలంగాణ: ఉత్తమ్**

ఏ రాష్ట్రంలోనూ రేషన్ కార్డులపై సన్నబియ్యం పంపిణీ లేదని, తొలిసారిగా తెలంగాణ రాష్ట్రమే ఇస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఇస్తున్న దొడ్డు బియ్యాన్ని ప్రజలు తినడం లేదన్న ఆయన.. వీటిపై ప్రభుత్వం రూ.10,600 కోట్లు ఖర్చు చేస్తోందని చెప్పారు. “ దొడ్డు బియ్యంపై ప్రభుత్వం కిలోకు రూ.40 ఖర్చు చేస్తోంది. అయినా ప్రజలు వాటిని తినడం లేదు. దీంతో అవి పక్కదారి పడుతున్నాయి. ఇంకొంచెం అధికధరకు కొనుగోలు చేసి సన్నబియ్యం ఇస్తున్నాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు రేషన్‌కార్డులు ఇవ్వలేదు.ఈ ప్రభుత్వం త్వరలోనే కొత్త రేషన్ కార్డులు ఇవ్వనుంది. ఆహార భద్రత చట్టాన్ని చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే" అని ఉత్తమ్ తెలిపారు



## గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటి

కూడా ఉండే అవకాశం ఉంటుందని సమాచారం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలకు మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశం ఉంది. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డితో కలిసి 12 మంది మంత్రులు ఉన్నారు. మరో ఆరుగురికి కేబినెట్ లో చోటు దక్కే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం మంత్రివర్గ విస్తరణలో మరో నలుగురికి మాత్రమే చోటు కల్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరో ఇద్దరికి కొద్దికాలం తర్వాతనే అవకాశం లభించను న్నట్లుగా ప్రచారం జరుగుతోంది. గవర్నర్? భేటీ సుమారు గంటన్నర పాటు కొనసాగింది.

## ఒడిశాలో పట్టాలు తప్పిన రైలు

సీనియర్ రైల్వే అధికారులు సైతం ఘటన స్థలానికి చేరుకున్నారు.ప్రమాదానికి గల కారణాల్ని ఆరా తీస్తున్నారు. మరోవైపు, రైల్వే రాకపోకలకు ఎలాంటి అంతరాయం జరగకుండా రూట్లను మళ్లించారు.

## హిమాచల్‌ప్రదేశ్ విరిగిపడ్డ కొండచరియలు

చెట్లు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి.వెంటనే స్పందించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. శిథిలాల కింద కొందరు స్థానికులు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. వారి కాపాడేందుకు రెస్క్యూ బృందం సహాయక చర్యలు చేపట్టింది. మృతుల గుర్తింపు వివరాలపై ఇంకా స్పష్టత లేదని పోలీసులు పేర్కొన్నారు. వీరిని పర్యాటకులుగా గుర్తించినట్లు తెలిపారు.

## అమెరికాతో ఇరాన్ ప్రత్యక్ష చర్చలుండవు

నేను ప్రాధాన్యం ఇస్తా. ఎందుకంటే ఆ దేశాన్ని దెబ్బతీయాలనుకోవడం లేదు. చర్చలకు వస్తారని ఆశిస్తున్నా. అలా చేయడమే వారికి ప్రయోజనకరం" అని ట్రంప్ పేర్కొన్నారు.

## పండగపూట విషాదం..

చెరువు వద్ద తల్లి మౌనిక దుస్తులు ఉతు కుతుండగా.. చిన్నారులు ముగ్గురూ స్నానానికి దిగారు. చెరువులో భారీ గుంత ఉండటంతో అందులో పడి మునిగి పోయారు. చిన్నారులను కాపాడేందుకు తల్లి యత్నిం చింది. ఈ క్రమంలో తల్లితో పాటు పిల్లలు ముగ్గురూ చెరువులో మునిగి చనిపోయారు. తల్లి, పిల్లలు మృతిచెం దడంతో గ్రామంలో విషాదఛాయలు అలము కున్నాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

# మళ్లీ భూకంపం

ప్రకంపనలు వచ్చినట్లు భూకంపన వైజ్ఞానిక కేంద్రాలు వెల్లడించాయి. తాజాగా మరోసారి భూకంపం రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. భూకంపం వల్ల థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో నిర్మాణంలో ఉన్న ఆకాశహర్మ్యం కుప్పకూలిన ఘటనలో అక్కడ పనిచేస్తోన్న వారిలో 78 మంది కార్మికుల జాడ ఇంకా తెలియరాలేదు. భూకంపం వల్ల నగరంలో చనిపోయిన మరో 10 మందిని శనివారం గుర్తించారు. భారీగా ఉన్న శిథిలాలను తొలగించడానికి శక్తిమంతమైన యంత్రాలను వినియోగిస్తున్నారు. మయన్మార్‌లో భూకంప విలయంలో మరణించిన వారి సంఖ్య 1700 దాటింది. వేలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోగా.. వారిని రక్షించేందుకు పెద్దఎత్తున సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.భూకంపం వచ్చి రెండు రోజులు గడుస్తున్న నేపథ్యంలో శిథిలాల కింద చిక్కుకుపోయిన వారి పరిస్థితిపై ఆందోళన కొనసాగుతోంది. తమవారు సజీవంగా ఉండొచ్చనే ఆశతో అనేకమంది తమ చేతులతోనే శిథిలాలను తొలగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇంకా అనేక ప్రాంతాలకు సహాయక బృందాలు చేరలేదని సమాచారం. దీంతో మృతుల సంఖ్య భారీగా ఉండొచ్చని అంచనా. మరోవైపు.. మృతదేహాల దుర్గంధం మొత్తం వ్యాపిస్తున్నట్లు సమాచారం. మయన్మార్‌లో 7.7 తీవ్రతతో వచ్చిన భూకంపం అనేక నగరాలపై తీవ్ర ప్రభావం చూపింది. ముఖ్యంగా మాండలేలో భారీ భవనాలు, ఆధ్యాత్మిక, పర్యటక ప్రదేశాలతోపాటు అనేక మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వంతెనలు కూలిపోవడం, రోడ్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్న కారణంగా రెస్క్యూ ఆపరేషన్‌కు ఆటంకాలు ఎదురవుతున్నాయి. దీంతో భారీ పరికరాలు లేకుండానే రంగంలోకి దిగిన స్థానికులు.. ఉత్త చేతులతోనే శిథిలాలను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.రెండు రోజులుగా వరుస భూ ప్రకంపనలు మయన్మార్‌వాసులను హడలెత్తిస్తున్నాయి. వరుస ప్రకంపనల కారణంగా దెబ్బతిన్న ఇళ్లు పూర్తిగా



కూలిపోయే ప్రమాదం ఉందనే భయాలు స్థానికుల్లో నెలకొన్నాయి. దీంతో 15 లక్షల జనాభా ఉన్న మాండలేలో చాలావరకు ప్రజలు రాత్రి వేళల్లో వీధుల్లోనే నిద్రపోతున్నారు. ఆదివారం మధ్యాహ్నం 5.1 తీవ్రతతో మరోసారి భూకంపం రావడంతో స్థానికులు కలవరపాటుకు గురయ్యారు.థాయ్‌లాండ్‌లో 33 అంతస్తుల నిర్మాణ భవనం కుప్పకూలిన విషయం తెలిసిందే. అందులో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. అయితే, వారు బతికుండే అవకాశాలు చాలా తక్కువని బ్యాంకాక్ పోలీసులు వెల్లడించారు. ఇప్పటివరకు బయటకు తీసిన వారిలో ఎవరూ ప్రాణాలతో లేరన్నారు. శిథిలాలను పూర్తిగా తొలగించేందుకు కనీసం రెండు నెలల సమయం పడుతుందన్నారు. ఇప్పటివరకు థాయ్‌లాండ్‌లో 17 మంది మరణించగా.. 32 మంది గాయాలపాలయ్యారు. అయితే, భారీ అంతస్తు కుప్పకూలిన ఘటనకు సంబంధించి అక్కడ పనిచేస్తున్న 83 మంది ఆచూకీ తెలియరాలేదని అధికారులు పేర్కొన్నారు.

**334 అణుబాంబుల విధ్వంసంతో సమానం!**

మయన్మార్‌తో పాటు థాయ్‌లాండ్‌లో 12 నిమిషాల వ్యవధిలోనే సంభవించిన రెండు భారీ భూకంపాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఈ భూకంపం 334 అణుబాంబులతో సమానమైన శక్తిని విడుదల చేసి వినాశనం సృష్టించిందని స్థానిక భూవిజ్ఞాన శాస్త్రవేత్త జెస్ ఫీనిక్స్ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో మరిన్ని ప్రకంపనలు వచ్చే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. భారత టెక్టానిక్ ఫలకాలు యురేషియన్ ప్లేట్స్‌ను వరుసగా ఢీకొంటుండడం వల్ల నెలల తరబడి ఆఫ్టర్‌షాక్స్ వచ్చే అవకాశం ఉందని జెస్ ఫీనిక్స్ తెలిపారు. దేశంలో కొనసాగుతున్న అంతర్యుద్ధం కారణంగా మయన్మార్ విపత్తు మరింత తీవ్రమవుతుందని హెచ్చరించారు. కమ్యూనికేషన్‌లో అంతరాయం వల్ల అక్కడి పూర్తిస్థాయి పరిస్థితులను బాహ్య ప్రపంచం గుర్తించడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. భూఉపరితలానికి 10 కి.మీ లోతులోనే ప్రకంపనల కేంద్రాలు ఉన్నాయని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. ఈ విపత్తు కారణంగా మృతుల సంఖ్య 10వేలు దాటే అవకాశం ఉందని అమెరికా ఏజెన్సీ అంచనా వేసింది. కాగా ఇప్పటి వరకూ 1,600 మందికి పైగా మృతి చెందినట్లు అక్కడి సైనిక ప్రభుత్వం ప్రకటించింది.ఈ కష్టసమయంలో అక్కడి ప్రజలకు ఆపన్న హస్తం అందించేందుకు భారత్ ఇప్పటికే ముందుకొచ్చింది. ఆపరేషన్ బ్రహ్మ' కింద దాదాపు 15 టన్నుల సహాయ సామగ్రిని అక్కడికి పంపించింది. బాధితులకు అవసరమైన ఆహారపదార్థాలతోపాటు.. తాత్కాలిక నివాసం కోసం టెంట్లు, స్లీపింగ్ బ్యాగ్స్, వాటర్ ప్యూరిఫయర్లు, సోలార్ ల్యాంప్, జనరేటర్లు, అత్యవసర వైద్య పరికరాలను మయన్మార్‌కు పంపించినట్లు సమాచారం. అంతే కాకుండా విపత్తులో ఉన్న ఆ దేశానికి సాయం చేసేందుకు 80 మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని అక్కడికి పంపుతున్నట్లు పేర్కొంది. అమెరికా, ఇండోనేషియా, చైనా, ఇతర దేశాలు కూడా అవసరమైన సాయం అందిస్తామని ప్రకటించాయి. ప్రభావిత దేశాలకు సహాయక సామగ్రి పంపుతున్నామని ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రటరీ ఆంటోనియో–గుటెరస్ వెల్లడించారు.

## మనమంతా కలిసికట్టుగా ఉండి ఐక్యతా స్ఫూర్తిని బలోపేతం చేద్దాం

వేడుకలు చేసుకుంటారు. మన దేశం భిన్నత్వంతో కూడుకుంది" అని ప్రధాని పేర్కొన్నారు.''వేర్వేరు ప్రాంతాల్లో పండుగలను రకరకాలుగా నిర్వహిస్తారు. అయినప్పటికీ భారత్ భిన్నత్వంలో ఏకత్వంగా ఉంటుంది. మన ఐక్యతను ఇలాంటి ప్రత్యేక సందర్భాలు చూపిస్తాయి. మనమంతా కలిసికట్టుగా ముందుకు వెళ్లే మార్గంలో ఐక్యతా స్ఫూర్తిని బలోపేతం చేస్తూనే ఉండాలి" అని ఆకాంక్షించారు. ఇటీవల మారిషస్ పర్యటనను మోదీ గుర్తు చేసుకున్నారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో భారతీయ సంస్కృతి ప్రతిబింబిస్తోందని అన్నారు. "మారిషస్‌లోని గీత్ గవాయ్ ప్రదర్శన నన్ను ఆకట్టుకుంది. అక్కడి జరిగే ప్రదర్శనలు చూస్తే మన భారత మూలాలు ఇంకా ఉన్నాయని అవగతం అవుతోంది. ఎలాంటి తుపాను వచ్చినా మనల్ని నాశనం చేయలేదు. సుమారు 200 ఏళ్ల క్రితం భారత్ నుంచి ఎంతో మంది కార్మికులుగా మారిషస్ వెళ్లారు. కాలక్రమేణ చాలా మంది అక్కడే స్థిరపడ్డారు. వారికంటూ ప్రత్యేక గుర్తింపు సాధించారు. భారత్ మూలాలను కాపాడుతున్నారు. అదేవిధంగా గయానాలో కూడా చౌతల్ ప్రదర్శన అద్భుతంగా అనిపించింది. ఫిజి, సురినామ్‌లలో కూడా భారతీయ సంస్కృతి కనిపిస్తోంది" అని తెలిపిన మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది యోగా దినోత్సవం 'వన్ ఎర్త్ వన్ హెల్త్' థీమ్‌ను ఆయన వెల్లడించారు.



**దేశ సంస్కృతికి ఆరెస్సెస్ 'మహావృక్షం': ప్రధాని మోదీ**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను దేశ అజరామర సంస్కృతికి మహావృక్షంగా ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 11 ఏళ్ల క్రితం ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి ఆయన నాగ్‌పుర్‌లోని ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. తొలుత డా.హెడ్గేవార్ స్మృతి మందిరానికి వెళ్లిన ప్రధాని.. సంస్థ వ్యవస్థాపకుడు కేబీ హెడ్గేవార్, రెండో సర్‌సంఘ్‌చాలక్ ఎంఎస్ గోల్వాల్కర్‌లకు నివాళులు అర్పించారు. అనంతరం 1956లో డా.బీఆర్ అంబేద్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన 'దీక్షభూమి'ని సందర్శించారు. అదేవిధంగా మాధవ్ నేత్రాలయ ప్రీమియం సెంటర్‌కు శంకుస్థాపన చేశారు.''భారత సంస్కృతి, ఆధునికీకరణకు ఆరెస్సెస్ మర్రిచెట్టులాంటిది. ఈ సంస్థ సేవకు పర్యాయపదం. సంఘ్ కార్యకర్తలు వివిధ రంగాల్లో నిస్వార్థంగా పనిచేస్తున్నారు. గత వందేళ్లలో ఆరెస్సెస్ చేసిన తపస్సు.. దేశం 'వికసిత్ భారత్' దిశగా సాగుతున్న తరుణంలో ఫలాలు ఇస్తోంది. రాజ్యాంగానికి 75 ఏళ్ల వేడుక వేళ.. ఆరెస్సెస్ వందేళ్లు పూర్తి చేసుకుంటోంది" అని ప్రధాని మోదీ అన్నారు. సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ మాట్లాడుతూ.. నిస్వార్థ సేవ అనేది తమ సిద్ధాంతమని తెలిపారు. ప్రజలకు సరైన ఆరోగ్య సౌకర్యాలు లేకపోవడం మంచిది కాదని, అందువల్ల.. మాధవ్ నేత్రాలయలో ఆరెస్సెస్ వాలంటీర్లు పేదలకు సేవలందిస్తున్నారని చెప్పారు.డా.బీఆర్ అంబేద్కర్ 'దీక్షభూమి'ని సామాజిక న్యాయం, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించే చిహ్నంగా ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత కలలుగన్న దేశాన్ని సాకారం చేసేందుకు మరింత కష్టపడి పనిచేయాలనే ప్రభుత్వ నిబద్ధతను చాటిచెప్పారు. అభివృద్ధి చెందిన, సంఘటిత భారత్‌ను నిర్మించడమే.. అంబేద్కర్‌కు నిజమైన నివాళి అని తెలిపారు. మోదీ చివరిసారిగా 2017లో దీక్షభూమిని సందర్శించారు. అదేవిధంగా అటల్ బిహారీ వాజ్‌పేయీ అనంతరం ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన రెండో సిట్టింగ్ ప్రధానిగా నిలిచారు. నాగ్‌పుర్‌లోని 'సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్' మందుగుండు సామగ్రి కేంద్రాన్నీ సందర్శించారు.

## హైదరాబాద్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొస్తాం

రావాలంటే శాంతిభద్రతలు అదుపులో ఉండాలి. దేశానికి తెలంగాణ ఆదర్శంగా ఉండేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం. మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి యత్నిస్తున్నాం. ఫ్యూచర్ సిటీ.. ప్రజలు నివసించే నగరమే కాదు.. పెట్టుబడుల నగరం. లక్షలాది మందికి ఉపాధి కల్పించేలా ఫ్యూచర్ సిటీ నిర్మాణం ఉంటుంది. అభివృద్ధి జరుగుతున్నప్పుడు కొన్ని అడ్డంకులు తప్పవు. ఏ విధానానికీ నూటికి నూరు శాతం ఆమోదం ఉండదు.శ్రీమంతుల మాదిరే పేదలూ సన్నబియ్యం తినాలని ఆకాంక్షిస్తున్నారు. గతేడాది 1.56 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తిని సాధించాం. దేశంలోనే అత్యధికంగా వరి పండించిన రాష్ట్రం తెలంగాణ. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇంత భారీగా ఉత్పత్తి జరగలేదు. సన్న బియ్యం పండిస్తే బోనస్ కూడా ఇస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 60-65 శాతం మంది సన్నబియ్యం పండిస్తున్నారు" అని సీఎం రేవంత్ వివరించారు. వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అర్చకులు భద్రాచలం రాములవారి కల్యాణానికి రావాలని ఆహ్వానిస్తూ కల్యాణ పత్రికను సీఎంకు అందజేశారు. పండితులు బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. "రియల్ ఎస్టేట్ రంగం తెలంగాణలో ఈ ఏడాది పరుగులు పెడుతుంది. తెలంగాణ రాష్ట్రం మిథున రాశి, పునర్వసు నక్షత్రంలో ఆవిర్భవించింది. పాలకుల మధ్య పోటీతత్వం పెరుగుతుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులు, పాలకులు పోటీపడి పరుగులుపెట్టి పాలిస్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలు మెచ్చే విధంగా పాలన చేస్తారు. తెలంగాణలో వర్షాలకు ఇబ్బంది లేదు, పంటలు అద్భుతంగా పండుతాయి. ఎర్రరేగడి భూములు, ఎర్రటి ధాన్యాలు మంచి ఫలితాలు ఇస్తాయి. శాంతి భద్రతల విషయంలో నిరంతరం పోలీసులు జాగ్రత్తంగా ఉండి పనిచేస్తారు. రాష్ట్రంలో పాడి పంటలు సమృద్ధిగా ఉంటాయి. తుపాన్లు, భూకంపాలు అప్పుడప్పుడు పలకరించవచ్చు. ఆర్థిక భారం ఎక్కువగానే ఉంటుంది. ప్రజలకు డబ్బు బాగానే సిద్ధిస్తుంది. ఈ ఏడాది ప్రజలు అత్యంత సంతోషంగా ఉంటారు. రాష్ట్రానికి రావాల్సిన డబ్బు రాకపోవడంతో కొంత ఇబ్బంది ఉంటుంది. పొరుగు రాష్ట్రాలతో నీటి విషయంలో ఇబ్బందులను వాటిని ముఖ్యమంత్రి అధిగమిస్తారు. ప్రభుత్వం ఈ ఏడాది విద్యా వ్యవస్థకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. విద్య, వైద్యంపై ఎక్కు వగా దృష్టి పెడుతుంది. సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుంది.



# టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం

- ఆ డిపోలకు కొత్త యంత్రాలు

**హైదరాబాద్, మార్చి 30 (జనంసాక్షి) :** ఆర్టీసీ సంస్థ వినూత్న మార్గాలను అన్వేషిస్తోంది. ఈ-టిమ్ యంత్రాలను బస్సుల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ యంత్రాల ద్వారా ప్రయాణికులు తమ ఫోన్ ద్వారా ఫోన్ పే, గూగుల్ పే, స్వైపింగ్ కార్డులతో టికెట్ కొనుగోలు చేసుకోవచ్చు. ఈ విధంగా.. నగదు వ్యవహారాలను పూర్తిగా తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. ఇప్పటికే తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఈ యంత్రాలు అందుబాటులోకి రాగా.. ఇంకా చాలా జిల్లాల్లో ఈ యంత్రాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. తాజాగా గోదావరిఖని, మంథని డిపోలకు ఈ-టిమ్ యంత్రాలు ప్రాయోగికంగా అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం గోదావరిఖనికి 130, మంథని డిపోకు 60 యంత్రాలు కేటాయించబడినవి. ప్రయాణికులు ఈ-టిమ్ ద్వారా ఎటువంటి చిల్లర సమస్య లేకుండా.. తమకు కావలసిన నగదు చెల్లించుకొని టికెట్ సులభంగా పొందవచ్చు. ఈ విధానం కండక్టర్లపై పడే ఒత్తిడిని తగ్గించి.. ప్రయాణికుల ప్రయాణ అనుభవాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చుతుంది. ఈ రెండు డిపోల్లో బస్సులు ప్రతి రోజు సుమారు 60,000 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. ఈ బస్సుల ద్వారా.. ఆర్టీసీకి రోజుకు సుమారు 21 లక్షల రూపాయల ఆదాయం వస్తోంది. అంతేకాక.. రాయితీ పాస్‌ల ద్వారా కూడా రోజుకు 10 లక్షల రూపాయల ఆదాయం వస్తుంది. అయితే.. నగదు లావాదేవీలు ఎక్కువగా ఉండటం వల్ల చిల్లర సమస్యలు ముందుకు వస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి.. ఆర్టీసీ ఈ-టిమ్ యంత్రాలను బస్సుల్లో ప్రవేశపెట్టడం ద్వారా దాని ప్రభావాన్ని తగ్గించడం సాధ్యమైంది. ఈ-టిమ్ యంత్రాలను ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అన్ని ఆర్టీసీ బస్సుల్లో అందుబాటులోకి తీసుకురావాలని ఆర్టీసీ ప్రతిపాదనలు చేసింది. ఈ యంత్రాలను ఇప్పటికే ఆయా డిపోలకు పంపించి.. వాటిని సరిగా ఉపయోగించేందుకు కండక్టర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు గోదావరి ఖని ఆర్టీసీ డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. తద్వారా.. ప్రయాణికులు టికెట్ తీసుకున్న తర్వాత.. గమ్యస్థానంలో చిల్లర సమస్యల నుండి విముక్తి పొందగలుగుతారు. ఇక.. పల్లెవెలుగు నుండి సూపర్ లగ్జరీ వరకు అన్ని రకాల బస్సుల్లో ఈ-టిమ్ యంత్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సాంకేతిక మార్పులు.. ప్రయాణికులకు, కండక్టర్లకు చాలా ప్రయోజనకరంగా మారాయని.. అది రవాణా రంగంలో మరింత సమర్థతను సాధించడంలో సహాయపడుతుందని అన్నారు.

# మరింత సౌకర్యంగా మెట్రో





**హైదరాబాద్, మార్చి 30 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగర రవాణాలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న ఎల్ అండ్ టి మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్ తాజా ప్రకటన చేసింది. ప్రయాణికులకు అనేక సౌకర్యాలు కల్పించింది. ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా, సులభంగా ప్రయాణించేందుకు వీలుగా డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రైలు సమయాలను మెట్రో పొడిగించింది. ఏప్రిల్ 1, 2025 నుంచి టెర్మినల్ స్టేషన్ల నుంచి చివరి రైలు రాత్రి 11:45 గంటలకు బయలుదేరుతుంది. అలాగే, ఆదివారాల్లో మొదటి రైలు ఉదయం 7 గంటలకు బయలుదేరుతుంది.

**విద్యార్థులకు ప్రత్యేక ఆఫర్**

విద్యార్థుల కోసం అందిస్తున్న ప్రత్యేక ఆఫర్‌ను మరో ఏడాది పొడిగించింది. 20 ట్రిప్పులు చెల్లిస్తే 30 ట్రిప్పులు ప్రయాణించే అవకాశం మార్చి 31, 2026 వరకు అందుబాటులో ఉంటుందని మెట్రో యాజమాన్యం తెలిపింది.

**కొత్త టి-సవారీ మొబైల్ యాప్, వెబ్‌సైట్**

ప్రయాణికుల కోసం కొత్త టి-సవారీ మొబైల్ అప్లికేషన్‌ను, నూతనంగా రూపొందించిన హైదరాబాద్ మెట్రో ప్రయాణీకుల వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. సూపర్ సేవర్ హాలిడే ఆఫర్, ఆఫ్-పీక్ డిస్కౌంట్ ఆఫర్ మార్చి 31, 2025తో ముగుస్తాయి.

**ప్రయాణికులకు మరింత చేరువవుతాం : హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్.వి.ఎస్ రెడ్డి**

హైదరాబాద్ మెట్రో కేవలం రవాణా వ్యవస్థ మాత్రమే కాదని, నగర అభివృద్ధికి దోహదపడుతుందని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్.వి.ఎస్ రెడ్డి అన్నారు. మెట్రో ఫెస్ట్, మెట్రో మెడ్లీ, ఆర్ట్ ఫెస్ట్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరుస్తున్నామని తెలిపారు. ఎల్అండ్ టీ ఎమ్ఆర్‌హెచ్ఎల్ ఎండీ, సీఈఓ కెవిబి రెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించడానికి డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. టి-సవారీ యాప్, కొత్త వెబ్‌సైట్ ద్వారా హైదరాబాద్ మెట్రోను డిజిటల్‌గా మరింత అభివృద్ధి చేశామని చెప్పారు.

# నేడూ పని చేయనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు!

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పని చేయాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు
- మార్చి 31 వరకు ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ ఇస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, మార్చి 30 (జనంసాక్షి) :** రాష్ట్రంలో మార్చి 31వ తేదీన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. మార్చి 31న సెలవు దినంగా ప్రకటించినప్పటికీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేయాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్ఆర్ఎస్ అమలులో భాగంగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. గత నాలుగేళ్లుగా పెండింగులో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు కల్పించింది. ఎల్ఆర్ఎస్ ఫీజులోనూ 25 శాతం రాయితీ ఇవ్వనుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే నేరుగా క్రమబద్ధీకరణ ఫీజును చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించింది. మార్చి 31వ తేదీ లోగా ఫీజు చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపింది. అయితే, మార్చి 30, 31 సెలవు దినాలు కావడంతో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపునకు వీలు కల్పించేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పని చేసేందుకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రజల నుంచి కూడా విజ్ఞప్తులు వచ్చాయి.

# కరప్షన్‌కు బ్రాండ్ అంబాసిడర్ బీజేపీ

- మంత్రి సీతక్క షాకింగ్ కామెంట్స్



సూర్యాపేట: తెలంగాణలో కేంద్ర ప్రభుత్వమే సన్నబియ్యం పంపిణీ చేస్తుందని.. 56 లక్షల రేషన్ కార్డులకు కేంద్రమే సన్నబియ్యం ఇస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కేంద్రం సన్న బియ్యమిస్తే.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటో ఎందుకు పెట్టడం లేదని రేవంత్ ప్రభుత్వాన్ని బండి సంజయ్ ప్రశ్నించారు. ఈ విషయంపై మంత్రి సీతక్క స్పందించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన పన్నెండేళ్లలో సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన ఎందుకు రాలేదో కేంద్రమంత్రి బండి సంజయ్ చెప్పాలని మంత్రి సీతక్క ప్రశ్నించారు. ఇవాళ(ఆదివారం) సూర్యాపేటలోని పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి నివాసంలో మంత్రి సీతక్క మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటో పెట్టాలని బండి సంజయ్ అన్నారని.. కానీ బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వడం లేదో సమాధానం చెప్పాలని మంత్రి సీతక్క నిలదీశారు. కరప్షన్‌కు బ్రాండ్ అంబాసిడర్ బీజేపీ ప్రభుత్వమేనని, అంబానీలకు పేదల సంపదను ప్రధాని దోచిపెట్టారని ఆరోపించారు. ఇందులో బీజేపీ నాయకులు వాటాలు తీసుకుంటున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో ఒక రూపాయి పంపిస్తే రూ.48 పైసలే తిరిగి వస్తున్నాయని చెప్పారు. మరి కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఫొటోలు పెడతారా అని మంత్రి సీతక్క ప్రశ్నించారు.

# పండగ రోజూ దీక్షలోనే..

- డంపింగ్‌యార్డుపై పోరాటమే ధ్యేయంగా..



**సంగారెడ్డి, మార్చి 30 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రజలంతా విశ్వావసు తెలుగు సంవత్సరాది ఉగాదిని సంతోషంగా నిర్వహించుకుంటుంటే ఇక్కడి గ్రామాల ప్రజలు మాత్రం ఉగాది పండుగను జరుపుకోకుండా డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ)కు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేసి ఇక్కడి గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని రిలే నిరాహారదీక్ష చేశారు.

ఇవాళ సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో జీహెచ్ఎంసీ అధికారులతో రాంకీ సంస్థ నిర్మిస్తున్న డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)ను రద్దు చేయాలని నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామాల ప్రజలు 54వ రోజు రిలే నిరాహారదీక్షలో పాల్గొన్నారు. కాగా నేడు ఉగాది కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉగాది పండుగను నిర్వహించుకుంటుంటే.. ఈ గ్రామాల ప్రజలు మాత్రం మా గ్రామాల ప్రజలకు, భావితరం చిన్నారులకు న్యాయం జరగాలని ఆవేదనతో రిలే నిరాహారదీక్ష చేయడం చూస్తుంటే శత్రువుకైనా కన్నీరు రావలసిందే.

**రాష్ట్ర ప్రభుత్వం స్పందించదా..?**

కానీ గత 54 రోజులుగా డంపింగ్‌యార్డును రద్దు చేయాలని దీక్షలు, ఆందోళనలు చేస్తున్నప్పటికి ఇప్పటి వరకు రాష్ట్రపాలకులు, జిల్లా యంత్రం కనీసం మానవతాదృక్పథంతో కూడా స్పందించకపోవడం విచారకరం. పండుగకు దూరమై ఆందోళనకు దగ్గరై ఆందోళనలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించదా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రిలే నిరాహారదీక్షలో జేఏసీ నాయకులు, మహిళలు, గ్రామస్తులు మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డు వల్ల మా గ్రామాల ప్రజలకు, వాతావరణానికి, భూగర్భజలాలకు, అడవిలోని వన్యప్రాణులకు హానీ పొంచి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి గ్రామాల ప్రజలన మనోవేదనను చూసైనా డంపింగ్‌యార్డు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కుమ్మరి ఆంజనేయులు, మన్నె రామకృష్ణ, కొరివి సురేశ్, రాజుగౌడ్, మహిళా జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

# కాచవరంలో భట్టి ఉగాది సంబరాలు

- గ్రామస్తులతో డిప్యూటీ సీఎం భట్టి మాటామంతి
- ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలపై ఆరా



**మధిర, మార్చి 30 (జనంసాక్షి) :** ‘మీ అందరికీ జీరో బిల్లులు వస్తున్నాయా.. రైతు భరోసా డబ్బులు వచ్చాయా.. వంట గ్యాస్ సబ్సిడీ డబ్బులు పడుతున్నాయా ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుతెన్నులు గురించి కాచవరం గ్రామస్తులతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముచ్చటించారు. ఉగాది పండుగ నాడు గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్నామని కాచవరం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఉగాది పండుగను పురస్కరించుకొని శనివారం సాయంత్రం కాచవరం గ్రామంలోని ఓం శ్రీ పార్వతి సమేత అమృత లింగేశ్వర స్వామి వారి దేవాలయంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామస్తులతో ముచ్చటించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల హామీల లో భాగంగా 2024 మార్చి నుంచి గృహజ్యోతి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నది. 200 యూనిట్ల లోపు విద్యుత్తు వాడుతున్న గృహ వినియోగదారులకు జీరో బిల్ వస్తున్నది. వీరికి సంబంధించిన డబ్బులను ప్రతినెల ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లిస్తున్నది. అయితే ఈ పథకం ద్వారా కాచవరం గ్రామంలో ఎంత మంది లబ్ధి పొందుతున్నారు? విద్యుత్తు సరఫరా ఎలా ఉంది? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని గ్రామస్తులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 200 వరకు కుటుంబాలు ఉన్నాయని, 90 శాతం మంది అనగా దాదాపు 180 కుటుంబాలు జీరో బిల్లు ద్వారా లబ్ధి పొందుతున్నామని, గత ప్రభుత్వంలో కంటే మన ప్రభుత్వం విద్యుత్తు సరఫరా చాలా నాణ్యతగా ఇస్తున్నదని రైతులు ఆనందంతో చెప్పారు. కాచవరం గ్రామానికి సంబంధించి జీరో బిల్లులు మరియు వ్యవసాయ కనెక్షన్లకు అందిస్తున్న ఉచిత కరెంటుకు సంబంధించిన విద్యుత్తు సబ్సిడీ డబ్బులను లబ్ధిదారుల పక్షాన 31 లక్ష రూపాయలు ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లించిందని ఏఈ అనూష ఉపముఖ్యమంత్రి కి వివరించారు. అక్కడ ఉన్న రైతులను ఉద్దేశించి రైతు భరోసా డబ్బులు మీ బ్యాంకు ఖాతాల్లో పడ్డాయా అని అడుగగా నాలుగైదు ఎకరాలు ఉన్న రైతులు అందరికీ రైతు భరోసా డబ్బులు బ్యాంకు ఖాతాల్లో పడ్డాయని సమాధానం చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద వంటగ్యాసు సిలిండర్ ప్రభుత్వం 500 రూపాయలకే ఇస్తుందని, సబ్సిడీ డబ్బులు మీ బ్యాంకు ఖాతాలో పడుతున్నయా అని మహిళలను ఆరా తీశారు. గ్రామంలో 90 మంది కుటుంబాలకు వంట గ్యాస్ సబ్సిడీ డబ్బులు వచ్చాయని మహిళలు చెప్పారు. పొదుపు సంఘం లో ఉన్న మహిళలకు ఇందిరమ్మ డైరీ పథకంలో సబ్సిడీపై గేదెలను ఇస్తామని చెప్పారు. కాచవరం గ్రామంలో రేషన్ షాపు లేనందున లక్ష్మాపురం గ్రామానికి వెళ్లి తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉందని గ్రామంలోనే రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కొంతమంది మహిళలు తమకు ఇల్లు లేవని ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించాలని ఉప ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేయగా, ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి అయ్యిందని గ్రామంలో ఇంటి స్థలం ఉండి ఇల్లు లేనటువంటి వారికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ కమిటీలు పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను పంపించాలని సూచించారు.


“ఎండలకు పాణం బాగుండట్లేదు. నిన్ను చూస్తానో.. చూడనో అనుకున్నా. నెల రోజుల నుంచి నిన్ను చూడాలని ప్రాణం కొట్టుకుంటున్నది. సార్ వస్తే నా ఇంటికి తీసుకురమ్మని మన నాయకులకు చెప్పాను. పండుగ రోజున నన్ను చూడడానికి నా ఇంటికి వచ్చి పలకరించినవ్. నాకు చాలా ఆనందంగా ఉంది అంటూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆలింగనం చేసుకొని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు కేవిస్ నర్సమ్మ భావోద్వేగానికి గురైంది. నరసమ్మ గారు ఎలా ఉన్నారు? బాగున్నావా? ఆరోగ్యం ఎట్లా ఉంది అంటూ ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితి గురించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అడిగి తెలుసుకున్నారు. ఉగాది పండుగ నాడు కాచవరం గ్రామానికి విచ్చేసిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారికి ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ శ్రేణులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఘనంగా స్వాగతం పలికారు మహిళలు మంగళహారతులు పట్టారు.



# బెర్లిన్‌లో తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు

**హైదరాబాద్, మార్చి 30 (జనంసాక్షి) :** ఉగాది పండగను ఆదివారం జర్మనిలోని బెర్లిన్ నగరంలో ఘనంగా నిర్వహించారు. జర్మని తెలంగాణ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రఘు చలిగంటి ఆధ్వర్యంలో బెర్లిన్‌లోని గణేష్ ఆలయంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఈ సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ తాము సాంప్రదాయంగా ఉగాది పంచాంగం, ఉగాది పచ్చడితో పాటు రుచికరమైన తెలంగాణ ఆహార పదార్థాలను వండుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో జర్మని తెలంగాణ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వెంకటరమణ బోయిన్‌పల్లి, కార్యదర్శి అలేఖ్య బోగా, సాంస్కృతిక కార్యదర్శి శరత్‌రెడ్డి, యోగానంద్, శ్రీనాథ్, నటీష్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు జ్ఞానోదయం కలిగించాలి



- హామీలపై మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, మార్చి 30: కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా వారికి భగవంతుడు జ్ఞానోదయం కలిగించాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఏడాదిన్నరగా ఎదురు చూస్తూ ఆశల పల్లకిలో ఊగిసలాడుతున్నా ప్రజల కలలు సాకారం కావాలని ఆకాంక్షించారు. కల్హేర్ గ్రామానికి చెందిన పోచబోయిన మాణిక్యం-కవితల కూతురుకు మంజూరైన రూ.27 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని తెలుగు విశ్వావసు నూతన సంవత్సరంలోనైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు పంపిణీ చేస్తామన్న సంక్షేమ పథకాలను అందించేలా వారికి భగవంతుడు జ్ఞానోదయం కలిగించాలని ఆకాంక్షించారు. ఈ ప్రాంత ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని భగవంతున్ని కోరుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, పార్టీ అధ్యక్షుడు రాంసింగ్, మాజీ అధ్యక్షుడు నారాయణరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు పండరి, నాయకులు ప్రభుగౌడ్, గంట విఠల్, రవిందర్‌రెడ్డి, సాయిరాం, సత్యగౌడ్, నర్సింహగౌడ్, సాయిలు, ప్రశాంత్‌సాగర్, రాజు, రఘుగౌడ్, శివరాం నాయక్, జనార్ధన్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానపీఠంపై నిలిచిన 'శుక్లా'





భారతదేశ అత్యున్నత సాహిత్య పురస్కారమైన జ్ఞానపీఠ్ అవార్డును సాహిత్యం, సృజనాత్మకత, విలక్షణమైన రచనా శైలిలో అద్భుతమైన చేసిన కృషికి గాను ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన చిన్న కథా రచయిత, కవి, వ్యాసకర్త, సమకాలీన రచయితలలో ఒకరైన ప్రముఖ హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా 59వ గ్రహీతగా ఎంపికయ్యారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి ఈ అత్యున్నత సాహిత్య పురస్కారాన్ని అందుకున్న తొలి రచయితగా వినోద్ కుమార్ శుక్లా నిలిచారు. ఈ అవార్డుకు ఎంపికైన 12వ హిందీ రచయితగా శుక్లా గుర్తింపు పొందారు. జ్ఞానపీఠ్ అవార్డు ఎంపిక సందర్భంగా వినోద్ కుమార్ శుక్లా మాట్లాడుతూ 'ఇది ఒక పెద్ద అవార్డు అని, ఈ అవార్డు తన బాధ్యతను కూడా గుర్తిస్తుందని', తనకు ఇలాంటి గుర్తింపు లభిస్తుందని ఎప్పుడూ ఊహించలేదంటూ శుక్లా ఆనందం వ్యక్తం చేశారు. "నేను జీవితంలో చాలా చూశాను, చాలా విన్నాను, చాలా అనుభవించాను. కానీ నేను కొంచెం మాత్రమే రాయగలిగాను. నేను ఎంత రాయాలో ఆలోచించినప్పుడు చాలా మిగిలి ఉన్నట్లు అనిపిస్తుంది. నేను సజీవంగా ఉన్నంత వరకు, నా మిగిలిన రచనలను పూర్తి చేయాలనుకుంటున్నాను కానీ నా పనిని పూర్తి చేయలేక పోవచ్చు ! దీని కారణంగా నేను చాలా సందిగ్ధంలో ఉన్నాను. నా రచన ద్వారా నా జీవితాన్ని కొనసాగించాలనుకుంటున్నాను. కానీ నా జీవితం వేగంగా ముగింపుకు చేరుకుంటోంది, మరి అంత త్వరగా ఎలా రాయాలో నాకు తెలియదు కాబట్టి నేను కొంచెం విచారంగా ఉన్నాను" 88 ఏళ్ల ఆయన అన్నారు. ఈ గుర్తింపును ఒక బాధ్యతగా అభివర్ణించారు.

**బోధనే తన వృత్తి:**

శుక్లా 1 జనవరి 1937న ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్‌లో జన్మించారు. జబల్‌పూర్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ కృషి విశ్వ విద్యాలయం నుండి వ్యవసాయంలో యం.యస్సీ పూర్తి చేశారు. ఆ తర్వాత రాయ్‌పూర్‌లోని వ్యవసాయ కళాశాలలో లెక్చరర్‌గా చేరారు. ఆయన కవి ముక్తిబోధ్ చేత చాలా ప్రేరణ పొందారు. ఆయన అప్పట్లో రాజ్‌నందగావ్‌లోని దిగ్విజయ్ కళాశాలలో హిందీ లెక్చరర్‌గా పనిచేశారు. ఆయన బోధనను వృత్తిగా ఎంచుకుని సాహిత్య సృష్టిపై దృష్టి సారించారు.

**ప్రయోగాత్మక రచనలు:**

ఆయన మొదటి కవితా సంకలనం, "లగ్‌భాగ్ జై హింద్", 1971లో ప్రచురించబడింది. "వాహ్ ఆద్మీ చలా గయా నయా గరం కోట్ పెహంకర్ విచార్ కీ తరాహ్" ఆయన రెండవ కవితా సంకలనం. నౌకర్ కీ కమీజ్ (ది సర్వెంట్స్ షర్ట్) ఆయన రాసిన మొదటి నవల. "ఖిలేగా తో దేఖేంగే", "దీవార్ మే ఏక్ ఖిడ్కి", ఉత్తమ హిందీ నవలలుగా. చాలా ప్రజాదరణ పొందాయి. చిన్న కథల సంకలనం పెడ్ పర్ కమ్రా (రూమ్ ఆన్ ది ట్రీ), సబ్ కుచ్ హోనా బచా రహేగా, "మహావిద్యాలయ" లాంటివి ఇతర కవితా సంకలనాలు. "ఆకాశ్ ధరీ కో ఖటక్తా హై" "కవితా సే లంబీ కవితా" లు అతని కవితలు. శుక్లా పిల్లల కోసం పుస్తకాలు కూడా రాశారు. దాదాపు యాభై ఏళ్లుగా సాహిత్య రచనలో నిమగ్నమై ఉన్నారు. ఆధునిక హిందీ సాహిత్యంలో ప్రయోగాత్మక రచనల కొత్త స్రవంతికి మార్గదర్శకుడు. తన కవితలు, కథలు, రచనలు సామాజిక అంశాలను, మానవ సంబంధాలను లోతుగా పరిశీలిస్తాయి. సాధారణ ప్రజల జీవితాలను, వారి కష్టాలను, ఆశలను ప్రతిబింబిస్తాయి. వినోద్ కుమార్ శుక్లా రచనలు సామాజిక వాస్తవికతను ప్రతిబింబిస్తూ, మానవ సంబంధాల లోతులను స్పృశిస్తాయి. తన రచనలతో సమకాలీన హిందీ కవిత్వాన్ని సుసంపన్నం చేసిన ఆయన యావత్ భారతీయ కవితా రంగంలో గుర్తింపు పొందారు. 'మ్యాజికల్-రియలిజం' చుట్టూ సాగే ఒక కళా ప్రక్రియగా అనుభూతి చెందగల ఒక ఉత్తేజకరమైన హావభావాలా ఆయన సాహిత్య శైలి, సంప్రదాయాన్ని విచ్ఛిన్నం చేసి పాఠకులను ఆకట్టుకుంది. జానపద కథలను, ఆధునిక మానవుని సంక్లిష్టమైన అస్తిత్వ ఆకాంక్షల వ్యక్తీకరణను జోడించి ఒక కొత్త కథా నిర్మాణాన్ని ఆవిష్కరించారు. దైనందిన జీవితంలోని కథన గొప్పతనాన్ని అద్భుతమైన నైపుణ్యంతో తన నవలల ద్వారా తెలియజేశారు. మధ్యతరగతి జీవితంలోని అనేక సూక్ష్మాంశాలే విలక్షణమైన పాత్రలుగా రూపుదిద్దారు. ఇవి భారతీయ కథాసృష్టికి ఎనలేని తోడ్పాటును అందించాయి. ఒక కొత్తరకం విమర్శనాత్మక దృక్పథాన్ని ఆవిష్కరించడానికి ప్రేరణ కలిగించిన తన తరం రచయిత ఆయన ఒక్కరే. నేడు ఆయన అత్యంత ప్రజాదరణ పొందిన రచయిత. తన విలక్షణమైన భాషా స్వరూపం, భావోద్వేగ లోతు, అద్భుతమైన సృజనాత్మకతతో భారతీయ ప్రపంచ సాహిత్యాన్ని ప్రత్యేకంగా సుసంపన్నం చేశారు. అందుకే ఆయన రచనలు పాఠకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. వినోద్ కుమార్ శుక్లా కవితలు విస్తృతంగా అనువదించబడ్డాయి. 2015లో ఢిల్లీకి చెందిన రచయిత అఖిల్ కత్యాల్ శుక్ల 'హతాషా సే ఏక్ వ్యక్తి బైత్ గయా'ని ఆంగ్లంలోకి అనువదించారు.

**అవార్డులు:**

1999లో ఉత్తమ హిందీ రచనగా సాహిత్య అకాడమీ అవార్డును గెలుచుకున్న దీవార్ మే ఏక్ ఖిడ్రీ ఉన్నాయి. ఈ నవలను నాటక దర్శకుడు మోహన్ మహర్షి రంగస్థల నాటకంగా రూపొందించారు. ఆయన అనేక ప్రతిష్టాత్మక ప్రశంసలను, ఎన్నో అవార్డులు అందుకున్నారు. వీటిలో గజానన్ మాధవ్ ముక్తిబోధ్ ఫెలోషిప్, రజా అవార్డు ఉన్నాయి. ఆయన రచనలలో నౌకర్ కీ కమీజ్ . దీనిని మణి కౌల్ అదే పేరుతో సినిమాగా రూపొందించారు.


**జ్ఞానపీఠ పురస్కారం:**

భారతదేశపు సాహితీ పురస్కారాల్లో జ్ఞానపీఠ పురస్కారం అత్యున్నతమైంది. దీన్ని టైమ్స్ ఆఫ్ ఇండియా వార్తా పత్రిక వ్యవస్థాపకులైన సాహు జైన్ కుటుంబం ఏర్పాటు చేసిన భారతీయ జ్ఞానపీఠం వారు ప్రదానం చేస్తారు. వాగ్దేవి కాంస్య ప్రతిమ, పురస్కార పత్రం, పదకొండు లక్షల రూపాయల నగదు ఈ పురస్కారంలో భాగం. 1964లో నెలకొల్పబడిన ఈ పురస్కారం మొదటిసారిగా " ఓడక్కుళల్ ( వెదురు వేణువు )" కవితా సంకలనంకు గాను మలయాళ రచయిత జి శంకర కురుప్‌కు 1965లో వచ్చింది. భారతీయ అధికార భాషలలో దేనిలోనైనా రాసే భారత పౌరులు ఈ బహుమతికి అర్హులు. ఐతే ఒక భాషాసాహిత్యానికి ఈ పురస్కారం లభించిన తర్వాత మూడేళ్ళపాటు ఆ భాషాసాహిత్యాన్ని ఈ పురస్కారానికి పరిశీలించరు. ఈ అవార్డు భారత రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చబడిన భారతీయ భాషలలో, ఆంగ్లంలో వ్రాసే భారతీయ రచయితలకు మాత్రమే ఇవ్వబడుతుంది. మరణానంతరం ఎటువంటి ప్రధానం ఉండదు.



జనక మోహన
రావు దుంగ
ఫోన్: 8247045230

## ఆశాకిరణం!



పేరులోనే 'భగ భగ'లు
మన భగత్ సింగ్!
తలుచుకుంటే ఉద్వేగం
ఉద్రేకంతో ఊగిపోతాం!
27 యేళ్ళకే ప్రాణ త్యాగం
అప్పటినుండి ఇప్పటికీ
రోజూఎందరో 'భగత్'లు
ప్రాణత్యాగాలపరంపర!

నీ త్యాగం ఏమైపోయింది?
ఇలా ఎన్నాళ్ళు భగత్?
ఆనాటినుండి ఇప్పటికీ
ఈ దేశం రావణకాష్టం!
దేశమాత రక్షణ కోసం
నువ్వు ఎదిరించిన తీరు
న భూతో న భవిష్యతి!
ఐనా నీ దీక్షా శిక్షణలోనే!
మేము ముందుకు సాగుతాం
మా హృదయం ఆగటంలేదు
కన్నీళ్లు తిరుగుతున్నాయి!
త్యాగాలకు వెరచేది లేదు!


నువ్వుతెల్లవాడినెదిరించావ్
ఇప్పుడు నల్ల దొంగలు ఇంకా
రంగురంగు దొంగల సర్ప
పరిష్వంగంలోప్రజలున్నారు!
వాళ్ళు'లాభాల'కై కార్పొరేట్!

మేంన్యాయంకోసం ఐక్యం
కాలేకపోవటానికి సవాలక్ష
కారణాలు కనిపిస్తున్నాయ్!
కార్పొరేట్ల దోపిడీ కంటే
మనుస్మృతి భావ దోపిడీ
మరీ ప్రమాదంగాఉంది!
ఐనా వదలనువ్వేమాఆశాకిరణం
(భగత్ సింగ్ వర్ధంతి సందర్భం)

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# దళిత ఉద్యమం

## ఆధునిక తెలుగు కవిత్వంపై ప్రభావం



తెలుగు సాహిత్యంలో అనేక మార్పులు చోటుచేసుకున్నా, దళితుల స్వరం ఆవిష్కరించడానికి అనువైన స్థలం దొరకలేదు. ప్రాచీన తెలుగు కవిత్వం ప్రధానంగా రాజులు, భక్తి, ప్రకృతిశోభను వర్ణించగా, ఆధునిక తెలుగు కవిత్వం సామాజిక సమస్యలను ప్రస్తావించేందుకు మార్గం సిద్ధం చేసుకుంది. అయితే, ఇది కూడా ప్రధానంగా మధ్యతరగతి, బ్రాహ్మణీయ పునాదుల చుట్టూ తిరిగింది. విప్లవ రచయితల సంఘం (విరసం) వంటి ఉద్యమాల ప్రభావం ఉన్నప్పటికీ, దళితుల అనుభవాలు కవిత్వంలో ప్రాముఖ్యత పొందిన ఘటనలు చాలా తక్కువ. కానీ, 1970ల తర్వాత దళిత ఉద్యమం కొత్త దిశగా మారినప్పుడు, దళిత కవిత్వం కూడా విప్లవాత్మకంగా ఎదిగింది.

తెలుగు కవిత్వంలో గట్టిగా వినిపించని స్వరాన్ని, దళిత కవిత్వం సమాజానికి స్పష్టంగా వెల్లడించింది. సామాజిక అసమానతల్ని ప్రశ్నిస్తూ, విప్లవానికి ప్రేరణనిచ్చే ధోరణిలో ఇది ముందుకు సాగింది. బ్రాహ్మణీయ ఆధిపత్యం, కుల వివక్ష, అణిచివేత, శోషణ వంటి అంశాలను కేంద్రంగా చేసుకుని దళిత కవిత్వం రూపుదిద్దుకుంది. గుర్రం జాషువా కాలంలోనే దళితుల బాధలు కవిత్వంలో వ్యక్తమైనా, అవి ప్రధానంగా భక్తిరసంతో మిళితమై ఉండేవి. కానీ, 1970ల తర్వాత కనిపించిన కొత్త తరహా దళిత కవిత్వం, మరింత కోపంతో, మరింత విమర్శనాత్మకంగా మారింది.


ఈ కవిత్వం సంస్కృతభాషా ప్రభావాన్ని పూర్తిగా విసర్జించి, ప్రజల భాషలో, జీవన అనుభవాలతో నిండిపోయినదిగా మారింది. మారుమూల గ్రామాల్లో కాథ్యం దుస్తులు వేసుకునే పిల్లల నుండి, పాఠశాలల్లో అవమానాన్ని ఎదుర్కొనే విద్యార్థుల వరకూ, దళితుల జీవితాన్ని నేరుగా ప్రతిబింబించే కవిత్వం వెలువడింది. ఇది కేవలం సాహిత్య ప్రక్రియగా నిలబడకుండా, సామాజిక మార్పుకు దోహదపడే ఉద్యమంగా రూపాంతరం చెందింది. గునుగంటి సురేష్, శివసాగర్, జ్వాలాముఖి, గోపీచంద్ వంటి కవులు ఈ ధోరణిని మరింత బలపరిచారు.

దళిత కవిత్వం ఆధునిక తెలుగు సాహిత్యాన్ని పూర్తిగా ప్రభావితం చేసింది. ఒకప్పుడు కల్పిత కథనాలు, ప్రామాణిక అలంకార శైలిలో సాగిన కవిత్వం, ఇప్పుడు నిరాడంబరంగా, నేరుగా మట్టిలోని వాస్తవాలను ప్రతిబింబించేలా మారింది. విప్లవాత్మక కోణంతో వచ్చిన ఈ కవిత్వం, సామాజిక సమస్యలను మరింత ఉద్ధృతంగా ప్రశ్నించే ప్రయత్నం చేసింది. అది కేవలం భావోద్వేగాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఒక స్పష్టమైన రాజకీయ ఆలోచనను కూడా ముందుకు తెచ్చింది. దళిత కవిత్వం, అంబేద్కర్ ఆలోచనలను మూర్తీభవించిన రూపంగా మారిపోయింది. అయితే, ఈ కవిత్వంపై విమర్శ లు కూడా లేకపోలేదు. కొంత మంది విమర్శ కుల అభిప్రాయం ప్రకారం, ఇది ఒక రాజకీయ ఉద్యమంగా బలపడినప్ప టికీ, సాహిత్య నైపుణ్యం తగ్గిపోయిందని అంటారు. భాష కఠినంగా మారిందని, లోతైన భావనా పరిపక్వత కొరవడిందని అభిప్రాయపడేవారు న్నారు. అలాగే, కేవలం దళితుల కష్టాల్ని మాత్రమే కేంద్రీకరించడం వల్ల, సమాజంలోని ఇతర అన్యాయాలను స్పృశించడంలో పరిమితులు ఏర్పడ్డాయ ని కూడా కొన్ని వాదనలు ఉన్నాయి. ఇది ఎంతవరకు నిజమైనా, దళిత కవి త్వం ఆధునిక తెలుగు సాహిత్యంలో గణనీయమైన మార్పును తీసుకువ చ్చింది. ఇది ప్రజలకు మరింత దగ్గరైన కవిత్వంగా మారింది. దీనిని మరింత విస్తృతమైన ఆలోచనలతో అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది. విప్లవ భావాలను ముందుకు తీసుకువెళ్లడం మాత్రమే కాకుండా, భాషను పరిపక్వం గా మలచడం, సామాజిక వర్గాల మధ్య అవగాహన పెంచడం వంటి అంశాలపై దళిత కవిత్వం మరింత దృష్టి పెట్టాలి. ఇప్పటికీ, ఆధునిక తెలుగు కవిత్వాన్ని ప్రభావితం చేసే ప్రధాన శక్తిగా దళిత కవిత్వం కొనసాగుతూనే ఉంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# బొగ్గు శాఖ మంత్రి చిక్కుల్లో పడ్డారా?



బొగ్గు మంత్రి జి కిషన్ రెడ్డి 9.4.0 కేసులో చిక్కుల్లో పడ్డారు. నిజానికి, 9.4.0 గురించి ప్రస్తావిస్తూ బొగ్గు మంత్రి రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌కు రాసిన లేఖలోని పదాలు అతనివి కావు, కోల్ ఇండియా యాజమాన్యానికి చెందినవి. ఇక్కడ కోల్ ఇండియా యాజమాన్యంతన సొంత మంత్రిని తప్పుదారి పట్టించడానికి ప్రయత్నించిందని చెప్పవచ్చు.


గత రెండు రోజులుగా, బొగ్గు మంత్రి జి కిషన్‌రెడ్డి లేఖ విస్తృతంగా చర్చనీయాంశమవుతోంది, అందులో 27.06.2024న జరిగిన సీఐఎల్ యొక్క అపెక్స్ జాయింట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో ఎన్‌సీడబ్ల్యూ ఏ యొక్క నిబంధన 9.4.0 అమలు విషయం చర్చించబడిందని ఆయన రాశారు. ఈ సమావేశంలో సిఐ ఎల్/అనుబంధ సంస్థలు మరియు బొగ్గు పరిశ్రమలో పనిచేస్తున్న కేంద్ర కార్మిక సంఘాల నిర్వహణ ప్రతినిధులు ఉన్నారు. శాశ్వతంగా వైకల్యం పొందిన ఉద్యోగిపై ఆధారపడిన వారికి ఉపాధి కల్పించడానికి ఎన్సిడబ్ల్యూఏ సెక్షన్ 9.4.0ని తిరిగి వర్తింపజేయడం సాధ్యం కాదని ఏకగ్రీవంగా నిర్ణయించారు.

ఈ లేఖ బహిరంగమైనప్పటి నుండి, బొగ్గు కార్మికులు మరియు యూనియన్లలో కోలాహలం చెలరేగింది. నిజానికి బొగ్గు మంత్రి లేఖలో ప్రస్తావించిన మాటలు కోల్ ఇండియా యాజమాన్యానికి చెందినవి. ఆ లేఖ 27.06.2024న జరిగిన అపెక్స్ కమిటీ సమావేశాన్ని సూచిస్తుంది. "శాశ్వతంగా వైకల్యం ఉన్న ఉద్యోగిపై ఆధారపడిన వారికి ఉపాధి కల్పించడానికి నేషనల్ కోల్ వే జ్ అగ్రిమెంట్ నిబంధన 9.4.0ని తిరిగి ప్రవేశపెట్టడం సాధ్యం కాదు" అని కోల్ ఇండియా ఛైర్మన్ చేసిన ప్రకటనను ఈ కమిటీ మినిట్స్ ఉటంకించాయి. అయితే, "కోల్ ఇండియా మరియు సింగరేణి కోసం 10వ వేతన ఒప్పందం" నుండి అమలులో ఉన్న వేతన ఒప్పందంలోని క్లాజు 6.5.2 ప్రకారం, నిర్దిష్ట వ్యాధులతో బాధపడుతున్న ఉద్యోగులకు వారు వైద్యపరంగా ఆరోగ్యంగా ఉన్నారని ప్రకటించే వరకు వేతనాలలో 50 శాతం చెల్లించడం కొనసాగు తుంది.

బొగ్గు మంత్రి తన లేఖలో ఛైర్మన్ ప్రకటనను ప్రస్తావించారు. 27.06. 2024 నాటి సమావేశంలో 9.4.0 గురించి ఛైర్మన్ ఇచ్చిన ప్రకటనను యూనియన్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఛైర్మన్ మాటలతో ఏ యూనియన్ నాయకుడూ ఏకీభవించలేదు. ఆ సమావేశం యొక్క నిమిషాల్లో అంగీ కారం, అసమ్మతి వంటి పదాల ప్రస్తావన లేదు. శాశ్వతంగా వైకల్యం ఉన్న ఉద్యోగిపై ఆధారపడిన వారికి ఉపాధి కల్పించడానికి వేజ్ బోర్డ్ నిబంధన 9.4.0ని తిరిగి అమలు చేయడం సాధ్యం కాదని ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు బొగ్గు మంత్రి తన లేఖలో ఎందుకు రాశారనే ప్రశ్న ఇప్పుడు తలెత్తుతుంది. డిసెంబర్ 2024లో జరిగిన పార్లమెంటు సమావేశంలో, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ మెడికల్ అన్‌ఫిట్ అంశాన్ని లేవనెత్తారు. ఆ సమయంలో, బొగ్గు మంత్రి మాట్లాడుతూ, 2018 నుండి జరిగిన అపెక్స్ మెడికల్ బోర్డులో కోల్ ఇండియా మరియు దాని అనుబంధ సంస్థలలోని ఏ ఉద్యోగిని వైద్యపరంగా అనర్హులుగా ప్రకటించలేదని అన్నారు. అంటే, డిసెంబర్ 2024లో, బొగ్గు మంత్రి 9.4.0 గురించి ఏదో చెప్పారు మరియు మూడు నెలల తర్వాత మార్చి 2025లో, ఆయన దీనికి విరుద్ధంగా చెప్పారు.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,




## సామాజిక శాస్త్రల అధ్యానాన్నిప్రోత్సహించాలి

మానవుడు సంఘ జీవి అని అరిస్టాటిల్ చెప్పారు. ఏ మనిషి ఒంటరిగా బతకడం అసంభ వం.ఒక దేశ భవిష్యత్తు ఆ దేశ సామాజి క, సాంస్కృతిక, చారి త్రక అంశాల పై ఆధార పడిఉం ది అయితే మారుతున్న కాలం లో తల్లిదండ్రుల ఆలోచనవిధా నం,సమాజం లోవస్తున్నమార్పు లు ఆర్ట్స్ గ్రూప్ ల పట్ల ఆదరణతగ్గి విద్యార్తుల సంఖ్య క్షిణిస్తుం ది.చదువుకున్న మేధా వులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటువేయారకపోవడం మన వ్యవస్థను ప్రతిమబించే రాజ నీతి శాస్త్ర పరిజ్ఞానం లేమినేటి పిల్లలకు మున్సిపా లిటీ, గ్రామ పంచాయతీఅంటే కూడా అవ గాహన లేదు. ప్రభుత్వంకూడా సామాజిక శాస్త్రాలు చదివిన వారికి ప్రత్యేకమైన ఉద్యోగఅవ కాశాలు కల్పించే పాఠ్య ప్రణా ళికలను రూపొందించాలి. టాటా స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ,పూణేలోని ఎకనా మిక్స్ స్టడీస్ లాంటి సంస్థలను రాష్ట్రవ్యాప్తంగా స్థాపించాలి. సామాజిక శాస్త్రాలను చదివి తే ఉద్యోగాలు లభిస్తాయని నమ్మకాన్ని కలిగించాలి ఉదా హరణకు బైపిసి వారికి ఫార్మసీ మరియు వైద్య కోర్సులకు సం బంధించి ఎంపీసీ వారికి ప్రత్యే కంగా ఇంజనీరింగ్ స్ట్రీమ్ లో అవకాశాలు, ఇంటర్ తర్వాత లభిస్తాయి కానీ ఇంటర్ సీఈసీ మరియు హెచ్ ఈ సి ప్రత్యే కంగా జాబు లభించే కోర్సులు లేవు ఆ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలి ఒక దేశ చరిత్ర తెలుసుకుంటే దానిలోని లాభ నష్టాలు ప్రపంచంలో చరిత్ర యొక్క ప్రభావం విషిదమ వుతుంది. సమాజ శాస్త్రాలు మనం మానవ మనుగడ మీద ఎంతో ప్రభావం చూపుతాయి ఈరోజు కుటుంబ వ్యవస్థవిచ్ఛి న్నం అవడం మనిషి ప్రవర్త నలో వింత పోకడ సంత రించుకున్నాయి. వైజ్ఞానికంగా ఎంత అభివృద్ధి చెందిన సంఘ జీవనంలో వ్యక్తిపై సామాజిక శాస్త్రాలు ఎంతో ప్రభావాన్ని చూపుతాయి. ఇంటర్ డిగ్రీ స్థాయిలో ఎన్విరాన్మెంటల్ మరియు నైతిక విద్య కేవలం నామమాత్రంగా మాత్రమే మిగిలింది .దానికి కరికులం లేకపోవడం ఏదో కచ్చితంగా ఎగ్జామ్ రాయాలి అనే భావన మాత్రమే మిగిలిపోయింది. రానురాను సామాజిక శాస్త్రా ల పరిస్థితి కూడా అంతగా దిగజారుతుంది .అందుచేత ఒక దేశ అభివృద్ధిలో సాంఘిక శాస్త్రాలు విశేషమైన ప్రభావా న్ని చూపుతాయి.వాటిని క్షినించ కుండా చూసే బాధ్యతమేధావి వర్గంపై ఎంతో ఉంది.అంతే కాకుండా కస్తూర్బా, గురుకులల్లో ఎచ్ఇ, సిసిఇ. సి కోర్సులు లేవు.దినితో హాస్టల్ లో ఉండి చదువుకోవాలని అనుకునే వారికి అవాకాశం లేకుండా పోతుంది

ఉమాశేషా రావు వైద్య
సీనియర్ లెక్చరర్, 9440408080

# మా ఊరు మహాకావ్యం




తన సృజనాత్మక రచన వ్యాసంగంతో తెలుగు వచన కవిత్వాన్ని సంపన్నం చేస్తున్న మహాకవులలో ఆచార్య ఎన్.గోపి ముఖ్యులు. తీసుకున్న వస్తువును కవితామయం చేయడం దాన్ని దృశ్యమానం చేస్తూ రసమయం చేయడంలోనైతే నేమి దానికి ఒక తాత్విక పునాదిని కల్పించడంలో నైతేనేమీ ఆయనదొక ప్రత్యేక ఒరవడి. ఆయన రాసిన తంగెడు పూలను తడిమిన తారాజువ్వలు రువ్విన తనదైన అభివ్యక్తి ముద్ర ఇట్టే మనకు తెలుస్తుంది. పరిసరాలను, పరిస్థితులను, కవిత్వీకరించడం అది చదివిన పాఠకుడు తన్మయత్వం చెందడం గమనిస్తాం. తంగేడు పూల ద్వారా బోనగిరి ఖిల్లా పై కవితా కేతనం ఎగురవేసి కాలాన్ని నిద్రపోనివ్వనంటూ కవిత్వమే శ్వాసిస్తూ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డున అందుకున్న మహాకవి గోపి. ఆచార్య ఎన్.గోపి ఇప్పటివరకు రచించిన తంగెడు పూలు, చిత్ర దీపాలు, వంతెన, ఎండపొడ, కాలాన్ని నిద్రపోనివ్వను, జల గీతం, వృద్ధోపనిషత్తు, కీలుగుఱ్ఱం, మొదలైన కవితా సంపుటాలతో పాటు నానీల ప్రక్రియను సృష్టించి వందలాది కవులకు ట్రెండ్ సెట్టర్ గా నిలిచారు. పాల్కురికి సోమన చెప్పినట్లు అల్పాక్షరంబుల అనల్పా ర్థ రచనగా వెలువడిన ఈ ప్రక్రియ అనతి కాలంలోనే ప్రాచుర్యంలో కి వచ్చి గోపిని నానీల నాన్నగా మార్చివేశాయి. వచన కవితా పరిణామం లో ప్రభావశీలమైన ప్రక్రియ నానీలు ప్రజాకవి వేమనపై ప్రామాణికమైన పరిశోధన చేసి ఆయన డాక్టరేట్ డిగ్రీని అందుకు న్నారు. డా.గోపి ఎంత గొప్ప కవియో అంత గొప్ప పరిశోధకవియ. వ్యాసనవమి, గవాక్షం, వేమనవాదం, ఆయన సాహిత్య విమర్శ కాగా మారిషస్ యాత్ర, సైప్రెస్ యాత్ర, మొదలైనవి యాత్ర చరిత్రలు. గోపి రచనలకు సంబంధించి విశ్లేషణ చేస్తూ గోపి సాహిత్య దర్శనం, గోపి సాహిత్య వివేచన గ్రంథాలు వెలువడ్డాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులుగా అలాగే తెలుగు విశ్వవి ద్యాలయం ఉపాధ్యక్షులుగా వారు బాధ్యతలు నిర్వహించారు.

ఒకనాడు అచ్చమైన స్వచ్ఛమైన పచ్చదనానికే కాదు ప్రేమాభిమానాలకు మానవ సంబంధాలకు మారుపేరైన పల్లెలు ప్రపంచీకరణ ఆర్థిక సరళీకృత విధానాలు అమల్లోకి వచ్చిన తర్వాత పరాయికరణ చెందాయి. ఈ నేపథ్యంలో చిన్ననాటి తన ఊరు జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూనే సమకాలీన సంఘటనలకు స్పందనగా నాడు గోపి వెలువరించిన కవితా సంపుటి మా ఊరు మహాకావ్యం. గోపి అనగానే చాలామందికి ఆయన రాసిన ఫ్రీడమ్ ఫైటర్, బొంత, పిన్నీసు, తెలుగు అలుగు, మండేలా మొదలైన కవితలు చప్పున గుర్తుకొస్తాయి. కాగా 108 పుటలు గల ఈ సంపుటిలో 60 కవితలు ఉన్నాయి. పుట్టిన ఊర్లో పాఠశాల విద్యను పూర్తిచేసుకుని పట్టణాలకు వెళ్లి అక్కడే చదువు, ఉద్యోగం, ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ ఒక వైపు ఆ పల్లె యాదిని దూరం చేసుకోలేక నగరంలోని నాగరికతతో ఇమడలేక సతమతమయ్యే సగటు మనిషి స్పందనకు అక్షర రూపమా అన్నట్లు గోపి "ప్రజలకన్నా నా కవిత్వం గొప్పది ఏం కాదు, వారి పాదాలకన్నా నా కవిత్వ పాదాలు చురుకైన వేం కాదు, మా ఊరి అనుభవాల కన్నా, నా కవిత్వం గొప్పది ఏం కాదు అంటాడు".ఇది గోపికి తన ఊరి పట్ల ఉన్న మమకారానికి మచ్చుతునకగా చెప్పుకోవచ్చు ఢిల్లీకి రాజైన తల్లికి కొడుకు కొడుకే కదా! అలాగే చిన్నప్పుడు తను ఆడి పాడిన భువనగిరి గుట్టను జ్ఞాపకం చేసుకుంటూ మరోసారి అనే కవితలో మా భువనగిరి గుట్టను, అణువణువును నిమరాలని ఆరాటం, నిజానికి నేను గిరి పుత్రున్నే అంటాడు. అందుకే ఊరంటే జ్ఞాపకాల ఊట. అనుభవాల మూట.అలాగే, అప్పు సప్పు చేసి ఆరుగాలం కష్టపడిన రుతుపవనాలు సకాలంలో రాని పరిస్థితులలో దిగిరాను అనే కవితలో రైతు పరిస్థితిని వివరిస్తూ "మెరుపు నోరు తెరిచి అరిచే మేఘమా, కురవకుండా కులికితే ఏం లాభం, కాళిదాసును మహాకవిని చేసిన ఘన చరిత్ర నీది, మరి రైతును రాజును చేసేది పోయి, వురి తాళ్లు పేనుచున్నావు".సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండగ పోతే తెచ్చిన అప్పులు వడ్డీలు తీర్చలేక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని సామాజిక పరిస్థితిని వివరించారు. మేఘసందేశం కావ్యం రాసి కాళిదాసు గొప్పవాడయ్యాడని మరి అలాంటి మేఘాలు రైతుకు ఎందుకు దుఃఖాన్ని మిగిలిస్తున్నాయని ఇందులోని ధ్వని. కర్షకునిది కవిది అవినాభావ సంబంధం. రైతు సాధనం హలమైతే కవి సాధనం కలం. అందుకే తోడు అనే కవితలో "నాగలికి కలానికి సామ్యం సహజ రమ్యం, పోలిక సార్వకాలిక, అది మట్టిని దున్నితే ఇది మహత్తును వెలికితీస్తుంది....పెన్ను లేకుంటే నాకు చెయ్యి విరిగినట్లే పెన్ను లేకుంటే కాలు కుంటినట్లే".అని వెల్లడిస్తారు. గోపి నిరంతర కవి అందుకే కవికి కలానికి అంత అవినాభావ సంబంధం. అందుకే , కాళోజి కూడా నర్తకుని నాట్యాలు గాయకుని గానాలు కర్షకా నీ క్రు కదలినన్నాళ్లే అన్నాడు. జీవిత పర్యంతం పౌరహక్కుల సంఘం లోనే ఉండి ప్రజా జీవితంతో మమేకమై పోరాడిన యోధుడు,హక్కుల నాయకుడు బాలగోపాల్. ఆయన స్మృతికి నివాళులర్పిస్తూ గోపి మేధస్సును క్షేత్రస్థాయికి దించిన మనోరథుడు, సంవేదనను పట్టుకున్న సహృదయుడు బాలగోపాల్ అని అభివర్ణించారు.

తెలంగాణ ఉద్యమం ముమ్మరంగా సాగుతున్న కాలంలో రాజకీయ భూతం దానిని మింగాలని చూస్తున్నప్పుడు ప్రజాపో ప్రజాపోరును సమర్థిస్తూ గోపి ఉద్యమం వర్సెస్ రాజకీయం అనే కవిత రాశారు. అందులో ఉద్యమాన్ని ఉరితీయడానికి రాజకీయం తాడు పేనుతుంది, ఉద్యమం రేపటి తూర్పు, రాజకీయం మునిమాపు, ఉద్యమం జనస్వామ్యం, రాజకీయం ధనస్వామ్యం అని వెల్లడించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో ఆచార్యులుగా పనిచేసిన గోపి నగరంలోని కాన్వెంట్లలో పిల్లలు తెలుగులో మాట్లాడినందుకు శిక్షిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని తెలుగంటే అలుగు అనే కవితలో పాఠాలు చెప్పే పంతులమ్మకు కనువిప్పును కలిగిస్తూ "తెలుగు భాష అంటే తెలుసా నీకు, అమ్మ ఒడిలో నేర్చిన కమ్మని ఓంకార నాదం, గుండెలకు హత్తుకుంటే స్పందనలతో శృతి కలిపిన ఊపిరి నినాదం" అంటూ తెలుగు వైభవాన్ని చాటి చెప్పారు.

ఇలా ఆచార్య ఎన్.గోపి రాసిన ఈ కవితా సంపుటి పాఠకులకు మంచి అనుభూతిని కలిగిస్తుంది. ఆలోచనలను రేకెత్తిస్తుంది. అనుభవాలను పంచిస్తుంది. ఆయన అక్షరాలకు అభివ్యక్తి ఉంది. అభినవంగా అందించాలని ఆర్ద్రత ఉంది. అందుకే స్థానికత నుండి అంతర్జాతీయ స్థాయి వరకు జరిగిన సంఘట నలను ఎన్నింటినో ఆయన కవిత్వీకరించారు. అన్నింటికీ మించి ఆయన కవితా వృక్షానికి జవజీవాలను అందిస్తున్న మూలాలను మరువలేదు. మూల్యాలను విడువలేదు. అందుకు సాక్ష్యంగా నిలుస్తుంది "మా ఊరు మహాకావ్యం". అభినందనలు.



డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
99 891 48 305

## ప్రశంసా చిహ్నంగా టీమిండియా జెర్సీ



**హైదరాబాద్, మార్చి 30 (జనంసాక్షి) :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సిఏ) సెక్రెటరీ ఆర్. దేవరజ్ సీనియర్ రాజకీయ నాయకుడు, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు కుటుంబ సభ్యులతో పాటు హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కె.విప్లవ కుమార్ నీ వారి బంజారాహిల్స్ నివాసంలో కలిసి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేవరాజ్ భారత కెప్టెన్ రోహిత్ శర్మ సంతకం చేసిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 టీంఇండియా జెర్సీని ప్రశంస చిహ్నంగా అందజేశారు. ముఖ్యంగా, టోర్నమెంట్ సమయంలో దేవరాజ్ భారత జట్టు మేనేజర్‌గా పనిచేశారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో హెచ్ సిఏ నిర్వహిస్తున్న ఐపీఎల్ మ్యాచ్‌లను సజావుగా నిర్వహించడంలో తెలంగాణ ప్రభుత్వానికి, మేయర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడల అభివృద్ధికి చేస్తున్న నిబద్ధతకు, రాష్ట్రంలో కొత్త క్రికెట్ స్టేడియం కోసం భూమి కేటాయింపునకు జరుగుతున్న ప్రయత్నాలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ వేదనను ఎలుగెత్తి చాటిన కవి దాశరథి

- సమాజ చైతన్యానికి రాజ్యంపై రాజీలేని రచనలు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

వనపర్తి, మార్చి 30 (జనంసాక్షి) : అస్తిత్వం కోసం తెలంగాణ ప్రాంతం పడిన వేదనను ఎలుగెత్తి చాటిన మహనీయుడు దాశరథి కృష్ణమాచార్యయని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కొనియాడారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో దాశరథి కృష్ణమాచార్యుల శత జయంతి వేడుకలు నిర్వహించారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డితోపాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్,ప్రముఖ రచయితలు గాయకులు సాహిత్య సామాజిక విశ్లేషకులు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, కోయి కోటేశ్వర్ రావు,తిరునగరి శరత్ చంద్ర బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, ఉమ్మడి జిల్లాకు చెందిన కవులు, రచయితలు పాల్గొన్నారు. సభకు అద్యక్షత వహించిన నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ సమాజ చైతన్యమే లక్ష్యంగా అప్పటి రాజ్యంపై రాజీలేని పోరాటాలు చేయడమే కాకుండా రచనలు చేసిన ఆదర్శప్రాయుడు దాశరథి అన్నారు.అతి తక్కువ సమయంలో ఎక్కువ ప్రభావంతమైన రచనలు చేశారని,యాభై సంవత్సరాలు సాహిత్యంలో ఉన్నారని గుర్తు చేశారు.ఆంధ్ర మహాసభలో, కమ్యూనిస్ట్ పార్టీలో పని చేశారని, వ్యవస్థతో, రాజ్యంతో రాజీ పడకుండా ఆయన పని చేశారన్నారు.దాశరథికి నిజమైన నివాళలు కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం





అర్పించిందన్నారు. తెలంగాణ ఉన్నంత వరకు దాశరథి పేరు ఉంటుందని అన్నారు.

### జైల్లో వేసినా ఆగని దాశరథి గర్జనలు : దేశపతి శ్రీనివాస్

రైతాంగ పోరాటం అనంతరం తెలంగాణ గురించిన ప్రస్తావన మరుగున పడిందని, అలాంటి సంక్లిష్ట సమాజంలో నిలబడి నిజాం రాజు దుశ్చర్యల గురించి దాశరథి రాశాడని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు.జైల్లో వేసినా దాశరథి గర్జనలు ఆగలేదని, నా తెలంగాణ కోటి రత్నాలవీణ అని దాశరథి అన్నారని గుర్తు చేశారు.తెలంగాణలో టీఆర్ ఎస్ పుట్టినప్పుడు నా తెలంగాణ కోటి రత్నాల వీణ అని గోడల మీద రాయడంతో మలిదశ ఉద్యమంలో దాశరథి మళ్ళీ ప్రత్యక్షం అయ్యారని అన్నారు.తెలుగు కవిత్వాన్ని సుసంపన్నం చేసిన దాశరథి కవిత్వంలో తెలంగాణ అస్తిత్వం పురివిప్పి నాట్యం చేసిందన్నారు.మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో తెలంగాణ కవుల గురించి తెలుసుకునే అవకాశం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బట్టలూడదీస్తాం, ఉరికించి కొడతాం, పేగులు మెడలో వేసుకొంటాం అనే దుందుడుకు మాటలు పక్కనబెట్టి, తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడిన కవులు, కళాకారులు గురించిన చర్చలు పెట్టాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు.డాక్టర్ దాశరథి శతజయంతి ఉత్సవాలలో దేశపతి శ్రీనివాస్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి,కవులు కోటేశ్వర రావు,శరత్ చంద్ర, బాల్ రామ్,శంకర్ గౌడ్,వనపట్ల సుబ్బయ్య,నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పి.రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్,బైరోజు చంద్రశేఖర్, సత్తార్ సార్, చిట్యాల రాము,మండల పార్టీ నాయకులు కృష్ణా నాయక్,మాణిక్యం,వనం రాములు,ధర్మా నాయక్, రాజశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్లలో ఘనంగా శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు

**చేవెళ్ల, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల మండలంలోని అన్ని గ్రామల్లో ప్రజలు శ్రీవిశ్వావసు నామ ఉగాది పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం అన్ని గ్రామాల్లో ప్రజలు శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలను ఎంతో సంతోషకరంగా నిర్వహించుకున్నారు. తెలుగు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు. ప్రజలు గ్రామాల్లో వారి వారి ఇండ్లకు పచ్చని మామిడి, వేప తోరణలు వేసి అందంగా అలంకరించారు. అలాగే ఇండ్లలో ఉగాది పచ్చడిని తయారు చేసి గ్రామ దేవతల దేవాలయల్లో నైవేద్యం సమర్పించినంతరం చద్రురుచుల పచ్చడిని తీసుకున్నారు. మద్యహ్నం నుంచి సాయంత్రం వరకు ఆయా గ్రామాల్లోని హనుమన్ దేవాలయల పద్ద వేదపండితులు, అర్చకులు నూతన సంవత్సర పంచాంగ శ్రావణ చదివి ద్వదశ రాశిఫలాలను చదివి వినిపించారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురువడంతో పంటలు సంవృద్ధిగా పండుతాయని పంచంగం ద్వారా పండితులు పంచాంగం ద్వారా వివరించారు. దీంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. చేవెళ్ల హనుమాన్ దేవాలయంలో దేవుని వామనచారీ వేదపండితులు పంచాంగాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజా ఆగి రెడ్డి, సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి,



డైరెక్టర్ పాటి దామోదర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, జుకన్నగారి శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మా రెడ్డి, ఆయా గ్రామాలలో ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, ప్రజలు తదితరులు ఉన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు

**జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్**



నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 30 (జనం సాక్షి) : రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ జిల్లాలోని ముస్లిం సోదరి, సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నారాయణపేట జిల్లా పరిధిలోని ఈద్గలు, మసీద్‌ల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేయడం జరుగుతుందని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రధాన చౌరస్తాలో పోలీసు పికెట్స్ ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలందరు సోదర భావంతో తమ పండగలు సుఖ సంతోషాలతో, కుటుంబ సభ్యులతో కలిసి శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్పీ తెలిపారు. సామాజిక మధ్యమలు అయినా ఫేస్బుక్, వాట్సప్, ట్విట్టర్, ఇంస్టాగ్రామ్ మొదలగు వాటిలో ఒకరిని కించపరిచే విధంగా పోస్టులు చేయరాదని ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా పోస్టులు పెట్టరాదు అని ఎస్పీ తెలిపారు. సోషల్ మీడియా పై పోలీసు వారి నిఘా ఏర్పాటు చేయడం జరిగింది అని ఎవరైనా అనుచిత పోస్టులు పెడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు.సమాజంలో శాంతి స్థాపన కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని శాంతి భద్రతలు పరిరక్షించడంలో పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## జోగులాంబ అమ్మవారికి బంగారు కిరీటం వితరణ




**గద్వాల్ రూరల్, మార్చి 30 (జనంసాక్షి) :** అల్లంపూర్ ఐదవ శక్తిపీఠం జోగులాంబ అమ్మవారికి బంగారు కిరీటం వితరణ. ఆదివారం బెంగుళూరు, హైదరాబాద్ కు చెందిన సాఫ్టేవేర్ ఉద్యోగుల బృందం 1 కేజీ 587 గ్రాముల బంగారం కిరీటంను జోగులాంబ అమ్మవారికి బంగారు కిరీటంను సమర్పించారు.ఆలయ అర్చకులు అమ్మవారికి బంగారు కిరీటంను అలంకరించి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. బంగారు కిరీటం యొక్క విలువ 1కోటి 60 లక్షల 10 వేల 500 రూపాయలు అని సాఫ్ట్ వేర్ ఉద్యోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పురేందర్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి ధర్మకర్తలు జగదీశ్వర్ గౌడ్ ఆలయ అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్ ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు

**హైదరాబాద్, మార్చి 30 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఇలంబర్తి ముస్లిం సోదర సోదరిమనులకు ఈదుల్ - పితార్ (రంజాన్) పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజుల పాటు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేపట్టి అల్లా సన్నిధిలో క్రమం తప్పకుండా 5 పూటల నమాజ్ చేస్తూ చిన్న పిల్లల మొదలుకొని వృద్దుల వరకు ఈ పవిత్రమైన రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయమన్నారు. అల్లా ఆశీస్సులతో ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాక్షించారు. పవిత్ర రంజాన్ మాసంలో సోదర భావం పెంపొంది లౌకిక విలువలు కాపాడుతూ ప్రజల మధ్య ఐక్యత భావం పెంచుతుందని కమిషనర్ తెలియజేస్తూ నగరంలో ముస్లిం సోదరులు ఆనందోత్సవలతో జరుపుకునేందుకు జిహెచ్ఎంసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నిఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ మరొక సారి ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ పండుగ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఇసుక అక్రమ రవాణాపై ఆగ్రహించిన ఆకునూరు యువత

- ట్రాక్టర్లను పట్టుకుని అధికారులకు అప్పగింత
- అక్రమ రవాణా చేస్తే చట్ట ప్రకారం చర్యలు : ఆర్ఐ



**చేర్యాల, మార్చి 30 (జనంసాక్షి) :** అర్ధరాత్రి ఆకునూరు గ్రామం మీదుగా ఇసుక అక్రమ రవాణా సాగుతుందని గమనించిన ఆకునూరు గ్రామస్తులు ఆదివారం తెల్లవారుజామున ఉదయం 2గంటలకు అంగడి బజారులో రెండు ట్రాక్టర్లను పట్టుకొని వెంటనే రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి కి సమాచారం అందించడంతో వెంటనే హుటాహుటిన గ్రామానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించి పోలీస్ సిబ్బంది సహాయంతో రెండు ట్రాక్టర్లను చేర్యాల పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా రెవిన్యూ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని ఎక్కడైనా ఇసుక రవాణా చేసినా సమాచారం అందించాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# కదిలిన భద్రేశ్వరుడి రథ చక్రాలు

- జాతర ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ
- రథచక్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీనివాస్ రెడ్డి

**తాండూరు, మార్చి 30 (జనంసాక్షి) :** పట్టణ నడిబొడ్డున కొలువుదీరిన శ్రీ బావిగి భద్రేశ్వర జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఉగాది పర్వదినం సందర్భంగా జాతర ఉత్సవాల పోస్టర్ను విడుదల చేశారు అదేవిధంగా రథచక్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆదివారం వీరశైవ కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా బుయ్యని శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన ఆలయంలో కొలువుదీరిన శ్రీ బావిగి భద్రేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని శ్రీ భావిగి భద్రేశ్వర జాతర రథ చక్రాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం ఆలయంలో వేద పండితుల మధ్య తెలుగు నూతన సంవత్సరం పంచాంగ శ్రవణం వీక్షించారు.ఈ



సందర్భంగా ఆర్బిఓఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భద్రేశ్వర స్వామి కృపతో జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుకోవాలన్నారు. ఇంతటి ప్రత్యేక కార్యక్రమంలో తనని ఆహ్వానించినందుకు ఆలయ కమిటీ కి, వీరశైవ సమాజ సభ్యులకి ధన్యవాదములు తెలిపారు. అదేవిధంగా ప్రజలకు శ్రీ విశ్వా వసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

# జూనియర్ అసిస్టెంట్ నుండి గ్రూప్-1 అధికారిగా తుప్పలి మోనిక రాణి

- స్టేట్ జనరల్ 263వ ర్యాంక్,ఎస్సీ కేటగిరీలో 16వ ర్యాంక్
- గ్రూప్-1 ఆఫీసర్‌గా కుల్కచర్ల వాసి
- సంతోషాన్ని వ్యక్తపరిచిన కుటుంబ సభ్యులు

**వికారాబాద్ బ్యూరో, మార్చి 30 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రానికి చెందిన మోనిక రాణి ఆదివారం టీఎస్పీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 263వ ర్యాంకు, ఎస్సీ కేటగిరి విభాగంలో 16వ ర్యాంకు సాధించి గ్రూప్-1 ఆఫీసర్ గా ఉద్యోగం సాధించింది. ప్రస్తుతం ఆమె బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ హైదరాబాద్లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది.గ్రూప్-1 ప్రిలిమ్స్ లో 98 మార్కులు,గ్రూప్-1 మెయిన్స్ లో 467.5 మార్కులు సాధించింది.

### విద్యాభ్యాసం

మౌనిక రాణి 10వ తరగతి హైదరాబాద్లోని బాలాజీ హై స్కూల్, ఇంటర్మీడియట్, శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ,డిగ్రీ ఉస్మానియా మెడికల్ కాలేజీ ,పీజీ,పిహెచ్డి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో విద్యాభ్యాసం కొనసాగించింది.అనంతరం 2007లో కుల్కచర్ల మండల కేంద్రానికి చెందిన తుప్పలి అశోక్ కుమార్ తో వివాహం జరిగింది.ప్రభుత్వ ఉద్యోగ సాధనే లక్ష్యంగా 2010లో ఏపీపీఎస్సీ గ్రూప్-4 లో ఉద్యోగం సాధించి సిఐడి డిపార్ట్మెంట్లో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహించారు.అనంతరం 2012లో హైదరాబాద్ జిల్లాలో వీఆర్వో ఉద్యోగ నియామకల్లో జిల్లా స్థాయిలో 10వ ర్యాంకు సాధించింది.

### గ్రూప్-1 ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది

టీఎస్పీఎస్సీ విడుదల చేసిన గ్రూప్ -1 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉందని, అమ్మ



మహేశ్వరి ,భర్త తుప్పలి అశోక్ కుమార్, అత్తమ్మ తుప్పలి రత్నమ్మ ప్రోత్సాహంతో మరువలేదన్నారు. రోజుకు 14 గంటలు ప్రాణాలిక బద్ధంగా చదివి టెస్ట్ సిరీస్ రాయడం వల్ల అధిక మార్కులు రావడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఆమెను వారి కుటుంబ సభ్యులు, పలువురు అభినందించారు.

## శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

**మహబూబ్‌నగర్, మార్చి 30 (జనంసాక్షి) :** తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ చేదు అనుభవాలన్నీ మర్చిపోతూ ఆత్మీయత అనుబంధాల్ని పెంచుకుంటూ ఆనందమయ క్షణాలను మదినిండా నింపి కష్టసుఖాలను కలగలిపిన జీవితంలో షడ్రుచుల ఉగాది పచ్చడి సేవనం తెలియజెప్పే ఉగాది పండగ అని టీపీసీసీ



ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ఉత్సవం, గౌరవం, ఆనందం, ధనం, ఐశ్వర్యం ఇవన్నీ ఎల్లప్పుడూ మీతోమాతో పాటే ఉండాలని పాత ఏడాది నేర్పిన పాఠాలు గుర్తుపెట్టుకుందాం కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలుకుదామన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
31 మార్చి 2025

# ఈద్ ముబారక్..!

- సర్వమానవాళికి అల్లా దివ్య సందేశాలు
- ఖుషీ సే.. గలే మిలావ్
- నేడు రంజాన్ పర్వదినం







**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 30 (జనం సాక్షి) :** పవిత్ర రమజాన్ మాసం ముగిసింది. రోజాలకు వీడ్కోలు పలికారు. ఇస్లామిక్ కాలమానంలోని 'షవ్వాల్' మాసం నెల వంక దర్శనంతో ముస్లింలు పండుగ సంతోషాల్లో తేలియాడుతున్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలతో చేసిన శ్రమకు ఫలితం అందుకునే రోజు రమజాన్ రానే వచ్చింది. షవ్వాల్ నెల ఒకటో తేదీన ముస్లింలు ఈదుల్ ఫితర్ (రమజాన్ పండుగ) జరుపుకుంటారు. జిల్లా వ్యాప్తంగా రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.

## 'రమజాన్' పేరులోనే ఉపవాస సూచన ఉంది

'రమజాన్' పేరులోనే ఉపవాస సూచన ఉంది. 'రమ్' అంటే కాలుట, దహించుట అని అర్థం. ఉపవాసం వల్ల ఆకలి బాధ తెలుస్తుంది. ఆకలితో అల మటించే వారి పట్ల సానుభూతి కలుగుతుంది. అంతేకాదు ఉపవాసం వల్ల కష్టాలను సహనంతో ఎదుర్కొనే శక్తి కలుగుతాయి. ముస్లిములంతా ఒకే సారి, ఒకే కాలంలో ఉపవాస వ్రతాన్ని పాటిస్తారు. దీనివల్ల సోదరభావం కలిగి, అందరూ ఐక్యతతో మెలుగు తారు. మానవుల సహజ భావోద్వేగాలు, ప్రతిస్పందనల ప్రతి రూపమే పండుగలు, పబ్బాలు, పండుగలు ఆయా జాతులు, సముదాయాల చరిత్రను, వారి విశ్వాసాలను, ఆచార వ్యవహారాలను ప్రతిబింబిస్తాయి. రమజాన్ అన్నది ఒక నెల పేరు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం సంవత్సరంలోని 12 నెలల్లో రమజాన్ తొమ్మిదవ నెల. రమజాన్ పేరుతో ఏకంగా పండుగ జరుపుకునేంతటి ఘనత రావడానికి ప్రధానంగా మూడు కారణాలను చెప్పు కోవచ్చు. ఒకటి సమస్త మానవ జాతికి వెలుగును, జ్ఞాన కాంతిని ప్రసాదించే దివ్యజ్యోతి అయిన పవిత్ర ఖురాన్ రమజాన్ మాసంలో అవతరించడం, మానవుల శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి అద్భుతంగా ఉపకరించే ఉపవాసవ్రతం అనే గొప్ప ఆరాధనను కూడా దైవం ఈ నెలలోనే విధిగా నిర్ణయించడం. వెయ్యి మాసాల కన్నా విలు వైన రాత్రి అని పేర్కొనే 'షబేఖద్ర్' కూడా ఈ నెలలోనే రావడం వల్ల రమజాన్ కు అంతటి గొప్పదనం. అందుకని మహ్మదీయులు ఈ మాసమంతా అత్యంత నియమ నిష్ట లతో ఉపవాసాలు పాటిస్తూ ఫర్ద్, సున్నత్, నఫిల్, తరావీ హ్, తహజ్జుద్ ప్రార్థనలతో పాటు సాధ్యమైనన్ని సత్కార్యాలు ఆచరిస్తారు. శక్తిమేర దానధర్మాలు చేస్తూ పరిశుద్ధ మైన జీవితం గడపడానికి ప్రయత్నిస్తారు. సంపన్నులే కాదు, బీదవారు సైతం పండుగ సంతోషంలో పాలుపంచు కోవాలన్నదే అసలు ఉద్దేశం. ఈ రోజు ముస్లిం సోదరు లంతా చిన్నాపెద్ద, ఆడ మగా, ముసలీ ముతకా అందరూ వేకువజామునే స్నానాదులు ముగించుకుని ఫజర్ నమాజ్ ఆచరిస్తారు. ఉన్నంతలో మంచి దుస్తులు ధరించి స్వల్పంగా అల్పాహారం సేవించి ఆయా ప్రాంతాల్లోని ఈద్గాహ్ (పండుగ ప్రార్థనా స్థలం)లకు వెళుతారు. అందరూ అక్కడ సమావేశమై సామూహికంగా ఈద్ నమాజ్ చేస్తారు. తమ అపరాధాలను మన్నించమని, సన్మార్గాన నడపమని దువా(ప్రార్థన) చేస్తారు. సమస్త మానవాళి సుఖ సంతోషాలను కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం కరచాల నాలు, ఆలింగనాలతో 'ఈద్ ముబారక్' అంటూ ఆత్మీయ అనుబంధాన్ని చాటుకుంటారు. పండుగ సందర్భంగా తయారుచేసే తీపి వంటకాలను అందరికి తినిపించి పండుగ ఆనందాన్ని ఆస్వాదిస్తారు. ఈ విధంగా ఈదుల్ ఫిత్ర్ ర్ పండుగ జరుపుకొంటారు.

## ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గాలు

రంజాన్ పండుగ ప్రార్థనలకు జిల్లాలోని ఈద్గాలు ముస్తాబయ్యాయి. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని ఈద్గాలకు రంగులు వేయడంతో పాటు మైదానాలను శుభ్రపరిచి పండుగ ప్రార్థనల కోసం సిద్ధం చేశారు. వారం రోజుల నుంచి ఈద్గాలను ముస్తాబు చేయడంతో నూతన శోభను సంతరించుకున్నాయి. ముస్లిం సోదరులు ఆయా ప్రాంతాల్లోని మసీదులకు చేరుకుని అక్కడి నుంచి తస్బీ (శ్లోకాలు) పఠిస్తూ ఈద్గాలకు తరలిరావాలని జమాత్ పెద్దలు సూచించారు. అలాగే పలు చోట్ల దర్గాలు, ఖబరస్తాన్ (ముస్లింల శ్మశానవాటికలు) లలోనూ పారిశుద్ధ్య చర్యలు చేపట్టి పండుగ ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

## ఖుషీ సే.. గలే మిలావ్..

ఖుషీ ఖుషీ మాటలతో తీపి పంచే మిఠాయి రుచులతో రమజాన్ పంచే ప్రేమ మధురం. నిండు మనసుతో, ఉత్తమ జీవన విధానంతో ప్రియ మైన దేవునికి ఆత్మీయ ప్రార్థనలు. దైవ స్మరణలో ఉపవాస దీక్షలు... కనిపించే ప్రతి మనిషికీ ఆప్యాయ ఆలింగనం... సాయం కోరే సాటి వాళ్లకు తోచినంత దానం... వీటన్నిటిలో మానవుని పరిపూర్ణ ప్రేమకు నిదర్శ నంగా నిలిచే రమజాన్ రోజు ఖుషీ సే.. ఏక్ సే ఏక్ గలే మిలావ్ అంటు సంతోషంగా గడుపుతారు.

### అచంచల భక్తితో ఆరాధన..



రంజాన్ నెలలో అవతరించిన పరమ పవిత్రమైన ఖురాన్ సర్వమా నవాళికి మార్గదర్శకం. అచంచల భక్తితో అల్లాను ఆరాధించిన వారికి సర్వపాపాలు పోయి పునీతులౌతారు.

**ఫయాజుద్దీన్,**
**వినియోగదారుల ఫోరం నాయకులు**

### ఆధ్యాత్మిక చింతనతో సంపూర్ణ ఆరోగ్యం



రంజాన్ పవిత్ర మాసంలో దీక్షలు ఆధ్యాత్మిక చింతనతో పాటు మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తాయి. మహ్మద్ ప్రవక్త తమ ఉపవాస దీక్షను కర్జూరాలు తీసుకొని విరమించే వారు. ఈ నెలలో తీసుకునే హారం దేహానికి మంచి పుష్టిని ఇస్తుంది. హలీం వీటిలో శరీరానికి అవసర మయ్యే పోషక విలువలన్నీ ఉన్నాయి. అయితే మితంగా తీసుకోవడం మంచిది. ఏడాది పొడ వునా రోజు తీసుకునే ఆహారంతో పాటు పోషక విలువలున్న పదార్థాలు పండ్లు తీసుకోవాలి. రంజాన్ పండుగ సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గం ప్రజలకు శుభాకాంక్షలు.

**మహమ్మద్ తన్వీర్, మాజీ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్**

## క్రీడలు మానసిక శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయి


- ఎఫ్ఏ జిల్లా అధ్యక్షులు చెన్నప్ప



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, మార్చి 30 (జనం సాక్షి) :** క్రీడలు మానసిక శరీర దృఢ త్వాన్ని పెంపొందించడం కాక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎఫ్. ఏ ల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప అన్నారు.నారాయణపేట మండలం అభంగాపూర్ గ్రామంలో కీర్తిశేషులు బుజ్జి కాడి భీమన్న బుజ్జు కాడి కనకప్ప జ్ఞాపకార్థం ఆదివారం వారి కుటుంబ శ్రీకాంత్ వెంకటేష్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. చెన్నప్ప ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ క్రీడలు నేటి యువత కు మానసిక ఉల్లాసాన్నితో పాటు శారీరిక దృత్వాన్ని పెంచుతాయని అన్నారు. క్రీడలు ఉద్యోగ అవకాశాలను కూడా కల్పిస్తాయని అన్నారు. కాబట్టి నేటి యువకులు క్రీడలు నేర్చుకొని శారీరక దృఢత్వాన్నితో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగుపరచుకోవాలని అన్నారు. ఈ క్రీడలను నిర్వహిస్తున్న శ్రీకాంత్ వెంకటేష్లను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల్లో గెలుపోటములు పూర్తిగా తీసుకోవాలని క్రీడాకారులను సూచించారు. ఈ క్రీడా పోటీలో మొత్తం 6 జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో ప్రశాంత్ ఆర్మీ,ఎం శ్రీను ఆర్మీ, క్రీడాకారులు గ్రామ యువకులు క్రీడలను నిక్షించడానికి పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విశ్వవసు నామ సంవత్సరం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్‌చెరు, మార్చి 30 (జనం సాక్షి) :** శ్రీ విశ్వవసు నామ సంవత్సరం ప్రజల జీవితాల్లో నూతన కాంతి వెలుగులు నింపాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అభిలాషించారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం పటాన్చెరు పట్టణంలోని చైతన్య నగర్ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణం కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు రాశి ఫలాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాయ్ కాడి విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపాన దేవ్, మాజీ జడ్పీటీసీ జైపాల్, మాజీ సర్పంచ్ దేవేందర్ రాజు, ప్రతాప్ గౌడ్, ప్రకాష్ రావు, మాజీ ఎంపిటిసి రామచంద్ర రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, పట్టణ పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రధాని మన్ కీ బాత్ వీక్షించిన బీజేపీ నాయకులు



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, మార్చి 30 (జనం సాక్షి) :** ప్రధాని నరేంద్రమోడీ ఆదివారం నిర్వహించిన 127వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నారాయణపేట బిజెపి నాయకులు వీక్షించారు.బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగు రావు నామాజీ తన నివాసంలో బిజెపి రాష్ట్ర నాయకులు కే.రతంగ్ పాండు రెడ్డి,బిజెపి జిల్లా కోశాధికారి సిద్ది వెంకట్ రాములు,జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ,పట్టణ కోశాధికారి హన్మంతు రావు ఇతరులతో కలిసి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు.ఈ సందర్భంగా నాగురావు నామాజీ మాట్లాడుతు అన్ని వర్గాల ప్రజల తో మమేకమై మన్ కీ బాత్ ద్వారా మాట్లాడుతున్న ఏకైక ప్రధాని నరేంద్రమోడీ అన్నారు.

ప్రజలతో మనసువిప్పి మాట్లాడుతు వారి సమస్యలు సూచనలు వినడం ద్వారా ప్రజారంజక పాలన అందిస్తున్నారని అన్నారు.కాగా ప్రజలకు తెలుగు సంవత్సరాది విధ్వవసు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.విద్వవసు ఏడాదిలో అందరి విశ్వాసాలు నెరవేరాలని సుఖ సంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.

# పేరెంట్‌హుడ్ జంటలతో అంకురా హాస్పిటల్

- నగరంలో తొలిసారిగా మెగా బేబీ షవర్




**ఖైరతాబాద్, మార్చి 30 (జనం సాక్షి) :** మాతా, శిశు సంక్షేమానికి అంకితమైన ప్రముఖ ఆరోగ్య సంరక్ష ణ ప్రదాత అంకురా హాస్పిటల్, తన ప్రారంభ మెగా బేబీ షవర్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు అంకురా హాస్పిటల్ వ్యవస్థాపకుడు, ఎండీ డాక్టర్ కృష్ణ ప్రసాద్ వున్నం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయన మాట్లాడుతూ ఇది పేరెంట్ హుడ్ ప్రయాణాన్ని జరుపుకునే ప్రత్యేక కార్యక్రమం అన్నారు. ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ ఇంట ర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(హెచ్ఐసీసీ)లో ఇటీవల జరిగిన ఈ ఈవెంట్‌కు అద్భుతమైన స్పందన ల భించిందన్నారు. 150 మందికి పైగా జంటలు ఆ నందంతో ఉల్లాసంగా, కమ్యూనిటీ బంధంతో నిం డిన రోజులో పాల్గొంటారన్నారు. ఆశించే తల్లిదం డ్రులకు మద్దతు ఇవ్వడానికి, సాధికారత కల్పించ డానికి రూపొందించబడిన మెగా బేబీ షవర్, హాజ రైన వారికి గర్భధారణ సంరక్షణ, న్యూబామ్ వెల్ నెస్, పేరెంటింగ్‌పై నిపుణుల అంతర్దృష్టులను పొం దేందుకు ఒక ఆకర్షణీయమైన వేదికను అందించిం దన్నారు. ఈ ఈవెంట్‌లో అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల నేతృత్వంలోని ఇంటరాక్టివ్ హెల్త్ సెషన్‌లు ఉన్నాయన్నారు. వీటిలో పునరుజ్జీవన యో గా వ్యాయామాలు, శక్తివంతమైన జుంబా సెషన్ లు, రిలాక్సింగ్ నెయిల్ ఆర్ట్, ఈ ప్రతిష్టాత్మకమైన క్షణాలను సంగ్రహించడానికి ప్రొఫెషనల్ ఫోటోషూ ట్‌లు ఉన్నాయన్నారు.

## ఏకలవ్య అవార్డు అందుకున్న కేరళ హైస్కూల్ విద్యార్థులు




**హుస్నాబాద్, మార్చి 30 (జనంసాక్షి) :** హైదరాబాదులోని కొండాపూర్ టీసిసి క్లబ్ లో శనివారం ఏకలవ్య స్కూల్ ఆన్యువల్ అవార్డ్స్ ను హుస్నాబాద్ కేరళ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు అందుకున్నట్లు పాఠశాల చైర్మన్ మరియు ప్రిన్సిపల్ బుర్ర రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.పాఠశాల చైర్మన్ మరియు ప్రిన్సిపల్ బుర్ర రాజేందర్ మాట్లాడుతూ 2024-25లో కేరళ ఇ/ మీహై స్కూల్ హుస్నాబాద్ చెందిన పి.సాత్విక 9 వ తరగతి ఏకలవ్య ఇంటర్ స్టేట్ ఒలింపియాడ్ మరియు ఐఐటి స్టేట్ అవార్డు అందుకోవడం జరిగిందని , క్లాస్ స్టాపర్లుగా ఎల్ వైష్ణవి(8 వ,) ఆర్.శరత్ కుమార్(7వ),వి.సాయి హవిష్(6వ)లు కూడా అవార్డులు అధ్యక్ష మహారాజ్ రామకృష్ణ మఠం స్వామి బోధమాయనంద హైదరాబాద్ మరియు ఫార్మర్ సీఈవో టెక్ మహీంద్రా బిపిఓ రంగినేని విజయ్ చేతుల మీదుగా కొండాపూర్ టీసిసి క్లబ్ హైదరాబాద్ లో అవార్డులు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మరియు ప్రిన్సిపాల్ బుర్ర రాజేందర్,సెక్రటరీ మరియు కరెస్పాండెంట్ అల్లే శైలేందర్ ,ఉపాధ్యాయుడు శ్రీనివాస్, పేరెంట్ సంతోష్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# యువతి యువకులు ఉచిత శిక్షణ కేంద్రం ప్రారంభం

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**రేవల్లి, మార్చి 30 (జనంసాక్షి) :** గోపాల్‌పేట్ మండల కేంద్రంలో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ గ్రామీణ యువతకు కంప్యూటర్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజీ (మగ్గం వర్క్), మొబైల్ రిపేరింగ్, టు వీలర్ రిపేరింగ్ లాంటి కోర్స్ లలో శిక్షణ ఇవ్వడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరయ్యారు. ఉచిత శిక్షణ తరగతులను రామనందా తీర్థ గ్రామీణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎన్ కిషోర్ రిబ్బన్ కటింగ్ చేసి ఉచిత తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు స్వామి రామానంద తీర్థ పేరిట 1995లో ఏర్పాటయింది. అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు దీన్ని ప్రారంభించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సంస్థ అప్పట్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నడిచేది. తర్వాత కొంతకాలానికి పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని గ్రామీణాభివృద్ధి విభాగానికి మార్చారు. రాష్ట్ర విభజన అనంతరం ఈ సంస్థను ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వంలోని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిర్వహిస్తోందన్నారు. నేను గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న సమయంలో స్వామి రామానంద తీర్థ సంస్థకు 18 నెలలు డైరెక్టర్‌గా పనిచేశానని అన్నారు. డైరెక్టర్ జీవిత భత్యాలను కోటి రూపాయలతో హైదరాబాదులో రామనంద తీర్థ సంస్థకు మంచి భవనం నిర్మించానని అది నేడు హాస్టల్ గా వాడుకుంటున్నారని గుర్తు చేశారు. నేటి యువత మత్తు పదార్థాలకు, వ్యసనాలకు అలవాటు కాకుండా రేపటి భవిష్యత్తు కోసం ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ సాంకేతిక కోర్సుల్లో శిక్షణ, నైపుణ్యం పెంపుదల కోసం అత్యున్నత సాంకేతిక మౌలిక సదుపాయాలతో వేల కొద్దీ గ్రామీణ యువతీయువకులకు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించడానికి కృషి చేస్తుంది అని అన్నారు. సంస్థ ఉచిత శిక్షణ తర్వాత ఉపాధి చూపిస్తారు అని అన్నారు. శిక్షణానంతరం కొందరు స్వయం ఉపాధిని చేపడుతున్నారు. పేద, వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన యువత మేం ఇచ్చిన శిక్షణతో మంచి జీతంతో ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. వివిధ కోర్సులు చేసిన వీరికి ఉద్యోగం దొరకదనే భయం లేదు. ఉపాధి లేని స్థితి నుంచి సొంతగా తమ కాళ్ల మీద తాము ఆర్థికంగా వీళ్లు నిలబడటానికి ఈ సంస్థ పనిచేస్తుందని అన్నారు. టెక్స్‌టైల్స్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ వంటివి నేర్చుకున్న వాళ్లు సొంతంగా సంపాదించుకుంటూ నిలదొక్కుకుంటున్నారు. ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, హార్డ్‌వేర్ వంటివి చేసిన వాళ్లు పలు ప్రైవేటు సంస్థల్లో ఉపాధి పొందుతున్నారు అని అన్నారు. గోపాల్ పేట్ మండల అభివృద్ధి కోసమే మార్కెట్ యార్డ్ మండల కేంద్రంలో నిర్మించాలని కోరడం జరిగిందే కానీ అభివృద్ధిని అడ్డుకోలేదని అన్నారు. మండల అభివృద్ధికి ముందు ముందు మంచి కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధి చేస్తానని అన్నారు. రామనందతీర్థ గ్రామీణ సంస్థ డైరెక్టర్ డా.ఎన్. కిషోర్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసుకునే వారికి మేం ఇచ్చే మూడు నెలల కోర్సులు ఆర్థికంగా సుస్థిరంగా నిలబడేట్లు చేస్తాయన్నారు. శిక్షణ ఇచ్చిన తర్వాత సుస్థిరంగా వ్యాపారం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్న రాజీవ్ యువ వికాసం ద్వారా ఉపాధి పొందడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి కమ్మర్ మియా, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మత్స్యశాఖ సెల్ అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య, గోపాల్పేట్ సింగల్ విండో అధ్యక్షుడు రఘు యాదవ్, నాగర్ కర్నూల్ ఎంపీ ప్రతినిధి డాక్టర్ వెంకట్ ,గోపాల్పేట్ జనరల్ సెక్రెటరీ జిల్లెల ప్రవీణ్ రెడ్డి, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ లాయర్ బాబా, గోపాల్‌పేట్ నాయకులు శివన్న, కోదండరాం, శ్రీనివాస్ రెడ్డి, రాములు, రమేష్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జానకి రాముడు, వనపర్తి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణ, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటన్న యాదవ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, సీనియర్ నాయకులు రాగి వేణు, పాండురంగారావు, మెట్టపల్లి రాములు, ఇర్షద్ పాల్గొన్నారు.

# అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి

## ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్

## రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పిలుపు

**హైదరాబాద్ (జనంసాక్షి)**

: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రేపు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పిలుపునిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలోని గత ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని లేకుండా చేసిందని, నియంతృత్వాన్ని, అహంకారాన్ని ప్రదర్శించిందని ప్రచారం చేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు అంతకంటే ఎక్కువగా తెలంగాణ రాష్ట్రంలో నిర్బంధాన్ని , అహంకారన్ని ప్రదర్శిస్తున్నారు. దానిలో భాగంగానే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములని కర్పొరేట్ సంస్థలకు వేలం వేయాలనే నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గత పది రోజులుగా విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారు. ఈ ఆందోళనలు చేస్తున్న విద్యార్థుల పట్ల అలాగే యూనివర్సిటీ భూములు తీసుకోవద్దని డిమాండ్ చేస్తున్న సమాజం పట్ల అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు అత్యంత దురుత్సాహకరమైన రీతిలో వ్యవహరించి వాఖ్యలు చేశారు. ఈ రోజు ఆ నాలుగు వందల ఎకరాలలో ఏమీ లేదని నిరూపించుకోవటం కోసం అక్కడున్న ఫారెస్టును తొలగించి భూములన్నింటినీ హద్దులు లేకుండా చెరిపివేయాలే పేరుతో జీవవైవిధ్యాన్ని దెబ్బతీసేందుకు, మొక్కలను తొలగించటం కోసం జేసీబీలను బుల్డోజర్లను తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా పోలీసు బలగాలను దింపి, బారీగేట్లను ఏర్పాటు చేయటంతో విద్యార్థులు తమ భూములను కాపాడుకోవటం కోసం ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేసి సుమారు 60 మందికి పైగా రాయ్‌దుర్గ్, మాధాపూర్, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లకు తరలించారు. వారితో పాటు మరో 200 మందిని అరెస్టు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇది అత్యంత అవమానకరమైన ఘటన. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని ఎవరైనా వచ్చి ముఖ్యమంత్రిని కలసి సమస్యలు చెప్పుకోవచ్చని అసెంబ్లీలో ప్రకటించిన రేవంత్ రెడ్డి ఈ రోజు విద్యార్థులని చూడకుండా అమ్మాయిలని చూడకుండా గాయాలు చేసి, లాక్కుని పోయి, నిర్బంధాన్ని ప్రయోగిసూ పోలీసులు పిడిగుద్దులు గుద్దుతూ వ్యాన్లలో ఎత్తేవేస్తూ ఈరోజు అరెస్టు చేయటాన్ని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఖండిస్తుంది. ఈచర్యలు చేయటమంటేనే ప్రజాస్వామ్యం లేకుండా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నట్లు అనిపిస్తుంది. తక్షణమే ఈ చర్యలను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. యూనివర్సిటీలో దింపిన పోలీస్ బలగాలను వెనక్కి పిలిపించాలి. జేసీబీ, బుల్డోజర్లను అక్కడి నుండి ఖాళీ చేయించాలి. హెచ్‌సీయూకు చెందిన భూముల వేలాన్ని అపాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ కోరుతుంది. అలాగే రేపు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ ఆందోళనలకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపునిస్తుంది. తక్షణమే అరెస్టు చేసిన విద్యార్థులను బేషరతుగా విడిదల చేయాలని లేని పక్షంలో విద్యార్థుల తరపున ముఖ్యమంత్రి ఇంటిని కూడా ముట్టడిస్తామని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాము. ఈ ఘటనలనీ, నిర్బంధాలనీ, నియంతృత్వాన్ని ప్రజాస్వామికవాదులు, మేధావులు, విద్యార్థులు ఖండిరచాని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటి కోరుతుంది.

# ఉపాధ్యాయులను కించపరిచేవిధంగా మాట్లాడటం సరికాదు

## టీయూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామినేని వెంకటేశ్వర్లు, లచ్చుమల్ల వెంకన్న

**హైదరాబాద్ (జనంసాక్షి)**



రామినేని వెంకటేశ్వర్లు(ఆర్.వి) రాష్ట్ర అధ్యక్షులు



లచ్చుమల్ల వెంకన్న (యల్. వి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

అసెంబ్లీలో విద్యాశాఖ బడ్జెట్ పై జరిగిన చర్చలో గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఉపాధ్యాయులను కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్( టీయూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామినేని వెంకటేశ్వర్లు, లచ్చుమల్ల వెంకన్న డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు సంవత్సరంలో కేవలం సగం రోజులే పనిచేస్తున్నారని జీతాలు మాత్రం సంవత్సరానికి తీసుకుంటున్నారని అర్థం వచ్చేలా మాట్లాడడం సరికాదని మేము కూడా మిగతా ఉద్యోగుల లాగే పనిచేస్తున్నామని కేవలం మనోవిజ్ఞాన శాస్త్రం ప్రకారం విద్యార్థులకు సెలవులు ఇస్తారని ఆసమయంలో కూడా మేము ఎల్లప్పుడూ ప్రభుత్వానికి అందుబాటులోనే ఉంటున్నామని తెలిపారు. మీరు ఒకవేళ పిల్లలకు ఎలాంటి సెలవులు ఇవ్వకుండా బోధన సాగించే విధంగా అకాడమిక్ క్యాలెండర్ ను రూపొందించి ఇస్తే ఆ విధంగా పనిచేయడానికి ఉపాధ్యాయ లోకమంతా సిద్ధంగా ఉందని వారు తెలిపారు. మిగతా ఉద్యోగులు మాకంటే 30 రోజులు ఎక్కువగా పనిచేస్తారని అందుకు తగ్గట్టుగానే వారికి 30 సంపాదిత సెలవులు కూడా ప్రభుత్వం ఇస్తున్న విషయం గౌరవ ముఖ్యమంత్రి గారికి తెల్వనిది కాదని, విద్యాశాఖను కూడా నాన్ వేకేషన్ శాఖగా మార్చి పిల్లలకు ఎలా బోధన
చేయాలో నూతన శిక్షణ కార్యక్రమాలకు ప్రణాళికలను రూపొందించాలని వారు డిమాండ్ చేశారు.

# ఇంటి వద్దకే వచ్చి టీకాలు వేస్తాం

**ఆరోగ్య శాఖ వినూత్న కార్యక్రమం**

**హైదరాబాద్ (జనంసాక్షి) :**



పుట్టిన ప్రతి శిశువుకు ఆరోగ్య సంజీవని టీకానే(వ్యాక్సిన్). పిల్లల నుంచి పెద్దల వరకు వివిధ రకాల వైరస్‌లు ఇతర జబ్బుల బారినపడకుండా టీకాలనేవి కాపాడుతాయి. అందుకే ప్రభుత్వమే ఉచితంగా వీటిని సరఫరా చేస్తోంది. హైదరాబాద్ నగరంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో పుట్టిన ప్రతి శిశువు నుంచి 15 ఏళ్ల వయస్సు వరకు బాలబాలికలను గుర్తించి ప్రతి ఒక్కరికి వీటిని అందించాలి. ఈ నేపథ్యంలో నగర ఆరోగ్య శాఖ వినూత్న కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టింది. హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బందే ఇంటికి వచ్చి టీకా వేసేలా ద్విచక్ర వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. తొలి విడతలో భాగంగా ఖైరతాబాద్, శ్రీరామ్ నగర్, మెట్టుగూడ, సనత్‌నగర్ పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎంలకు వీటిని అందించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీహెచ్ఎంఓ) డాక్టర్ వెంకటి శనివారం జెండా ఊపి ఈ వాహనాలను ప్రారంభించారు. పూర్తి స్థాయిలో టీకాలకు నోచుకోని 10-15 శాతం మంది : ప్రస్తుతం నగరంలో బుధ, శనివారం ప్రతి యూపీహెచ్‌సీ(అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్) పరిధిలో టీకా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అయితే అందరికీ ఈ టీకాలు అందడం లేదు. కొందరు కొన్ని డోసులు తీసుకొని పలు కారణాల వల్ల మిగతా వాటికి దూరంగా ఉంటున్నారు. శిశువులకు ఇచ్చే వ్యాక్సిన్లపై ఇప్పటికీ కొందరి తల్లిదండ్రులకు పలు అపోహలు ఉన్నాయి. ఈ విధంగా నగరవ్యాప్తంగా 10-15 శాతం శిశువులు, పిల్లలు పూర్తి స్థాయిలో టీకాలకు నోచుకోవడం లేదు. ఫలితంగా వ్యాధి నిరోధక శక్తి తగ్గి వ్యాధులు తిరగబెడుతున్నాయి. ఇటీవల కాలంలో నగరంలో పలు ప్రాంతాల్లో డిఫ్తీరియా విజృంభిస్తోంది. చాలామంది పిల్లలు బూస్టర్ డోస్ తీసుకోకపోవడం వల్ల ఈ వ్యాధి బారిన పడుతున్నట్లుగా వైద్యులు చెబుతున్నారు. దీన్ని అధిగమించేందుకు త్వరలో అన్ని ప్రాంతాల్లోని ఎన్ఎన్ఎంలకు ఇలాంటి వాహనాలను అందించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో 54 వేల మంది పిల్లలు టీకాలకు అర్హులు. తల్లిదండ్రులు బాధ్యతగా ఈ వ్యాక్సిన్లను అందించాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

# కవులు, కళాకారులకు ఉగాది రాష్ట్రస్థాయి పురస్కారం



**భూపాలపల్లి , మార్చి 30 (జనం సాక్షి):**

భూపాలపల్లి పట్టణంలోని పుష్ప గ్రాండ్‌లో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా శ్రీ వివేకానంద సేవా సమితి భూపాలపల్లి గారి ఆద్వర్యంలో జరిగిన రాష్ట్ర పురస్కారాల ప్రదానోత్సవంలో భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ కవులు, కళాకారులు తమ నైపుణ్యంతో ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. నిర్వాహక కమిటీని ఎమ్మెల్యే సన్మానం చేశారు. ఇటువంటి కార్యక్రమాలు చాలా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ హాస్యనటుడు ఆర్ఎస్ నందా వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన కవులు, కళాకారులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

# తొందరపెట్టకు.. కొంచెం ఓపిక పట్టు

**హైదరాబాద్ (జనంసాక్షి)**

**ఎస్సై అయ్యాక పెళ్లి చేసుకుంటా.. డ్యాన్సర్‌ను నమ్మించి మోసం చేసిన యువకుడు**

ఎస్సై జాబ్‌కు ప్రిపేర్ అవుతున్నా.. తొందరలోనే ఉద్యోగం వస్తుంది.. అప్పటిదాకా పెండ్లికి తొందరపెట్టకు.. కొంచెం ఓపిక పట్టు అని నమ్మించాడో యువకుడు. నిన్నే పెండ్లాడుతా అని చెప్పి తన కోరికను తీర్చుకున్నాడు. దాదాపు ఎనిమిదేండ్లు ప్రేమాయణం తర్వాత ఇప్పుడు పెండ్లి చేసుకోనని మొహం చాటేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన యువతి హైదరాబాద్ మధురా నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం.. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ యాదగిరినగర్‌లో నివాసం ఉండే ఓ యువతి(29) సినిమాల్లో డ్యాన్సర్‌గా పనిచేస్తోంది. బేగంపేట మహిళా డిగ్రీ కాలేజీలో చదువుకునే రోజుల్లో తన స్నేహితురాలి ద్వారా మహబూబాబాద్ జిల్లా గార్ల మండలానికి చెందిన భూక్యా వినోద్‌కుమార్ (30) పరిచయమయ్యాడు. ఆ పరిచయంతో ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. దీంతో వినోద్ ప్రేమను సదరు యువతి అంగీకరించింది. దీంతో పెండ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో తన కోరికలు తీర్చుకున్నాడు. ఎనిమిదేళ్లుగా ఆమెతో ప్రేమాయణం నడిపించారు. ఈ క్రమంలో సదరు యువతి పెళ్లి చేసుకోమని అడగడడంతో.. ఎస్సై పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా.. టెన్షన్ పడకు.. నిన్నే పెండ్లి చేసుకుంటానని కొద్దిరోజులు బుకాయించాడు. కోరిక తీరిన తర్వాత ఆమె నుంచి తప్పించుకుని తిరగడం మొదలుపెట్టాడు. తనను వినోద్ మోసం చేస్తున్నాడని గ్రహించిన సదరు యువతి.. ప్రియుడి స్వగ్రామమైన గార్ల గ్రామానికి వెళ్లింది. అతని తండ్రి భూక్యా మంగీలాల్, తమ్ముడు అశోక్‌లను నిలదీసింది. దీంతో వినోద్‌తో పెండ్లి జరిపిస్తామని నచ్చజెప్పి.. పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టకుండా వెనక్కి వెళ్లేలా చేశారు. ఫిబ్రవరిలో ఇది జరగ్గా.. ఇప్పటికీ పెండ్లిపై ఎలాంటి స్పందన లేదు. దీంతో వినోద్‌ను నిలదీయగా.. ఇంట్లో తమ పెళ్లికి ఒప్పుకోవడం లేదు.. నిన్ను పెండ్లి చేసుకోనని తేల్చిచెప్పేశాడు. దీంతో సదరు యువతి మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో వినోద్‌పై ఫిర్యాదు చేసింది. బాధిత యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు జూపార్కుకు నో హాలిడే

**హైదరాబాద్ (జనంసాక్షి) :**

హైదరాబాద్ నగరవాసులకు అలర్ట్. సోమవారం నాడు నెహ్రూ జూలాజికల్ పార్క్ తెరిచే ఉండనుంది. ఈ విషయాన్ని జూ క్యూరేటర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రంజాన్ సెలవు దినం కావడంతో జూ పార్క్‌కు కూడా సెలవు ఉంటుందని సందర్శకులు భావించే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే జూ క్యూరేటర్ క్లారిటీ ఇచ్చారు. రంజాన్ పర్వదినాన కూడా జూపార్క్ తెరిచే ఉంటుందని వెల్లడించారు. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జూ తెరిచే ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# 2 నెలలు వేసవి సెలవులు

**హైదరాబాద్ (జనంసాక్షి)**

తెలంగాణ ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు గుడ్ న్యూస్. ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు మార్చి 30 నుంచి సమ్మర్ హాలిడేస్ ప్రారంభం అయ్యాయి. ఈనెల 25వ తేదీతో ఇంటర్ ఎగ్జామ్స్ కంప్లీట్ అయ్యాయి. రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు 2024-25 అకడమిక్ సంవత్సరానికి శనివారమే చివరి వర్కింగ్ డే. అంటే మార్చి 30 నుంచి జూన్ 1వ తేదీ వరకు వేసవి సెలవులను ఇంటర్ బోర్డు ప్రకటించింది. తిరిగి తెలంగాణ అవతరణ దినోత్సవం నాడు జూన్ 2న కాలేజీలు రీ ఓపెన్ అవుతాయి. ఇంటర్‌బోర్డు రూల్స్ ప్రకారం వేసవి సెలవుల్లో ఇంటర్ క్లాసులు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహించకూడదు. ఎవరైనా క్లాసులు అనధికారికంగా నిర్వహిస్తే ఇంటర్ బోర్డు చర్యలు తీసుకుంటుంది. తెలంగాణ ఇంటర్ పరీక్షలు మార్చి 5వ తేదీ
నుంచి మార్చి 20వ తేదీ వరకు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల మధ్యలో ఈ పరీక్షలు నిర్వహించారు. ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ 2025 ఫిబ్రవరి 3 నుంచి ఫిబ్రవరి 22 వరకు జరిగాయి. ఇక ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం కొనసాగుతోంది. స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాల సంఖ్యను 17 నుంచి 19 కు పెంచారు. జవాబు పత్రాలను దిద్దేందుకు 14,000 మందిని నియమించారు. ఏప్రిల్ చివర్లో ఫలితాలను ప్రకటించే అవకాశం ఉంది.

# ఇసుక అక్రమ రవాణాపై ఆగ్రహం

**ట్రాక్టర్లను పట్టుకుని అధికారులకు అప్పగింత**

**చేర్యాల (జనంసాక్షి) మార్చి 30 :**




అర్ధరాత్రి ఆకునూరు గ్రామం మీదుగా ఇసుక అక్రమ రవాణా సాగుతుందని గమనించిన ఆకునూరు గ్రామస్తులు ఆదివారం తెల్లవారుజామున ఉదయం 2గంటలకు అంగడి బజారులో రెండు ట్రాక్టర్లను పట్టుకొని వెంటనే రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి కి సమాచారం అందించడంతో వెంటనే హుటాహుటిన గ్రామానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించి పోలీస్ సిబ్బంది సహాయంతో రెండు ట్రాక్టర్లను చేర్యాల పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా రెవిన్యూ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని ఎక్కడైనా ఇసుక రవాణా చేసినా సమాచారం అందించాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు చెక్

**హైదరాబాద్ (జనంసాక్షి)**



అంగన్‌వాడీ కేంద్రాల్లో సరకులు పక్కదారి పడుతున్నా యనే ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ సమస్యను సరిదిద్దే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. అందు లో భాగంగా చేపట్టిన లబ్ధిదా రుల ముఖ గుర్తింపు హాజరు ప్రక్రియ సత్ఫలితాలు ఇస్తోం దని అధికా రులు అంటు న్నారు. అంగన్ వాడీ కేంద్రా ల్లోని చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు, బాలింతలు, గర్భిణుల కు కూడా పౌష్టికాహా రం అందిస్తున్నారు. లబ్ధిదారులకు అందించే బాలామృతం వంటి వివరాలను పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీనితో పాటు ముఖ గుర్తింపును కూడా చేపడుతున్నారు. ఈ యాప్ ప్రక్రియలో భాగంగా వారి ఫొటో, ఆధార్ కార్డు నెంబరు, మొబైల్ సంఖ్య నమోదు చేస్తున్నారు. వెంటనే లబ్ధిదారుడి సెల్ఫోన్కి వచ్చిన ఓటీపీని ఎంటర్ చేస్తే ఈ ప్రక్రియ పూర్తి అవుతుంది.
స్థానికంగా ఉన్నవారికే అంగన్‌వాడీ సరకులు
అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలను మరింత పారదర్శకంగా ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రోజూ పౌష్టికాహారంలో భాగంగా బియ్యం, నూనె, పప్పు, గుడ్డు, ఆకుకూరలు, బాలామృతం, కుర్‌కురే వంటివి అందిస్తున్నారు. అమలు చేస్తున్న ముఖ గుర్తింపు హాజరు ప్రక్రియతో సరకులు పక్కదారి పట్టకుండా ఉంటుంది. నేరుగా లబ్ధిదారులకే అందే అవకాశం ఉంటుంది. స్థానికంగా ఉండని లబ్ధిదారులకి అంగన్‌వాడీ కేంద్రాల్లో సరకులు తీసుకనే అవకాశం ఉండదు. అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు ఈ విషయమై విడతల వారీగా శాఖాపరంగా శిక్షణను ఇచ్చారు. ఇప్పటికే సీడీపీవోలకు, సూపర్‌వైజర్లకు ఆన్‌లైన్ ద్వారా అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులను ఏర్పాటు చేసి పూర్తి చేశారు. అంతా బాగానే ఉన్నా పోషణ్ అభియాన్, పోషణ్ ట్రాకర్, ఎన్‌హెచ్‌టీఎస్ లాంటి యాప్‌లతో పాటు తాజాగా ముఖ గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణతోపాటు ప్రతి ప్రక్రియ ఇంటర్నెట్తో అనుసంధానమై ఉంది. ఈ సందర్భంలో సామర్థ్యం తక్కువ కలిగిన మొబైల్ సాంకేతిక పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొందరు అంగన్‌వాడీలు చెబుతున్నారు.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో

## 37వ రోజూ సహాయక చర్యలు



**నాగర్ కర్నూల్ (జనంసాక్షి)**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో 37వ రోజు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. మిగతా ఆరుగురి ఆచూకీ కోసం గాలింపు చర్యలు నడుస్తున్నాయి. సహాయక బృందాల ఉన్నతాధికారులతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ లోతేటి మాట్లాడుతూ.. సహాయక బృందాలకు తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పండుగ నాడు కుటుంబాలకు దూరంగా ఉంటూ సహాయక చర్యల్లో పాల్గొంటున్న సహాయక సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. టన్నెల్ లోపల చిక్కుకున్న వారిని రక్షించడానికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఏ ఒక్క అవకాశాన్ని వదిలిపెట్టకుండా వివిధ రకాల నిష్ణాతులైన సిబ్బందిని, సాంకేతికతను ఉపయోగించుకుంటున్నట్లు తెలిపారు. మొదటి రోజు నుంచే టన్నెల్ లోపల రెస్క్యూ ఆపరేషన్ చేయగల ఆర్మీ సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి, హైడ్రా, రైల్వే, జీఎస్ ఐ, ఎన్‌జీఆర్ ఐ, ర్యాట్ హోల్ మైనర్స్ , ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్లు, కేరళ నుంచి ప్రత్యేక శిక్షణ పొందిన క్యాడవర్ డాగ్స్, రోబోటిక్ సహా అన్ని రకాల నిష్ణాతులను, సాంకేతికతను ఉపయోగించుకుంటూ టన్నెల్ లోపల చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రతి రోజూ నిరంతరాయంగా కొనసాగుతున్న సహాయక చర్యలపై సమీక్షలు నిర్వహిస్తూ, పలు సూచనలు, సలహాలు అందజేస్తూ సహాయక పనులను వేగవంతం చేస్తున్నామని శివశంకర్ వివరించారు . నిర్విరామంగా డీ వాటరింగ్, ప్రక్రియలను చేపడుతూ, సహాయక పనులకు ఆటంకంగా ఉన్న స్టీల్‌ను తొలగిస్తూ లోకో ట్రైన్ ద్వారా టన్నెల్ బయటికి తరలిస్తున్నామని తెలిపారు.

# రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఏఐటీయూసీ మహాసభలను జయప్రదం చేయాలి

- ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి



**తలకొండపల్లి, మార్చి 30 (జనంసాక్షి) :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై సమర శంఖం పూరించేందుకు కార్మికులందరూ ఏకం కావాలని ఏ.ఐ.టి.యు.సి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు.ఆదివారం తలకొండపల్లి మండల కేంద్రంలో యూనియన్ నాయకులతో కలిసి పర్యటించారు.వివిధ భాగాలలో పనిచేస్తున్న కార్మికులను కలిసి సమస్యల పరిష్కారం కొరకు సంఘటితం కావలసిన అవసరం ఉన్నదని ఆయన అన్నారు.ఏప్రిల్ 21,22 తేదీలలో శంషాబాద్ లో నిర్వహించే 4,వ మహాసభలకు తలకోండపల్లి మండలం నుండి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఈ సందర్భంగా సామిడి శేఖర్ రెడ్డి,బి,ఓ,సి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కన్యగారి నర్సింహ్మరెడ్డి,లు మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా నిర్మాణ రంగంలో 10 కోట్ల,కు పైగా కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు.కార్మికులకు సమగ్రమైన సంక్షేమ చట్టాన్ని ఎ.ఐ.టి.యు.సి పోరాటాల ద్వారా సాధించుకున్నాం అన్నారు.తెలంగాణలోని 33 జిల్లాలలో పనిచేస్తున్న లక్షలాదిమంది నిర్మాణ కార్మికులైన తాపీ,ఇటుక, రాయి,కంకర, సెంట్రింగ్ ప్లంబర్, ఎలక్ట్రిషన్, వడ్రంగి,కాంక్రీట్ మిక్సింగ్ పెయింటర్స్,మార్బుల్స్,తదితర రంగాలలో పనిచేసే లక్షలాదిమంది కార్మికులను సంక్షేమ సభ్యులుగా నమోదు చేసి వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని,60 సంవత్సరాలు దాటిన కార్మికులకు పెన్షన్ తో పాటు ప్రభుత్వ నుండి వచ్చే అన్ని సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.మహాసభల ద్వారా భవిష్యత్ కార్యాచరణతో పాటు భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై తీర్మానాలు చేసి ప్రభుత్వాల ద్వారా వాటిని సాధించేందుకు ప్రణాళిక బద్ధంగా కార్మికులంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు.ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 43 చట్టాలను నాలుగు విభాగాలుగా విడదీసి కార్మిక హక్కులను కాలరాయాలని చూస్తున్న పద్ధతిని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని తెలిపారు.లేనిచో కార్మికులంతా ఏకమై కేంద్ర ప్రభుత్వంపై మిలిటెంట్ పోరాటాలను నిర్వహిస్తామన్నారు.అదేవిధంగా తలకొండపల్లి మండలంలో కార్మికులుగా పనిచేస్తున్న వారందరినీ రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డులో నమోదు చేయించి,ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వర్తించే విధంగా చూస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఎఐటిసి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు రామావత్ సక్రు నాయక్,సిపిఐ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు భాతరాజు నరసింహ్మా,తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది పచ్చడితో చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, మార్చి 30 (జనం సాక్షి) :** గండిపేట మండలం నార్సింగ్ గ్రామంలో "శ్రీ విశ్వావసు నామ సంవత్సర " ఉగాది పండుగ ఘనంగా నిర్వహించారు. నార్సింగ్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో వేసవి నుంచి ఉపశమనం పొందెందుకు "ఉచిత నీరు "పంపిణీ కేంద్రం ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి నార్సింగ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఉగాది పచ్చడితో చలి వేంద్రం కార్యక్రమం ఏర్పాటు చేసిన వెంకట శివాజీ యాదవ్ చేతుల మీదుగా ఉగాది పచ్చడితో ప్రారంభించారు.ఈ కోట వేణు గౌడ్, కైరంకొండ వినోద్ కుమార్ , కొల్లూరు కిరణ్, దుద్దు కిరణ్, జల్లి వెంకటేష్, కొల్లూరు శ్రీకాంత్, ఏ .గిరిధర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు రాము,సాయిరాం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు



మల్కాజిగిరి, మార్చి 30 (జనంసాక్షి) : వాహనదారులు, పాదచర్ల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు, గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ సునీత రాము యాదవ్ సాయి నగర్ చౌరస్తా, గౌతమ్ నగర్ చౌరస్తాలలో ఏర్పాటుచేసిన చలివేంద్రాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రజలకు దాహం తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని అన్నారు.చలివేంద్రాలు ఏర్పాటు చేసిన కార్పొరేటర్ ను అభినందించారు.ఈకార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మదర్ థెరిస్సా వికలాంగుల కాలనీలో చలివేంద్రం ప్రారంభం



**జవహర్‌నగర్, మార్చి 30 (జనంసాక్షి) :** వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని మదర్ థెరిస్సా వికలాంగుల కాలనీ చౌరస్తాలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మదర్ థెరిస్సా కాలనీ అధ్యక్షుడు బూడిద వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చలివేంద్రాన్ని మాజీ కార్పొరేటర్ కారింగుల నిహారిక గౌడ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్‌లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తొలిరోజు స్థానికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిహారిక గౌడ్ మాట్లాడుతూ, "వేసవి కాలంలో దాహార్తిని తీర్చే పనిలో ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమైన విషయం. బూడిద వెంకటేష్ లాంటి భద్రత మనుషులు ఆదర్శంగా నిలిచారు. మరిన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ ఉద్దేశంతో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి" అని సూచించారు. బూడిద వెంకటేష్ మాట్లాడుతూ, తన కుమారుడు బూడిద శ్రీకాంత్ జ్ఞాపకార్థంగా ప్రతి ఏటా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. "వారానికి ఒకరోజు మజ్జిగ, మిగతా రోజుల్లో చల్లని నీరు అందుబాటులో ఉంచుతాము. ఎండాకాలంలో దారిన వెళ్లే వారెవరూ దాహంతో ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ ఎమ్ ఆర్ పి ఎస్ అధ్యక్షుడు కొయ్యడా వెంకటేష్, కార్మిక సంఘం అధ్యక్షుడు చెన్నాపురం యాదయ్య, మహేందర్ యాదవ్, మంజుల, రవి, మీనాక్షి, వెంకటేష్, బాలమురళి, శ్రీను, వీరాస్వామి, బాబు, కృష్ణ, సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# యువత వ్యాపార రంగంలో అద్భుతంగా రాణించాలి

- స్వయం ఉపాధి నిర్ణయం అభినందనీయం
- ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి



**తాండూరు, మార్చి 30 (జనంసాక్షి) :** యువత వ్యాపార రంగంలో అద్భుతంగా రాణించాలని ఆర్బీఓఎల్ సీఈఓమరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తాండూర్ పట్టణంలోని బస్ స్టాండ్ సమీపంలో నూతన జేకే మొబైల్స్ అండ్ సర్వీస్ సెంటర్ ప్రారంభోత్సవ వేడుకల్లో ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన మొబైల్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి నిర్ణయం అభినందనీయమని తెలిపారు. మొబైల్ వ్యాపార యజమాన్యానికి శుభాభినందనలు తెలుపుతూ వ్యాపార రంగంలో అభివృద్ధి చెందాలని, అద్భుతంగా రాణించాలని బుయ్యని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో పంచాంగ శ్రవణం



**తాండూరు, మార్చి 30 (జనంసాక్షి) :** పట్టణంలోని శ్రీ వరసిద్ధి వినాయక ఆలయం ఆదర్శనగర్ లో ఉగాది ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా తాండూరు సాహితి సమితి మరియు హిందు ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం మరియు శ్రీ సిద్ధిలింగయ స్వామి తో ఉగాది పంచాంగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా జరిగింది .ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి , మరియు సభాధ్యక్షులు ఆలంపల్లి రామ్ రెడ్డి మరియు హిందు ఉత్సవ కమిటీ అధ్యక్షులు నరా రెడ్డి , కార్యదర్శి రవి కాంత్ , సాహితి సమితి అధ్యక్షులు వాసు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# చౌడేశ్వరి ఆలయం వద్ద షడ్రుచుల ఉగాది పచ్చడి పంపిణీ



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, మార్చి 30 (జనం సాక్షి) :** నారాయణపేట మండలం, సింగారం గ్రామంలో ఆదివారం తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని చౌడేశ్వరి ఆలయం వద్ద షడ్రుచుల ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. సాయంత్రం అంజనేయస్వామి ఆలయం పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా ఆదాయ, వ్యయాలు, పేరు బాలలు అడిగి తెలుసుకున్నారు. అటు నుంచి గ్రామ శివారులోని చింతలరాయ స్వామి ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళ్లి ధ్వజారోహన చేశారు. ఏప్రిల్ నెల 11 నుంచి చింతలరాయ స్వామి జాతర ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ అర్చకులు కోప్రేష్ చారి తెలిపారు. 11 న శుక్రవారం ఉదయం పల్లకి సేవ ఊరేగింపు, రాత్రికి ప్రభోత్సవ కార్యక్రమం. 12వ తేదీ శనివారం పౌర్ణమి సందర్భంగా స్వామివారి ఉద్దాల ఉత్సవం, మరియు మహా రథోత్సవం. 13వ తేదీన ఆదివారం ఉదయం స్వామివారికి చక్రస్నానం తదితర కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు. అంతకుముందు చింతలరాయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.


# ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం పుణ్యం



**ఇబ్రహీంపట్నం, మార్చి 30 (జనం సాక్షి) :** రంజాన్ మాసం సందర్భంగా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో మంచాల మండలం వ్యవసాయ సహకార సంఘం చైర్మన్. వెదిరె. హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కావాలి బుగ్గ రాములు ముదిరాజ్, మాధగోని జంగయ్య గౌడ్,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంటుంది అన్నారు.రంజాన్ మాసంలో ఒక నెల రోజులపాటు పవిత్రమైన మనస్సుతో ఉదయం నుండి సాయంత్రం వరకు మంచి నీరు కూడా త్రాగ కుండా ఉప వసం ఉండటం చాలా గొప్ప విషయం అన్నారు. అలాంటి ముస్లింసోద రులతో కలిసి రంజాన్ మాసం ఇఫ్తార్ విందులో పాల్గొనడం చాలా సంతోషంగాఉంటుంది అన్నారు.కులమతాలకు అతీతంగా అందరితో కలిసి ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తూ అందరం ఒక్కటే హిందూ ముస్లిం బాయి బాయి అంటూ చెప్పుకునే గొప్ప పండుగ రంజాన్ పండగ అని అన్నారు.

# రాష్ట్రస్థాయిలో ప్రతిభచాటిన అఖిలజా రెడ్డి

- గ్రూప్ వన్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 125, మల్టీ జోన్ లో 50వ ర్యాంకు



**న్యాల్‌కల్, మార్చి 30 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా, న్యాల్‌కల్ మండలం, మిర్జాపూర్ (బి) గ్రామానికి చెందిన విద్యార్థిని అఖిలజా రెడ్డి రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. ఆదివారం మధ్యాహ్నం "విశ్వావసు" ఉగాది నూతన సంవత్సర పర్వదినం రోజున ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం గ్రూప్ వన్ ఫలితాలను విడుదల చేశారు. మిర్జాపూర్ (బి) గ్రామానికి చెందిన ఎక్కెల్లి నిర్మల - జగన్నాథ్ రెడ్డి (హద్దునూర్ సహకార సంఘం చైర్మన్) దంపతుల కూతురు అఖిలజా రెడ్డి గ్రూప్ వన్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి లోనే 125, మల్టీ జోన్ విభాగంలో 50వ ర్యాంకు సాధించి ప్రతిభను చాటారు. పటాన్చెరులోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో ప్రాథమికం నుండి పదవ తరగతి వరకు విద్యనభ్యసించారు. హైదరాబాదులోని ప్రవేట్ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. ఆదివారం విడుదల చేసిన గ్రూప్ వన్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 125, మల్టీ జోన్ విభాగంలో 50వ ర్యాంకు సాధించడం పట్ల విద్యను బోధించిన విద్యా సంస్థల నిర్వాహకులు, లెక్చరర్లు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్థానిక గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఉగాది నూతన సంవత్సర "విశ్వావసు" పర్వదినం రోజున మెరుగైన ర్యాంకు సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# ముస్లీం సోదరులకు సరుకులు పంపిణీ



**కొడంగల్, మార్చి 30 (జనం సాక్షి) :** కొడంగల్ పట్టణ కేంద్రంలో మున్సిపల్ పరిధిలోని మూడో వాడు యందు పాత కొడంగల్ గ్రామములో పవిత్రమైన రంజాన్ పండుగకు పేద మైనార్టీ సోదరులకు సురుకుమా కు కావాల్సిన వస్తువులను కొడంగల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందరం ప్రశాంత్, స్థానిక మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ సరుకులను అందజేశారు.కార్యక్రమంలో పాత కొడంగల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గొల్ల బుగ్గప్ప ,మామిళ్ళ మల్లేష్, గొల్ల మోహన్, శివశంకర్, కోనంగి జగ్గప్ప ,కొనింగి బుగ్గప్ప, గొల్ల మల్లేష్, మైనార్టీ సోదరులు సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ పండుగ సందర్భంగా పటిష్ట బందోబస్తు

- ఈద్గా మైదానాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ



**ఆదిలాబాద్ ప్రతిని, మార్చి 30 (జనంసాక్షి) :** ముస్లిం సోదరులు సోమవారం నిర్వహించుకునే రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా మైదానం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఇందులో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముస్లింల పవిత్ర పండుగ అయిన రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని ఈద్గా మైదానం మరియు మసీదులలో ముఖ్యమైన ప్రదేశాలలో పోలీసు పికెట్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పట్టణంలో దాదాపు 250 మంది సిబ్బందితో బందోబస్తు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆదివారం రాత్రి నుండి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిబ్బంది ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సిబ్బందికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ వెంట ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి పట్టణ సిఐలు బి. సునీల్ కుమార్, కరుణాకర్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ మహేందర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి సేవ సమితి చలివేంద్రం ప్రారంభం



**చేవెళ్ల, మార్చి 30 (జనం సాక్షి) :** వేనవిలో ప్రజల దాహం తీర్చేందుకు సత్యసాయి సేవ సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని సత్యసాయి సేవ సమితి చేవెళ్ల మండల సత్యసాయి సేవ సమితి సభ్యులు అయ్యవారి గోపాలచారి, రామగౌడ్, మధుసూదన్, కోలన్ దివాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం చేవెళ్ల మున్సిపాలిటి పట్టణ కేంద్రంలో శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు చలివేంద్రాన్ని స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ. వేసవిలో ఎండల నుంచి ప్రజల దహర్తిని తీర్చేందుకు ప్రతి సంవత్సరం చలివేద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అయితే చలివేద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కృష్ణా రెడ్డి, కానిస్టేబుల్ రవిగౌడ్, శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు మోహన్ రెడ్డి, వెంకట్ స్వామి, విజయ్, విఠలయ్య, విఠల్ రెడ్డి బాస్కర్, వెంకటేశ్, శంకరయ్య, సతీష్ స్థానికులు తదితరులు ఉన్నారు.

## విపణి

### ఇండియన్ రైల్వే ఒకరోజు సంపాదన

# రూ.400 కోట్లు

**జనంసాక్షి:**రోజుకు లక్షలమందిని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరవేస్తున్న ఇండియన్ రైల్వే గురించి దాదాపు అందరికీ తెలిసిందే. లెక్కకు మించిన ట్రైన్స్ దేశంలోని ప్రధాన భూభాగాలను కలుపుతూ ముందుకు సాగిపోతాయి.అయితే ఇంత పెద్ద నెట్‌వర్క్ కలిగిన భారతీయ రైల్వే రోజుకు ఎంత సంపాదిస్తుందో.. బహుశా చాలామందికి తెలుసుండకపోవచ్చు. ఈ కథనంలో ఆ వివరాలను తెలుసుకుందాం.భారతీయ రైల్వే తమ సేవలను అప్డేట్ చేయడానికి మాత్రమే కాకుండా.. ఆదాయాన్ని పెంచుకోవడానికి కూడా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటూనే ఉంది. ఇందులో భాగంగానే కొత్త రైళ్లను ప్రవేశపెట్టడం.. రవాణా కోసం ప్రత్యేక కారిడార్ల



నిర్మాణం చేపట్టడం వంటివి చేస్తోంది. ఇండియన్ రైల్వే రోజుకు ఎంత ఆదాయం గడిస్తుంది అన్న ప్రశ్నకు.. రూ. 400 కోట్లు అని సమాధానం వస్తోంది. అంటే భారతీయ రైల్వే నెలకు రూ. 12వేల కోట్లు సంపాదిస్తున్నమాట. రైల్వేలు కేవలం ప్రజా రవాణాకు మాత్రమే కాకుండా.. సరుకు రవాణా చేయడానికి కూడా విరివిగా ఉపయోగపడుతున్నాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం సరు కును పంపించాలనుకునే కస్టమర్లు ట్రైన్ల ద్వారానే సరుకు రవాణా చేస్తారు.సరుకు రవాణా రైళ్ల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు, ప్యాసింజర్ రైళ్ల ద్వారా వచ్చే ఆదాయం కూడా రైల్వేలకు చాలా ముఖ్యమైనది. రైల్వేలు ప్రతిరోజూ వేలాది ప్యాసింజర్ రైళ్లను నడుపుతున్నాయి. రైల్వేలు స్క్రాప్ అమ్మకాలు వంటి ఇతర వనరుల నుంచి కూడా ఆదాయాన్ని సంపాదిస్తాయి. పీఐబీ డేటా ప్రకారం, 22-23 ఆర్థిక సంవత్సరంలో భారతీయ రైల్వేలు సరుకు రవాణా ద్వారా రూ.1,60,158 కోట్లు ఆర్జించినట్లు తెలుస్తోంది.భారతీయ రైల్వేలు ప్రపంచంలోని టాప్ 5 అతిపెద్ద రైల్వే నెట్‌వర్క్‌లలో ఒకటి.




### ప్రజల్లో పెరుగుతున్న

# సొంతింటి కల

- పెరుగుతున్న రుణ మంజూరీలే నిదర్శనం
- ముఖ్యంగా లగ్జరీ ఇళ్లకు పెరుగుతున్న డిమాండ్
- ఏడాదిలోనే రూ.33 లక్షల కోట్లకు గృహ రుణాలు

**జనంసాక్షి:**వెరసి నూతన గృహాల అమ్మకాలను పెంచుతున్నాయి. ఇళ్ల ధరలు దూసుకెళ్లడం కూడా డిమాండ్‌కు ఆజ్యం పోస్తోంది. ప్రధానంగా భారతీయ కస్టమర్లు లగ్జరీ వైపు మొగ్గు చూపుతుండడంతో హైఎండ్ గృహాలకు స్థిర డిమాండ్ ఉంటోంది. ఓ నివేదిక ప్రకారం 62 శాతం మంది సంపన్న భారతీయులు రాబోయే ఒకట్రెండేళ్లలో లగ్జరీ రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడికి ఆసక్తి చూపుతున్నారు. ఆస్తుల విలువ పెరుగుదల ఇందుకు కారణమని 55 శాతం మంది తెలిపారు. అధిక ఆదాయ వర్గాలు అందుకుంటున్న రుణాల వాటా 2022 సెప్టెంబర్‌తో పోలిస్తే రెండేళ్లలో 52.63 శాతం పెరగడం దేశంలో లగ్జరీ గృహాల డిమాండ్‌కు నిదర్శనం.దేశవ్యాప్తంగా వ్యక్తిగత గృహ రుణాలు 2024 సెప్టెంబర్ చివరి నాటికి మొత్తం రూ.33.53 లక్షల కోట్లు నమోదయ్యాయి. ఏడాదిలో ఈ రుణాలు 14 శాతం పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఫిబ్రవరి కాలంలో బ్యాంకులు ఇచ్చిన అన్ని రకాల లోన్స్ రూ.15.3 లక్షల కోట్లు. ఇందులో హౌసింగ్ లోన్స్ 16.95 శాతం వాటాతో రూ.2.6 లక్షల కోట్లు ఉంది. ఈ కాలంలో పరిశ్రమలు అందుకున్న రుణాలు 14.5 శాతం వాటాకు పరిమితం కావడం గమనార్హం. నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) రెసిడెన్షియల్ ఇండెక్స్ (రెసిడెక్స్) ప్రకారం 2017-18తో పోలిస్తే ఇళ్ల ధరలు 2024 సెప్టెంబర్ చివరినాటికి 38.33 శాతం పెరిగాయి. నిర్మాణంలో ఉన్న ప్రాపర్టీ ధరలు ఏకంగా 42.95 శాతం పెరగడం విశేషం. స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ)లో షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్స్, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీల వ్యక్తిగత గృహ రుణాల వాటా 2024లో 11.29 శాతానికి ఎగసింది. 2014లో ఇది 7.3 శాతమే. అంటే పదేళ్లలో 54.65 శాతం పెరిగిందన్న మాట. మొత్తం రుణాల్లో షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల వాటా 2015లో 9.76 నుంచి 2024లో 16.57 శాతానికి చేరింది. 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మంజూరైన గృహ రుణాలు రూ.9.07 లక్షల కోట్లు.వ్యక్తిగత గృహ రుణాల్లో అధిక ఆదాయం పొందుతున్న వ్యక్తులకు హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలుఇచ్చిన రుణాలు 2022 సెప్టెంబర్‌లో 17.1 శాతం ఉంటే.. 2024 సెప్టెంబర్ నాటికి 26.1 శాతానికి పెరిగాయి. ఈ కాలంలో తక్కువ, మధ్యస్థాయి ఆదాయ వర్గాలకు మంజూరు చేసిన రుణాలు తగ్గడం గమనార్హం.వ్యక్తిగత గృహ రుణాల్లో 2023-24లో హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు జారీచేసిన మొత్తాల్లో రూ.25 లక్షలకుపైగా విలువ చేసే రుణాల వాటా 58% ఉంది. 2021-22లో ఇది 54.34 శాతం నమోదైంది. రూ.10 లక్షల వరకు విలువ చేసే రుణాల వాటా 10.85 శాతం మాత్రమే. 2024 సెప్టెంబర్ 30 నాటికి ఉన్న మొత్తం వ్యక్తిగత గృహ రుణాలలో ఆర్థికంగా వెనుకబడ్డ, తక్కువ ఆదాయ



వర్గాల వాటా 39 శాతం, మధ్య ఆదాయ వర్గాలు 44% ఉంది.2024 సెప్టెంబర్‌తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో వ్యక్తిగత గృహ రుణాల పంపిణీ రూ.4.10 లక్షల కోట్లుగా ఉంది. ఇందులో దక్షిణాది రాష్ట్రాలు అధికంగా 35.02 శాతం కైవసం చేసుకున్నాయి. పశ్చిమ భారత్ 30.14 శాతం, ఉత్తరాది రాష్ట్రాలు 28.73 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాలతో సహా తూర్పు భారత్ వాటా 6.10 శాతమే. ఈశాన్య రాష్ట్రాల వాటా 0.68 శాతం ఉంది. ఇక 2024 సెప్టెంబర్ నాటికి రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో (జీఎస్‌డీపీ) మొత్తం వ్యక్తిగత గృహ రుణాల్లో మహారాష్ట్ర 18.49 శాతం, తెలంగాణ 18.44 శాతం వాటాతో ముందున్నాయి.

### గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 4.50
వరంగల్ ₹ 4.52

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్
₹ 83,600 (22 క్యారెట్లు)
₹ 91,200 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,13,000

## జిబ్లీ ఎఫెక్ట్..

### శామ్ ఆల్ట్‌మాన్ రిక్వెస్ట్



సోషల్ మీడియా.. ఏఐ జనరేటెడ్ స్టూడియో జిబ్లీ స్టైల్ చిత్రాలతో నిండిపోతోంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (ట్విటర్) ఏది ఓపెన్ చేసినా.. జిబ్లీ ఫొటోలే కనిపి స్తున్నాయి. దీనిపైన ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మాన్ స్పందిస్తూ.. ఇక విరామం తీసుకోండి అని ట్వీట్ చేశారు. జిబ్లీ వినియోగం ఎక్కువగా ఉంది. యూజర్లు ఫోటోలను రూపొందించడంలో కొంత విశ్రాంతి తీసుకోండి. ఎందుకంటే మా సిబ్బందికి కూడా నిద్ర అవసరం కదా అంటూ శామ్ ఆల్ట్‌మాన్ ట్వీట్ చేశారు.సాయం ఆల్ట్‌మాన్ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫీచర్ వెనుక పనిచేసే బృందాన్ని తొలగించి, కొత్త టీమ్ ఏర్పాటు చేసుకోండి అంటూ.. ఒక యూజర్ కామెంట్ చేశారు. దీనికి ఆల్ట్‌మాన్ సమాధానమిస్తూ.. ఈ బృందం ప్రపంచంలోనే అతిపెద్ద వెబ్‌సైట్‌ను నిర్మించే పనిలో ఉంది. ఇది ప్రపంచంలోనే అత్యుత్తమ టీమ్ అని అన్నారు. నిజానికి ఓపెన్‌ఏఐ కొన్ని రోజులకు ముందు.. యూజర్లను ఆకట్టుకోవడానికి చాట్‌జీపీటీలో 'జిబ్లీ'ని తీసుకొచ్చింది. దీనిని యూజర్లకు ఎక్కువగా వినియోగించడం మొదలుపెట్టారు. దీనివల్ల జీపీయూ సిస్టంపై అధిక ప్రభావం చూపుతోంది. ఈ కారణంగానే దీనికి ఒక లిమిట్ పెడుతున్నట్లు సీఈఓ వెల్లడించారు. అయితే ఈ లిమిట్ ప్రీమియమ్ యూజర్లకు వర్తించదు.

## కొత్త కార్ల బుకింగ్‌ల జోరు..

**జనంసాక్షి:**హైదరాబాద్ నగరంలో పలు సాంస్కృతిక వేదికల్లో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. తెలుగు భాషా సాంస్కృతి శాఖ ఆధ్వరంలోనే కాకుండా పలు సాహిత్య, సాంస్కృతిక సంఘాల ఆధ్వర్యంలో కళ, నృత్య ఉత్సవాలు, సాహిత్య వేడుకలు, ఉగాది పురస్కారాల సంబరాలను నిర్వహిస్తున్నారు. వారాంతాలతో పాటు సోమవారం రంజాన్ పండుగ కూడా కలిసి రావడంతో మూడు రోజుల సెలవులను ఆస్వాదించడానికి ఈ వేదికలను ఎంచుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో షష్ట గ్రహ కూటమి అనే అంశం వైరల్‌గా మారింది. అరుదుగా సంభవించే ఈ షష్ట గ్రహాల కూటమి వల్ల పలు మార్పులు సంభవిస్తాయని, ముఖ్యంగా రాశులపై ప్రభావం చూపిస్తుందని జ్యోతిష్యులు, పండితులు వెల్లడిస్తున్నారు. 2019లో సంభవించిన ఈ షష్ట గ్రహ కూటమి అనంతరం కరోనా మహమ్మారి విజృంభించిందని ఉదాహరణగా చెప్పుకొచ్చారు. కానీ, విశ్వంలో నిత్యం ఏర్పడే మార్పుల్లో



భాగంగానే ఈ ఆరు గ్రహాల కూటమి, అంతకు మించి ఎలాంటి ప్రభావాలూ ఉండబోవని నగరానికి చెందిన పరిశోధకులు సోషల్‌మీడియా వేదికగా పోస్టులు షేర్ చేస్తున్నారు. వసంతానికి శుభారంబంగా అందరి జీవితాల్లోనూ వసంత శోభ వరించాలని ప్రకృతి దీవెనలతో నూతన సంవత్సరాది ప్రారంభమవుతోంది. అయితే ఈ ఏడాది అందరి చూపు నూతన వాహనాలపై పడింది. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపుల్లో భాగంగా వాహనాలపై టాక్స్ పెరగనుందని నివేదికలు చెబుతున్న నేపథ్యంలో ఈ ఉగాదికి నగరవాసులు భారీ సంఖ్యలో కొత్త వాహనాలను బుకింగ్ చేసుకున్నారని ఆయా కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. జీవితంలో అన్ని అనుభవాలను, అనుభూతులను సముపాళ్లలో ఆస్వాదించాలనే మంచి సందేశాన్నందిస్తూ నూతన తెలుగు ఏడాదికి ఆహ్వానం పలుకుతోంది. ఈ నేపథ్యంలో నగరమంతా కొంగొత్త ఆశలతో పండుగ శోభ వెల్లివిరుస్తోంది.

## 16 రూపాయలకే స్మార్ట్‌ఫోన్!

### లావా స్పెషల్ ఆఫర్

ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ 'లావా ఇంటర్నేషనల్ లిమిటెడ్' తన 16వ వార్షికోత్సవాన్ని పురుస్కరిచుకుని ఒక్క రోజు (మార్చి 30) స్పెషల్ సేల్ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగానే స్మార్ట్‌ఫోన్స్, స్మార్ట్‌వాచెస్, ఇయర్ బడ్స్, పవర్ బ్యాంక్ వంటి వాటిమీద అద్భుతమైన డిస్కౌంట్స్ అందిస్తోంది. అయితే మొదటి 100 మంది కస్టమర్లకు.. కేవలం 16 రూపాయలకే స్మార్ట్‌ఫోన్ (లావా అగ్ని 3), స్మార్ట్‌వాచ్ అందిస్తుంది.కంపెనీ అందిస్తున్న ఈ ఆఫర్ ఈ రోజు (మార్చి 30) మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. అయితే సాయంత్రం 7:00 గంటలకు ప్రోవాచ్ వీ1 సేల్ జరుగుతుంది.

### ప్రకృతి విపత్తు ముందు..

# మానవత్వమే గెలిచింది

### భూకంపంలోనూ శిశువులకు ప్రమాదం జరుగకూండా కాపాడిన నర్సులు.. సర్వత్రా ప్రశంసలు

**మయన్మార్:** మయన్మార్‌లో భూకంప విలయం కారణంగా భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. అంచనాలకు కూడా అందని నష్టాన్ని మిగిల్చింది. భూకంప కేంద్రమైన మాండలేతో పాటు దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా కుప్పకూలిన భవనాల శిథిలాలే. బాధితుల హాహాకారాలే వినిపిస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం 7.7 తీవ్రతతో విరుచుకుపడ్డ భూకంపానికి బలైన వారి సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది. శిథిలాల నుంచి ఇప్పటికే 1,600కు పైగా మృతదేహాలను వెలికితీశారు. 3,500 మందికి పైగా గాయపడినట్టు అధికారులు వెల్లడించారు. మృతుల సంఖ్య 10 వేలు దాటవచ్చని చెబుతున్నారు. మరోవైపు.. భూకంపం సందర్భంగా కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చైనాలోని ఒక చిన్న పిల్లల ఆసుపత్రికి సంబంధించిన వీడియోపై నెటిజన్లు ప్రసంశలు కురిపిస్తున్నారు. భూకంపం సందర్భంగా ఆసుపత్రిలోని మెటర్నిటీ వార్డులో చిన్న పిల్లలను నర్సులు కాపాడారు. భూకంపం ధాటికి భవనంలో కుదుపులు ఎదురైనప్పటికీ వారు కింద పడిపోతున్నా.. ఆసుపత్రిలో ఉన్న శిశువుకు ప్రమాదం జరగకుండా నర్సులు జాగ్రత్తలు తీసుకున్నారు. మరో నర్సు ఫ్లోర్‌పై కూర్చుని శిశువును పట్టుకుంది. ఎంతో కష్టం? మీద కన్న తల్లిలాగా శిశువులను కాపాడారు. ఈ క్రమంలో నర్సుల కష్టంపై నెటిజన్లు స్పందిస్తూ ప్రశంసిస్తున్నారు.ఇదిలా ఉండగా.. మయన్మార్‌తో పాటు థాయ్‌లాండ్‌లో 12 నిమిషాల వ్యవధిలోనే సంభవించిన రెండు భారీ భూకంపాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఈ భూకంపం 334 అణుబాంబులతో సమానమైన శక్తిని విడుదల చేసి వినాశనం సృష్టించిందని స్థానిక భూవిజ్ఞాన శాస్త్రవేత్త జెస్ ఫీనిక్స్ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో మరిన్ని ప్రకంపనలు (%ూాట్వతీంప్త్రశీఎెం%) వచ్చే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. భారత టెక్టానిక్ ఫలకాలు యురేషియన్ ప్లేట్స్‌ను వరుసగా ఢీకొంటుండడం వల్ల నెలల తరబడి ఆఫ్టర్‌షాక్స్ వచ్చే అవకాశం ఉందని జెస్ ఫీనిక్స్ తెలిపారు. భూ ఉపరితలానికి 10 కి.మీ లోతులోనే ప్రకంపనల కేంద్రాలు ఉన్నాయని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది.



**ప్రపంచ దేశాల ఆపన్న హస్తం..**

ఈ కష్ట సమయంలో అక్కడి ప్రజలకు ఆపన్న హస్తం అందించేందుకు భారత్ ఇప్పటికే ముందుకొచ్చింది. 'ఆపరేషన్ బ్రహ్మ' కింద దాదాపు 15 టన్నుల సహాయ సామగ్రిని అక్కడికి పంపించింది. బాధితులకు అవసరమైన ఆహారపదార్థాలతోపాటు.. తాత్కాలిక నివాసం కోసం టెంట్లు, స్లీపింగ్ బ్యాగ్స్, వాటర్ ప్యూరిఫయర్లు, సోలార్ ల్యాంప్, జనరేటర్లు, అత్యవసర వైద్య పరికరాలను మయన్మార్‌కు పంపించినట్లు సమాచారం. అంతే కాకుండా విపత్తులో ఉన్న ఆ దేశానికి సాయం చేసేందుకు 80 మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని అక్కడికి పంపుతున్నట్లు పేర్కొంది. అమెరికా, ఇండోనేషియా, చైనా, ఇతర దేశాలు కూడా అవసరమైన సాయం అందిస్తామని ప్రకటించాయి. ప్రభావిత దేశాలకు సహాయక సామగ్రి పంపుతున్నామని ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రటరీ ఆంటోనియో-గుటెరస్ వెల్లడించారు.

## జాతీయం అంతర్జాతీయం

# 65ఏళ్లలో చేయలేనిది.. పదేళ్లలో చేసి చూపించాం

**నాటి ఆటవిక రాజ్యం కావాలా? నేటి అభివృద్ధి కావాలా?: బిహార్‌లోని గోపాల్‌గంజ్ బహిరంగ సభలో అమిత్ షా**



**పట్నా(జనంసాక్షి):**కాంగ్రెస్, దాని మిత్రపక్షమైన రాష్ట్రీయ జనతాదళ్ పై అమిత్ షా విమర్శలు గుప్పించారు. లాలు ప్రసాద్ యాదవ్, కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ బిహార్‌ను నాశనం చేశారని అన్నారు. మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని అన్నారు. కాంగ్రెస్ హయాంలో నెలకొన్న ఆటవిక రాజ్యం కావాలా..ప్రస్తుతం చూస్తున్న అభివృద్ధి కావాలా అనే విషయాన్ని రాష్ట్ర ప్రజలే నిర్ణయించుకోవాలని అన్నారు. బిహార్‌లోని గోపాల్‌గంజ్ ప్రాంతంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న అమిత్ షా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ..ఈ వ్యాఖ్యలు చేశారు.కాంగ్రెస్ 65ఏళ్లలో చేయని అభివృద్ధిని నరేంద్ర మోదీ పదేళ్లలో చేసి చూపించారని కేంద్ర మంత్రి అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వాన్ని గెలిపిస్తే బిహార్‌ను వరదలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. లాలు ప్రసాద్ అధికారంలో ఉన్న సమయంలో తన కుటుంబసభ్యులకు పదవులు ఇప్పించడంలో బిజీగా ఉన్నారని..ప్రజల కోసం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిహార్ అభివృద్ధి కోసం కేంద్రం రూ.9 లక్షల కోట్లు కేటాయించి.. పదమూడు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మిస్తోందని తెలిపారు. రూ. 8,000 కోట్లతో ఏడు వంతెనలను నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా బిహార్ సీఎం, జేడీయూ అధినేత నీతీశ్ కుమార్ మాట్లాడుతూ జీవితంలో తాను ఇంకెప్పుడూ భాజపా పొత్తును వీడనని అన్నారు. గతంలో రెండు సార్లు తప్పుడు నిర్ణయాలు తీసుకున్నానని..ఇకపై ఎన్డీయే కూటమిని వీడి మరెక్కడికీ వెళ్లే ప్రసక్తే లేదని పురనుద్ఘాటించారు.

### రూ. 800 ఫీజు కట్టలేదని అవమానించారు..

## అవమానంతో బాలిక ఆత్మహత్య!

**జనంసాక్షి:**ఆ బాలిక చదివేది తొమ్మిదో తరగతి.. ఎగ్జామ్ టైమ్ వచ్చింది. కానీ ఆ బాలిక స్కూల్ ఫీజు రూ. 800 కట్టాల్సి ఉంది. పరిస్థితులు అనుకూలించక ఆ కొద్ది మొత్తాన్ని పరీక్షల నాటికి కట్టలేకపోయింది.ఇంకేముందే పరీక్షలు రాయడానికి స్కూల్ యాజమాన్యం అంగీకరించకపోగా, అవమానించింది. ఇది కూడా బహిరంగంగా ఆ అమ్మాయిని స్కూల్ యాజమాన్యం అవమానించింది. ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం ప్రతాప్ గడ్ జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటన స్థానికంగా పెద్ద కలకలం రేపింది.స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ దగ్గర్నుంచీ స్కూల్ మేనేజర్ సంతోష్ కుమార్, ఆఫీసర్ దీపక్ సరోజ్ లు ఆ బాలికను అవమానానికి గురి చేశారు. స్కూల్ పరీక్ష ఫీజు కట్టలేకపోయిందంటూ అవమానించారు. అంతేకాకుండా పరీక్షలకు అనుమతించేది లేదని చెప్పారు. ఇక చేసేది లేక అక్కడ ఏమీ మాట్లాడకుండా ఇంటికి వచ్చేసింది. లోపలకి వెళ్లి తలుపు వేసుకుంది. ఆమె తల్లి పొలం పనికి వెళ్లిపోయింది. తిరిగి సాయంత్రం వచ్చి చూసేసరికి ఆ అమ్మాయి విగత జీవిలా కనిపించింది. స్కూల్ ఫీజు కట్టలేదని ఆమెను పరీక్షకు అనుమతించడమే కాకుండా అవమానించడం దారుణమని న్యాయవాది, స్థానిక పంచాయతీ సభ్యుడైన మొహ్మద్ అరిఫ్ స్పష్టం చేశారు. విద్యార్థుల్ని స్కూల్ యాజమాన్యాలు అవమానించాయంటే అది నేరం కిందకు వస్తుందన్నారు. తన కూతురు చావుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని తల్లి డిమాండ్ చేస్తోంది. దీనిపై భారతీయ న్యాయ సన్నిహిత సెక్షన్ 107 కింద స్కూల్ యాజమాన్యంపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## ఇళ్లకు కూల్ రూఫ్ ఉంటేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్

రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. ఇంటి లోపల వేడి, ఉక్కపోత పెరిగిపోతోంది. దీంతో బయటే కాదు ఇంట్లోనూ ఉండలేని పరిస్థితి. ఇలాంటి సమయంలో ఇళ్లంతా చల్లగా ఉంటే ఆ హాయి వేరే కదూ..అయితే పైకప్పులో కూల్ రూఫ్ టైల్స్, పెయింటింగ్స్ వేసుకుంటే సరి. సూర్యరశ్మిని గ్రహించి, ఇంట్లోకి వేడిని రాకుండా నిరోధించే శక్తి ఉండటం వీటి ప్రత్యేకత. పట్టణీకరణ, కాంక్రీట్ జంగిల్ కారణంగా నగరాలలో అర్బన్ హీట్ ఐల్యాండ్ (యూహెచ్ఐ) ప్రభావం ఏర్పడుతుంది. దీంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వేసవి కాలంలో వేడి గాలులతో 32 కోట్ల మంది భారతీయులు అధిక ప్రమాదకర పరిస్థితులకు గురవుతున్నారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. చెట్ల పెంపకం, వేడి, కాలుష్యాన్ని తగ్గించే ఆచరణీయ పద్ధతులు ఉన్నప్పటికీ ప్రపంచ నగరాలు కూల్ రూఫ్, గ్రీన్ బిల్డింగ్ వంటి వినూత్న పరిష్కార మార్గాల వైపు దృష్టి సారిస్తున్నాయి. న్యూయార్క్, కాలిఫోర్నియా, టొరంటో వంటి అంతర్జాతీయ నగరాలు కూల్ రూఫ్ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తూ గణనీయమైన పర్యావరణ ప్రయోజనాలను పొందుతున్నాయి. ఇదే తరహాలో గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోనూ 'కూల్ రూఫ్ పాలసీ'ని అమలులోకి తీసుకొచ్చింది.మన రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రభుత్వేతర నివాస, వాణిజ్య భవనాలకు కూల్ రూఫ్ తప్పనిసరి. 600 గజాలు, అంతకంటే ఎక్కువ స్థలంలోని నివాస భవనాలకు కూల్ రూఫ్ ఉండాల్సిందే. అంతకంటే చిన్న ఇళ్లు స్వచ్ఛందంగా స్వీకరించవచ్చు. ప్రభుత్వం భవన నిర్మాణ అనుమతి ప్రక్రియలో కూల్ రూఫ్ విధానాన్ని మిళితం చేసింది. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) జారీ చేసేందుకు సంబంధిత అధికారులు కూల్ రూఫ్‌లను నిర్ధారించుకున్నాకే ఓసీ జారీ చేస్తారు. కూల్ రూఫ్ పాలసీ అమలుతో ఐదేళ్ల తర్వాత తెలంగాణ రాష్ట్రంలో ఏటా సుమారు 12 కోట్ల యూనిట్ల విద్యుత్ ఆదా అవుతోందని ప్రభుత్వం అంచనా వేసింది.కూల్ రూఫ్ టైల్స్‌ను జిర్కోనియం సిలికేట్, జింక్ ఆక్సైడ్‌ల నానోమీటర్ల పరిమాణంలో ఉండే చిన్న కణాల మిశ్రమాలను అల్యూమీనియం సిలికెట్ కణాలతో కూడిన ప్రత్యేక గ్లేజ్‌తో తయారు చేస్తారు. వీటిని అధిక ఉష్ణోగ్రతల వద్ద కాలుస్తారు. దీంతో వీటికి సూర్యరశ్మిని గ్రహించి, ఇంట్లోకి వేడిని చేరనివ్వదు. కూల్ రూఫ్ ఏర్పాటుకు రకాన్ని బట్టి చ.అ.కు రూ.120-1,000 వరకు ఖర్చు అవుతుంది. ప్రత్యేకమైన పెయింటింగ్‌లు లేదా నిర్దిష్ట సిరామిక్ టైల్స్‌తో తయారైన కూల్ రూఫ్‌లు ఉన్నాయి.

## కర్ణాటకలో కొత్త పార్టీ ఏర్పాటు దిశగా ప్ర'యత్నాళ్'!

విజయపుర: సొంత పార్టీపైనే పదేపదే విమర్శల కారణంగా ఇటీవల భాజపా నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే, కేంద్ర మాజీ మంత్రి బసనగౌడ పాటిల్ యత్నాళ్ కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నారు. భాజపా అధిష్ఠానం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బీవై విజయేంద్రను కొనసాగిస్తూ, యడియూరప్ప వారసత్వ రాజకీయాలకు మద్దతునిస్తే.. కర్ణాటకలో కొత్త 'హిందూ పార్టీ'ని ప్రారంభించే అవకాశం ఉన్నట్లు సంకేతాలు ఇచ్చారు. తాను ఇప్పటికీ తల్లిగా భావించే భాజపాకు, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకం కాదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పార్టీ ఏ కొత్తర్పాటు ఆవశ్యకతపై తన సహచరులతో కలిసి ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నట్లు వెల్లడించారు. విజయదశమి నాటికి



పార్టీని ఉనికిలోకి తీసుకొచ్చే అవకాశం ఉన్నట్లు సంకేతాలిచ్చారు.కర్ణాటకలో 'హిందూ పార్టీ' ఏర్పాటు కోసం రాష్ట్ర వ్యాప్తంగా హిందూ కార్యకర్తల నుంచి తనకు మెసేజ్‌లు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కర్ణాటకలో భాజపాతో హిందువులు సురక్షితంగా లేరన్న బసనగౌడ.. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో పాటు ఇతర కాంగ్రెస్ నేతలతో భాజపా 'సర్దుబాటు' రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. పదే పదే పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్నారన్న అభియోగంతో బసనగౌడ పాటిల్ యత్నాళ్‌ను బుధవారం పార్టీ సభ్యత్వం నుంచి ఆరేళ్ల పాటు భాజపా బహిష్కరణ వేటు వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు.'హిందుత్వ వాదాన్ని బలంగా సమర్థించే వారు యడియూరప్ప తనయుడి స్వార్థంతో పార్టీలో అణచివేతకు గురవుతున్నారు. నేడు విజయేంద్ర, యడియూరప్ప వారసత్వ రాజకీయాలు, వారి మొండిపట్టు కారణంగా నేనూ అణచివేతకు గురయ్యా. వారసత్వ రాజకీయాలకు, అవినీతికి వ్యతిరేకమని చెబుతున్న భాజపా అధిష్ఠానానికి ఇప్పటికీ నాదో అభ్యర్థన. సర్దుబాటు రాజకీయాలు చేసే వారిని తొలగించకపోతే.. రాష్ట్ర ప్రజలు భాజపాపై విశ్వాసం కోల్పోతారు. విజేయేంద్రను మరోసారి అధ్యక్షుడిగా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం అభ్యర్థిగా కొనసాగించాలని హైకమాండ్ నిర్ణయిస్తే.. రాష్ట్ర అభివృద్ధి, నూతన భవిష్యత్తు కోసం ప్రజలు అవినీతి రహిత, నిజాయతీపరులైన వ్యక్తులతో కలిసి సనాతన ధర్మ పరిరక్షణ కోసం బలమైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వస్తుంది" అని పేర్కొంటూ విజయేంద్రపై తీవ్ర ఆరోపణలు చేశారు.

# దేశం ఆర్ధిక ప్రగతిలో దూసుకుపోతోంది

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**కరీంనగర్ బ్యూరో, మార్చి 30 (జనంసాక్షి) :**



ఈ ఏడాది దొంగతనాలు ఎక్కువైతాయని, ప్రజాప్రతినిధులు, అధికారులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడతారని, కొత్త వ్యాధి ప్రబలుతుందని జ్యోతిష్య పండితులు చెబుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తన స్వగృహంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనను గమనిస్తే జ్యోతిష్య పండితులు చెప్పేది నిజమేనన్పిస్తోందని ఏ శాఖలో చూసినా అవినీతి రాజ్యమేలుతోందన్నారు. కాంగ్రెస్ నేతలకు 'కరప్షన్ వైరస్' సోకింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ...కాంట్రాక్టుల దగ్గర నుండి పెండింగ్ బిల్లుల వరకు ప్రతి దాంట్లోనూ కమీషన్లు ఇవ్వనిదే పనిచేయడం లేదని 'కాంగ్రెస్ కరప్షన్ వైరస్' మూలంగా అన్ని వర్గాల ప్రజలు బాధలు పడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో 'పింక్ వైరస్' సోకి తెలంగాణ ప్రజలు నష్టపోయారని బీజేపీ చేసిన పోరాటాలవల్ల పింక్ వైరస్ పీడ విరిగిందని 'కాంగ్రెస్ కరప్షన్ వైరస్' బారినుండి బీజేపీ ప్రజలను కాపాడుకుంటామని పోరాటాలనే వ్యాక్సిన్ గా కాంగ్రెస్ అవినీతిపై యుద్ధం చేయబోతున్నామని తెలిపారు.

**సన్నబియ్యం పంపిణీని స్వాగతిస్తున్నాం**

ఒక్కో కిలోకు రూ.40లు మోదీ సర్కారే చెల్లిస్తోందని సన్న బియ్యంవల్ల రాష్ట్ర ప్రభుత్వంపై కిలోకు పడే భారం రూ.10 మాత్రమే అని రాష్ట్ర సర్కార్ చేసే ఖర్చు కంటే మూడు రెట్లు అదనంగా మోదీ ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. వెంటనే రేషన్ షాపులతోపాటు అంతటా ప్రధాని ఫోటోలు కూడా పెట్టాల్సిందే అని ఫోన్ ట్యాపింగ్ కేసును పూర్తిగా నీరుగారుస్తున్నారని శ్రవణ్ రావు సహా అందరికీ బెయిల్ వచ్చేలా చేసి కాంగ్రెస్సే సహకరిస్తోందని గత ఎలక్షన్ ముందు కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో వేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి యూ టర్న్ తీసుకున్నారని

కేసీఆర్ కుటుంబాన్ని కాంగ్రెస్ కాపాడుతోందని అందుకే ఏడాదిన్నరైనా అరెస్ట్ కాదు కదా.. కనీసం నోటీసులిచ్చి విచారణ కూడా చేయండం లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలూ మూడు కుమ్మక్కైనయ్ అని జీహెచ్ఎంసీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉంటూ మజ్లిస్ ను గెలిపించేందుకు సిద్ధమైనయ్ అని మరి కొద్దిరోజుల్లో ఆ 3 పార్టీల అసలు రంగు బయటపడ బోతోందని బీఆర్ఎస్ కు అత్యధిక మంది కార్పొరేటర్లున్నా ఎందుకు పోటీ చేయడం లేదని, జీహెచ్ఎంసీలో బీజేపీకి సరిపడా బలం లేకపోయినా లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నామన్నారు. ఆర్ఎస్ఎస్ దేశభక్తి కలిగిన పార్టీ అని ఈ దేశ ధర్మం, సనాతన ధర్మం, హిందూ సమాజ సంఘటితం చేసేందుకు నిరంతరం క్రుషి చేస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న సంస్థ ఆర్ఎస్ఎస్ అని ఒవైసీ ఆసుపత్రిలో ఉగ్రవాదులు దొరికారని, దారుస్సలాం టెర్రరిస్టులకు అడ్డాగా మారిందని, ఆర్ఎస్ఎస్ ఆఫీసులో దేశభక్తిపరులుంటారని తెలిపారు. మజ్లిస్ కు తెలంగాణ అంతటా పోటీ చేసే దమ్మే లేదని, అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి అమ్ముడుపోయే పార్టీ మజ్లిస్ అని, ఒవైసీ కుటుంబ వ్యాపారాలను కాపాడుకునేందుకు ఏ పార్టీకైనా కొమ్ముకాసే తత్వం మజ్లిస్ దన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు దమ్ముంటే జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థులను నిలబెట్టి వేర్వురుగా పోటీ చేయాలని లేనిపక్షంలో ప్రజలు ఆ పార్టీలకు గుణ పాఠం చెప్పడం తథ్యం అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.

# ఉగాది అందరికీ శుభాలను తీసుకురావాలి



## కలెక్టరేట్లో నూతన సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 30 (జనం సాక్షి)**

కామారెడ్డి జిల్లా టీఎన్జీవోస్, టీజీవో సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము నందు నూతన సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం వినిపించారు. తెలుగువారి నూతన సంవత్సరం అయినటువంటి శ్రీ విశ్వావసు నామ ఉగాది సంవత్సరమును పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా టీఎన్జీవోస్ మరియు టీజీవో సంఘాల ఆధ్వర్యంలో జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ నరాల వెంకట్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ముఖ్య అతిథులుగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము నందు వేద పండితులు ఆంజనేయ శర్మ మరియు వారి శిష్య బృందం చే శ్రీ విశ్వావసు నామ నూతన ఉగాది వేడుకలు మరియు శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణ కార్యక్రమం ఘనంగా జరిగినది.. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం లో రాష్టం మరియు కామారెడ్డి జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని చిన్న పాటి ఒడిదొడుకులు ఉన్న పాలనాపరమైన ముందు చూపుతో సమస్యలు తొలగుతాయని నతెలిపారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ శ్రీ విశ్వావసు నామ సంవత్సరం అందరికీ శుభాలను తీసుకురావాలని తెలుపుతూ జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ, మహిళా పండితుల పంచాంగ శ్రవణం ప్రశంసిస్తూ, ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన టిఎన్జీవోస్ మరియు టీజీఓ సంఘాలను అభినందిం చారు. పండితులు ఆంజనేయ శర్మ మాట్లాడుతూ కలక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు జరుపుకోవటం ఆనందంగా ఉందని,మహిళా పండితులతో పంచగా శ్రవణం మొట్టమొదటి సారిగా మన కామారెడ్డి లో జరిగినదని తెలియజేసా రు. పంచాంగ శ్రవణం అనంతరం ఉగాది పచ్చడి వితరణ చేయడం జరిగిన ది. జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ నరాల వెంకట్ రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దేవేందర్, సాయి రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి ఎం నాగరాజు, సహధ్యక్షులు ఎం చక్రధర్, కోశాధికారి ఎం దేవరాజు, ఉపాధ్యక్షులు లక్ష్మణ్,జాయింట్ సెక్రెటరీ గణేష్ మరియు కార్యవర్గ సభ్యులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

# బెజ్జంకికి వ్యవసాయ కళాశాల మంజూరు

## ఉగాది వేళ మరో తీపి కబురు

## మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి వెల్లడి

**కరీంనగర్ బ్యూరో, మార్చి 30(జనంసాక్షి) :**



బెజ్జంకి మండలానికి వ్యవసాయ కళాశాల మంజూరయిందని మానకొండూర్ శాసనస భ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఉగాది పండగ సందర్భంగా మానకొండూరు మండలం కొండపలకల గ్రామంలోని శ్రీ కోదండ రామాలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆల యం వెలుపల ఆయన మీడియాతో మాట్లా డుతూ... ఈ విషయం వెల్లడించారు. ఇప్ప టికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను మానకొండూర్ కు మంజూరు చేయించుకోగా, ఇప్పుడు వ్యవసా య కళాశాల మంజూరైనట్టు ఎమ్మెల్యే వివరించారు. దసరా పండగ రోజున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయగా, వ్యవసాయ కళాశాల మంజూరైనట్టుగా తీపి కబురును ఉగాది రోజున ప్రజలకు అందిస్తున్నామన్నారు. బెజ్జంకిలో వ్యవసాయ కళాశాల ఏర్పాటుతో మానకొండూర్ నియోజకవర్గం అభివృద్ధిలో మరో ముంద డుగు అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం జగిత్యాల జిల్లా కోరుట్లలో నిర్వహిస్తున్న ఈ వ్యవసాయ కళాశాలను మానకొండూరు నియోజకవర్గంలోని బెజ్జంకి మండలానికి మార్చాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగానే ఈనెల 28న రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పల్లి సత్యనారాయణ తెలిపారు. ఈ ఉత్తర్వుల నేపథ్యంలో బెజ్జంకి మండలంలో పూర్తి స్థాయిలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర అవసరాలతో ప్రభుత్వానికి సమగ్ర ప్రతిపాదనను పంపాలని ఆ ఉత్తర్వులో ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆదేశించారాణి తెలిపారు. బెజ్జంకి మండలానికి వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించడం పై మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ కళాశాలను మంజూరు చేసిన సీఎంకు, సహకరించిన మంత్రులకు ప్రభుత్వ ఉన్నత అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన యువ వికాస పథకాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. కళ్యాణ లక్ష్మి , ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం కింద మంజూరైన చెక్కుల ను కొండపలకల గ్రామానికి చెందిన లబ్ధి దారులకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు.

# సాలెహ్ నగర్ ఈద్గా వద్ద ఏర్పాట్లు



**కరీంనగర్, కొత్తపల్లి (జనంసాక్షి)**

కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం సాలెహ్ నగర్ ఈద్గా వద్ద నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, మున్సిపల్ ఈఈ శ్రీనివాస్ లతో కలిసి, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్, ఈద్గా ముతవల్లి షేక్ అబూ బకర్ ఖాలీద్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం పార్టీకి చెందిన పలువురు మాజీ కార్పొరేటర్లతో కలిసి పవిత్ర రమజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఈద్ నమాజ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈద్-ఉల్-ఫితర్ రమజాన్ నమాజ్ ఆచరించేందుకు సుమారు 25వేల మంది పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు తరలిరానున్న నేపథ్యంలో ప్రభుత్వపరంగా చేస్తున్న ఏర్పాట్లు, వసతులు అందరికీ సౌకర్యవంతంగా ఉండాలని, గులాం అహ్మద్ హుస్సేన్, ముతవల్లి షేక్ అబూ బకర్ ఖాలీద్, అబ్బాస్ సమీలు మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. నగరంలోని ఆరుచోట్ల ఈద్గాల వద్ద ఎంఐఎం పార్టీ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వపరంగా ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయని గులాం అహ్మద్ పేర్కొన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందువల్ల అధికారులు నమాజ్ ఆచరించేందుకు వచ్చే వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లను చేయాలని, షామియానా లతోపాటు త్రాగునీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ప్రత్యేకంగా ఆర్టిసి వర్క్ షాప్ వరకు సౌండ్ సిస్టం వినిపించేలా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీ ఆతిన,

ఖమరుద్దీన్, నాయకులు అబ్దుల్లా ఖాన్, యునూస్, ఎస్సార్ డెకోరేటర్స్ యజమానులు రిజ్వాన్, షాకిర్, మున్సిపల్ అధికారులు లచ్చిరెడ్డి, సల్మాన్, ఖాలీద్, బీఆర్ఎస్ నాయకులు మాజిద్ పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లా ఒగ్గుడోలు ప్రదర్శన

## వేడుకలకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

**బొంరాస్ పేట,మార్చి 30(జనం సాక్షి):**





వికారాబాద్ జిల్లా బొంరాస్ పేట మండలం నాందార్ పూర్ గ్రామానికి చెందిన శ్రీ మల్లికార్జున ఒగ్గు కళా సేవా సమితి,ఒగ్గు బీరప్ప కళాబృందం ఆదివారం రవీంద్ర భారతి వేదికగా నిర్వహించిన శ్రీ విశ్వావసు నామ ఉగాది-2025 ఉత్సవాల్లో పాల్గొని అద్భుతమైన ప్రదర్శనను నిర్వహించి అబ్బుర పరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒగ్గు కళాకారుల బృందం ప్రదర్శనతో స్వాగతం పలికింది.అనంతరం కళాబృందం సభ్యులు ఒగ్గుడోలు ప్రదర్శన విన్యాసాలు నిర్వహించారు. ప్రదర్శనను తిలకించిన ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు ఒగ్గు కళాబృందాన్ని అభినందించారు.ఉగాది నూతన సంవత్సరం పర్వదినం సందర్భంగా రవీంద్రభారతిలో నిర్వహించిన వేడుకల్లో ఒగ్గుడోలు ప్రదర్శన నిర్వహించేందుకు అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ హరికృష్ణకు ఒగ్గు కళాకారుల బృందం సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# అయాన్ తాజ్ కు అవార్డు


**బెల్లంపల్లి, మార్చి 30, (జనంసాక్షి)**



2025 ఉగాది ఉత్సవాలో బెల్లంపల్లి పట్టణానికి చెందిన లిటిల్ స్టార్ అయాన్ తాజ్ ను అవార్డు వరించింది. తెలంగాణ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శిఖరఆర్ట్స్ ఆధ్వర్యంలోనిర్వహించిన విశ్వవసు నామ సంవత్సరం ఉగాది ఉత్సవంలో భాగంగా అయాన్ తాజ్ కు అవార్డు అందించి సత్కరించారు. అయాన్ తాజ్ జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో ఎన్నో అవార్డులు అందుకుంటూ, తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పర్చుకున్న అయాన్ తాజ్ కు కార్యక్రమ నిర్వాహకులు తెలంగాణ దుందాం వ్యస్థాపక అధ్యక్షులు అంతడపుల నాగరాజు, క్రెజీ స్టార్ డాన్స్ అకాడమీ మాస్టర్ ఊపులేటి నరేష్, మందమర్రి టెక్నో డాన్స్ మాస్టర్ రాకం సంతోష్, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా ప్రత్యేకమైన అవార్డును అందజేసి సన్మానించారు.

# గడువు ముగిసింది.. స్పందన కరువైంది

**హైదరాబాద్ (జనం సాక్షి)**



: ఎల్ఆర్ఎస్కు స్పందన కరవైంది. గడువు ముగుస్తున్న లక్ష్యం మాత్రం నేరవేరేలాలేదు. ప్రభుత్వ భూముల్లో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు ఆశించిన మేరకు స్పందన రాలేదు. దీనికి అధికారుల నిర్ల్యక్షం వల్లే దరఖాస్తుదారులలో అవగాహన లేక ఇలా జరిగిందన అరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఆదాయం వచ్చే అవకాశం లేకుండా పోయింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో పాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమైనట్లు తెలుస్తోంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఎల్ఆర్ఎస్ రాయితీకి 30 శాతానికి మాత్రమే పరిమితమైంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 1.63 లక్షల దరఖాస్తులు రాగా ఇందులో 31వేల మంది దరఖాస్తుదారులు మాత్రమే క్రమబద్ధీకరణకు ఫీజు చెల్లించారు. అంటే 30 శాతం మాత్రమే ఎల్ఆర్ఎస్ను సద్వినియోగం చేసుకున్నారు. సుమారు లక్షకు పైగా దరఖాస్తుదారులకు క్రమబద్ధీకరణ చేసుకోవాలని సూచించిన ముందుకు రాలేకపోవడంలో అధికారుల నిర్లక్ష్యంగా కనపడుతుంది. ప్లాట్ల క్రమబద్ధీకరణకు 25 శాతం రాయితీ చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలన్నా దరఖాస్తుదారులు ముందుకురాలేకపోయారు. ఈ నెల 31 రాయితీ గడువు ముగుస్తున్న క్రమబద్ధీకరణకు సుమారు 78 వేల మంది ఫీజులు చెల్లించాల్సి ఉంది. అయితే గడువు ముగిస్తే వీరి పరిస్థితి ఎమిటన్నది ప్రశ్నార్థకరంగా మారింది. అయితే తిరిగి క్రమబద్ధీకరించుకునేందుకు రాయితీ ద్వారా ఫీజులు చెల్లించే అవకాశం కల్పిస్తుందా లేకా రాయితీ కొనసాగించి గడువు పెంచే అవకాశం ఉంటుదా అన్నది వేచి చూడాల్సిందే. కాగా కొందరి దరఖాస్తుదారుల వద్ద సమయానికి ఫీజులు చెల్లించేందుకు చేతిలో డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డట్లు దరఖాస్తుదారులు తెలిపారు.

# స్వర్గ్ వాటికలో ఎస్వీ ధార్మిక ఆరోగ్య కేంద్రం



## రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు, గో క్యాస్ట్ తయారీ కేంద్రం కూడా..

**హైదరాబాద్, మార్చి 30 (జనంసాక్షి)**

పర్యావరణహిత అంత్యక్రియలకు సికింద్రాబాద్ తిరుమలగిరిలోని ఆర్టీసీ కాలనీ వద్ద ఉన్న స్వర్గ్ వాటిక ఎంతో ప్రసిద్ధి చెందినది. ఈ స్వర్గ్ వాటికలో పలు విభాగాలను ఈరోజు నూతనంగా ప్రారంభించారు. జాతీయ కోవిడ్ యోధుడు పద్మశ్రీ జితేందర్ సింగ్ షుంటి ఎస్వీ ధార్మిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్ శ్రీ గణేష్ రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు, కొత్త ఎల్పీజీ ఆధారిత దహన ఘాట్‌ను, కంటోన్మెంట్ బోర్డ్ సీఈవో మధుకర్ నాయక్ గో క్యాస్ట్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వర్గ్ వాటిక వ్యవస్థాపక ట్రస్టీ, అధ్యక్షుడు సురేందర్ పాల్ సింగ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ సహకారంతో స్వర్గ్ వాటిక ట్రస్ట్ పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ముందుకు వెళ్తుందన్నారు. ఈ ఆరోగ్య కేంద్రం డయాగ్నోస్టిక్, డెంటల్, ఫిజియోథెరపీ, ఈఎన్‌టీ సేవలు, జనరల్ మెడిసిన్ అందిస్తుందన్నారు. మార్కెట్ ధర కంటే 30 శాతం తక్కువకు లభించునన్నారు. దీని ద్వారా మధ్య తరగతి, పేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. రూఫ్‌టాప్ సోలార్ పవర్ ప్లాంట్లు పూర్తిగా పర్యావరణహితమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నాయని చెప్పారు. దహన వాటిక అవసరాలను వంద శాతం గ్రీన్ ఎనర్జీతో తీర్చనున్నాయన్నారు. గో క్యాస్ట్ తయారీ కేంద్రం పర్యావరణ అనుకూల దహన మార్గాలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్ రియల్ టైం అప్డేట్లు అందించడంతో పాటు డిజిటల్ మెమోరియల్స్ సృష్టించుకునే అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. కొత్త ఎల్పీజీ ఆధారిత దహన ఘాట్ పర్యావరణ హిత దహన విధానానికి అనుకూలంగా ఉంటుందన్నారు. స్వర్గ్ వాటికలోని సుందరమైన వాతావరణం సందర్శకులు, శోకతప్త కుటుంబాలకు ప్రశాంతమైన, పర్యావరణ అనుకూల పరిసరాలను అందిస్తుందన్నారు. ఇక్కడ గో క్యాస్ట్ ను వినియోగిస్తున్నామని చెప్పారు. సంప్రదాయంగా ఒక శవాన్ని దహనం చేయడానికి రెండు వృక్షాలు అవసరం అవుతాయన్నారు. అయితే, గో క్యాస్ట్ ద్వారా కలప వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ఇది పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. రెండు కొత్త ఏసీ హియర్స్ వ్యాన్లు, బాడీ ఫ్రీజర్ బాక్సులను అందుబాటులోకి తెచ్చామన్నారు. శవ భస్మాలను భద్రపరచడానికి లాకర్లు ఏర్పాటు చేశామన్నారు.



## ఈ వయసులో క్రికెట్ ఆడాల్సింది కాదు

టీమిండియా మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ ఎడమ కాలికి ఇటీవల గాయమైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కోలుకుంటున్నాడు. తాజాగా తన గాయంపై సరదాగా స్పందించాడు. తాను ఈ వయసులో క్రికెట్ ఆడాల్సింది కాదంటూ నవ్వులు పూయించాడు. "గాయం నుంచి నేను కోలుకుంటున్నాను. ఈ సమయంలో నాకు ఎంతో మంది మద్దతుగా నిలిచారు. కానీ, ఈ వయసులో నేను క్రికెట్ ఆడాల్సింది కాదు. అయినా, ఫర్వాలేదు. ప్రస్తుతం నేను బాగానే ఉన్నా" అని రాహుల్ అన్నాడు. కాగా.. ఐపీఎల్లో రాజస్థాన్ రాయల్స్ ప్రధాన కోచ్ రాహుల్ వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల జట్టు ట్రైనింగ్ సెషన్లకు ఊతకర్రల సాయంతో ద్రావిడ్ హాజరైన దృశ్యాలు నెట్టింట వైరల్ గా మారాయి. అతడి నిబద్ధతపై నెటిజన్లు ప్రశంసలు కురిపించారు.

ఇదిలా ఉండగా.. నేటి (ఆదివారం) సాయంత్రం రాజస్థాన్ రాయల్స్- చెన్నై సూపర్ కింగ్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో మ్యాచ్కు ముందు మీడియాతో మాట్లాడుతూ.. తన కాలి గాయంపై ఎదురైన ప్రశ్నకు ద్రావిడ్ ఇలా స్పందించాడు.

# ఢిల్లీ జీత్‌గయా..

## సన్‌రైజర్స్‌ను చిత్తు చేసిన ఢిల్లీ క్యాపిటల్స్

- దూప్లెసిస్, అభిషేక్ మెరుపులు ..
- 7 వికెట్ల తేడాతో ఢిల్లీ ఘన విజయం
- సన్‌రైజర్స్‌కు వరుసగా రెండో ఓటమి
- అనికేత్ ఒంటరి పోరాటం



2025లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ 18.4 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌటైంది. ఈ టార్గెట్‌ను ఢిల్లీ 16 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ ఫాప్ డుప్లెసిస్ (50, 27 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి అర్ధ శతకం బాదేయగా.. మరో ఓపెనర్ జేక్ ఫ్రేజర్ (38, 32 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. కేఎల్ రాహుల్ (15, 5 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. అభిషేక్ పొరెల్ (34, 18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సు), ట్రిస్టన్ స్టబ్స్ (21లి: 14 బంతుల్లో 3 ఫోర్లు) మెరిశారు. హైదరాబాద్ బౌలర్లలో జీషాన్ అన్సారీ మూడు వికెట్లు పడగొట్టాడు.

లక్ష్యఛేదనలో దిల్లీ ఆరంభంలో నెమ్మదిగా ఆడి క్రమంగా దూకుడు పెంచింది. షమి వేసిన మూడో ఓవర్‌లో 15 రన్స్ రాగా.. డుప్లెసిస్ వరుసగా సిక్స్, ఫోర్ బాదాడు. అనంతరం డుప్లెసిస్, ఫ్రేజర్ నిలకడగా బౌండరీలు సాధించడంతో పవర్ ప్లే ముగిసేసరికి దిల్లీ 52/0తో పటిష్టస్థితిలో నిలిచింది. కమిన్స్ వేసిన ఏడో ఓవర్లో డుప్లెసిస్ వరుసగా ఫోర్, సిక్స్ కొట్టాడు. జీషాన్ అన్సారీ ఒకే ఓవర్లో ఓపెనర్లిద్దరినీ పెవిలియన్‌కు పంపాడు. జీషాన్ వేసిన 10 ఓవర్లో తొలి బంతికి డుప్లెసిస్.. ముల్డర్కు క్యాచ్ ఇచ్చాడు. తర్వాత అదే ఓవర్లో వరుసగా 4,4,6 బాదేసిన ఫ్రేజర్ చివరి బంతికి బౌలర్కే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అప్పటికే ఢిల్లీ 100 పరుగులకే చేరువైంది. అనంతరం క్రీజులోకి వచ్చిన కేఎల్ రాహుల్.. షమి బౌలింగ్లో వరుసగా 4,6,4 కొట్టాడు. దూకుడుగా ఆడుతున్న రాహుల్ని జీషాన్ క్లీన్ బౌల్డ్ చేశాడు. అభిషేక్ పొరెల్, స్టబ్స్ దూకుడుగా ఆడి జట్టుకు భారీ విజయాన్ని అందించారు.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ ఆరంభంలో వరుస షాక్ లు తగిలాయి. అభిషేక్ శర్మ (1), ఇషాన్ కిషన్ (2), నితీశ్ రెడ్డి (0), ట్రావిస్ హెడ్ (22) నిరాశపర్చారు. దీంతో హైదరాబాద్ 37 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో అనికేత్ వర్మ (74, 41 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో ఆదుకున్నాడు. హెన్రిచ్ క్లాసెన్ (32, 19 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్ లు) పరుగులు చేశాడు. దిల్లీ బౌలర్లలో మిచెల్ స్టార్క్ (5/35) ఆకట్టుకున్నాడు. కుల్దీప్ యాదవ్ 3, మోహిత్ శర్మ ఒక వికెట్ పడగొట్టారు.

తొలి మ్యాచ్‌లో 286 రన్స్ కొట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ తడబడింది. ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ మిచెల్ స్టార్క్ ధాటికి(5-35) టాపార్డర్ వైఫల్యంతో 163 పరుగులకే ఆలౌటైంది. దంచికొట్టే అలవాటున్న ట్రావిస్ హెడ్(22), అభిషేన్ శర్మ(0), ఇషాన్ కిషన్(2)లు మళ్లీ నిరాశపరిచారు. 37 పరుగులకే 4 వికెట్లు పడడంతో ఆరెంజ్ ఆర్మీ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో 23 ఏళ్ల అనికేత్ వర్మ(74, 41 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సర్లు) ఖతర్నాక్ ఇన్నింగ్స్ ఆడాడు. క్రీజులో పాతుకుపోయిన అతడు భారీ సిక్సర్లతో ఢిల్లీ బౌలర్లను బెంబేలెత్తించాడు. కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, మోహిత్ శర్మ.. ఎవరినీ వదలకుండా ఉతికేశాడు. కుల్దీప్ బౌలింగ్‌లో సింగిల్ తీసి ఐపీఎల్‌లో తొలి ఫిఫ్టీ నమోదు చేసిన అనికేత్ ఆ తర్వాత మరింత దూకుడుగా ఆడాడు.

### ఎవరీ అనికేత్ వర్మ

ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ వంటి హార్డ్ హిట్టర్లు ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్ నుంచి మరోకొత్త హీరో పుట్టుకొచ్చాడు. అనుభవజ్ఞులైన ఆ స్టార్లు విఫలమైన చోట ఓ కుర్ర బ్యాటర్ మెరిశాడు. విశాఖపట్నంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటింగ్ ముగిసింది. 37 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన ఎస్ఆర్‌హెచ్‌ను ఓ కుర్ర బ్యాటర్ ఆదుకున్నాడు. భారీ సిక్సులతో హడలెత్తించాడు. 41 బంతుల్లో 74 పరుగులు చేశాడు. ఆ కుర్ర బ్యాటర్ పేరు అనికేత్ వర్మ. ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీకి చెందిన అనికేత్ తన కెరీర్‌లో ఎక్కువ మ్యాచ్‌లు మధ్యప్రదేశ్ తరఫున ఆడాడు. మధ్యప్రదేశ్ ప్రీమియర్ లీగ్‌లో అద్భుతంగా ఆడి అందరి దృష్టినీ ఆకర్షించాడు. భోపాల్ లియోపోర్డ్స్ తరఫున ఆరు మ్యాచ్‌ల్లో 273 పరుగులు చేశాడు. ఒక మ్యాచ్‌లో 41 బంతుల్లో ఏకంగా 123 పరుగులు చేశాడు. దీంతో ఐపీఎల్ ఫ్రాంఛైజీల దృష్టి అనికేత్‌పై పడింది. అనికేత్‌ను ఎస్ఆర్‌హెచ్ రూ.30 లక్షలు పెట్టి కొనుగోలు చేసింది. అవకాశం వచ్చినప్పుడు చెలరేగి తన సత్తా చాటాడు.


తాజా మ్యాచ్‌లో 41 బంతులు ఆడిన అనికేత్ 5 ఫోర్లు, 6 సిక్సులతో 74 పరుగులు చేశాడు. 180 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన అనికేత్.. అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ లాంటి టాప్ బౌలర్లను కూడా వదిలిపెట్టలేదు. బౌండరీలు బాదడం మాత్రమే కాకుండా స్ట్రైక్ రొటేట్ చేస్తూ అనుభవజ్ఞుడైన బ్యాటర్‌లా ఇన్నింగ్స్‌ను నడిపించాడు. లేకపోతే హైదరాబాద్ టీమ్‌కు ఆ మాత్రం స్కోరు కూడా వచ్చేది కాదేమో.



అక్షర్ పటేలో వేసిన 15వ ఓవర్లో రెచ్చిపోయిన ఈ యంగ్‌స్టర్ 4, 6, 6 బాదాడు. స్టార్ ఆటగాళ్లు చేతులెత్తేసిన చోట తనదైన శైలిలో బౌండరీలతో చెలరేగిన అతడు హెన్రిచ్ క్లాసెన్(32)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. మోహిత్ శర్మ ఓవర్లో క్లాసెన్ ఔటయ్యాక అనికేత్‌కు డికి సహకారం అందించేవాళ్లు కరవయ్యారు. కుల్దీప్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడిన కెప్టెన్ ప్యాట్ కమిన్స్(1) బౌండరీ లైన్ వద్ద ఫ్రేజర్ చేతికి చిక్కాడు. దాంతో, 123 వద్ద ఆరెంజ్ ఆర్మీ ఏడో వికెట్ పడింది. ఆ కాసేపటికే బౌండరీ లైన్‌వద్ద ఫ్రేజర్ గాల్లోకి ఎగిరి క్యాచ్ పట్టడంతో అనికేత్ వెనుదిరిగాడు.. ఇక టెయిలెండర్లను ఔట్ చేసిన స్టార్క్ ఈ సీజన్‌లో తొలిసారి ఐదు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు.

# పరుగులు చేయడు.. వికెట్లూ తీయడు..

### చెన్నై సూపర్ కింగ్స్ మరో కీలక పోరుకు



సన్నద్ధమవుతోంది. గువాహటి వేదికగా రాజస్థాన్ రాయల్స్ తలపడనుంది. సొంత మైదానంలో బెంగళూరుతో ఓడిన సీఎస్కేకు ఈ మ్యాచ్ అత్యంత కీలకం. మరోవైపు రాజస్థాన్ సన్రైజర్స్, కోల్కతా చేతిలో ఓటములను ఎదు ర్కొంది. దీంతో ఈ మ్యాచ్ ఫలితంపై ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో సీఎస్కే తుది జట్టుపై మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా కీలక సూచనలు చేశాడు. గత రెండు మ్యాచుల్లో కనీసం ప్రభావం చూపించని సామ్ కరనను కొనసాగించడం అనవసరమని వ్యాఖ్యానించాడు. బ్యాటింగ్, బౌలింగ్లోనూ రాణించక పోతే ఆల్రౌండర్ పాత్ర ఎలా పోషిస్తాడని ప్రశ్నించాడు.

"ఫైనల్ విషయంలో సీఎస్కే జాగ్రత్తలు తీసుకోవాలి. సామ్ కర్రన్పై నమ్మకం ఉంచుతున్నారు. కానీ, అతడు మాత్రం దారుణంగా ఆడుతున్నాడు. ఆల్రౌండర్ పాత్రకు న్యాయం చేయడంలేదు. బ్యాటింగ్లో విఫలమైతే.. బౌలింగ్లోనైనా ప్రభావం చూపించాలి. రెండింట్లోనూ ప్రదర్శన చేయకపోతే ఇంకెందుకు? అందుకే, అతడిని పక్కన పెట్టాలి. డేవన్ కాన్వే, రచిన్ రవీంద్రను జట్టులో ఉంచాలి. వారితోపాటు రుతురాజ్ గైక్వాడ్ ఉంటే టాప్ -3 బలంగా మారుతుంది. దీపక్ హుడా- రాహుల్ త్రిపాఠిలో ఒకరిని మాత్రమే ఆడించాలి. శివమ్ దూబెను ఐదో ప్లేస్లో దింపాలి. తొలుత బ్యాటింగ్ చేసేటప్పుడైతే విజయ్ శంకరన్న ఆరో స్థానంలో ఆడించాలి. రవీంద్ర జడేజా 7, ఎంఎస్ ధోనీ 8వ ప్లేస్లో వస్తారు" అని చోప్రా పేర్కొన్నాడు.

**జోఫ్రా బదులు ఫరూఖిని ఆడిస్తే..**

"రాజస్థాన్ జట్టుకు బౌలింగ్ సమస్యగా మారింది. స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ ఏడు ఓవర్లలోనే వందకు పైగా పరుగులు సమర్పించాడు. అతడికి బదులు ఫజల్ ఫరూఖిని ఆడిస్తే ఫలితం మారే అవకాశం లేకపోలేదు. ఇప్పుడు చెన్నైతో మ్యాచ్లో పిచ్ను ఫ్లాట్గానే సిద్ధం చేసుకోవడం ఉత్తమం. లేకపోతే స్పిన్ పిచ్ వెళ్తే రాజస్థాన్ బోల్తా పడే అవకాశం ఉంది" అని చోప్రా తెలిపాడు.

# జరిమానా పడింది..

### ఐపీఎల్ 2025 సీజన్‌లో తొలి కెప్టెన్‌గా హార్దిక్!



ఐపీఎల్ 2025 సీజన్‌లో ముంబయి ఇండియన్స్‌కు ఏదీ కలిసిరావడం లేదు. ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన ముంబయి గత ఎడిషన్‌లో లీగ్ స్టేజ్‌కే పరిమితమైంది. ఇప్పుడు కూడా అదే బాటలో పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. 18వ సీజన్‌లో వరుసగా రెండు పరాజయాలను ఎదుర్కొంది. మొదటి మ్యాచ్‌కు దూరమైన హార్దిక్ పాండ్య.. గుజరాత్ పోరుకు నాయకత్వం వహించాడు. గత సీజన్లో స్లో ఓవర్ రేట్ కారణంగా ఒక మ్యాచ్ నిషేధం ఎదుర్కోవాల్సి వచ్చింది. దాంతో సీఎస్కేతో పాండ్య బరిలోకి దిగలేదు. ఇప్పుడు గుజరాత్తో మ్యాచ్లోనూ పాండ్యపై జరిమానా పడింది. మళ్లీ స్లో ఓవర్ రేట్ కారణంగా పాండ్యకు రూ.12 లక్షలు ఫైన్ విధిస్తూ ఐపీఎల్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఎడిషన్లో ఇలాంటి జరిమానా ఎదుర్కొన్న తొలి కెప్టెన్గా పాండ్య నిలిచాడు.

"ఈ సీజన్‌లో ముంబయి ఇండియన్స్ తొలి తప్పిదం కాబట్టి.. ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఆర్టికల్ 2.2 ప్రకారం స్లో ఓవర్ రేట్ కారణంగా పాండ్యకు రూ.12 లక్షల జరిమానా విధించాం" అని ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ ప్రకటనలో తెలిపింది. కొత్త ఐపీఎల్ నిబంధనల ప్రకారం.. స్లో ఓవర్ రేటు పాల్పడినప్పటికీ ఆ జట్టు సారథిపై వేటు పడదు. అతడికి జరిమానా విధించడంతోపాటు డిమెరిట్, సస్పెన్షన్ పాయింట్లను కేటాయిస్తారు. ఇవి 36 నెలలపాటు కొనసాగుతాయి.



# ఆస్ట్రేలియాతో వైట్‌బాల్ సిరీస్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18 సీజన్ ముగిశాక భారత జట్టు కీలకమైన సిరీస్‌లు ఆడనుంది. జూన్‌లో ఇంగ్లండ్ టూర్.. అది పూర్తయ్యాక ఆస్ట్రేలియా పర్యటనకు టీమిండియా వెళ్లనుంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆదివారం ఆసీస్ టూర్ షెడ్యూల్ విడుదల చేసింది. కంగారు గడ్డపై రోహిత్ సేన మూడు వన్డేలు ఆడనుంది. అనంతరం సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత్, ఆతిథ్య జట్టు మధ్య 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరగనుంది. వన్డే సిరీస్‌తో ఆస్ట్రేలియా పర్యటనను భారత జట్టు ఆరంభించనుంది. అక్టోబర్ 19 నుంచి 25 వరకు 50 ఓవర్ల ఫార్మాట్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఈ మూడింటికి పెర్త్, అడిలైడ్, సిడ్నీ వేదిక కానున్నాయి. ఇక ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ అక్టోబర్ 29 నుంచి నవంబర్ 8 వరకు నిర్వహించనున్నారు. నిరుడు ఆస్ట్రేలియా పర్యటనలో చిత్తుగా ఓడిన భారత్ 3-1తో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని చేజార్చుకుంది. వన్డే, టీ20 సిరీస్ గెలుపొంది ఆ ఓటమికి బదులు తీర్చుకోవాలని టీమిండియా భావిస్తోంది.



వన్డే సిరీస్.. మొదటి వన్డే అక్టోబర్ 19న - పెర్త్.
రెండో వన్డే, అక్టోబర్ 23న - అడిలైడ్ ఓవల్.
మూడో వన్డే, అక్టోబర్ 25న - సిడ్నీ.
టీ20, మొదటి టీ20, అక్టోబర్ 29న - మనుకా ఓవల్.
రెండో టీ20, అక్టోబర్ 31న - మెల్‌బోర్న్.
మూడో టీ20, నవంబర్ 2న - బెల్లలెరివె ఓవల్.
నాలుగో టీ20, నవంబర్ 6న - గోల్డ్ కోస్ట్ స్టేడియం.
ఐదో టీ20, నవంబర్ 8న - గబ్బా.

# దంచికొట్టిన నితీశ్ రాణా..



గువాహటి: ఐపీఎల్ 2025లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరుగుతున్న మ్యాచ్లో రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్ ముగిసింది. ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. వన్‌డౌన్ బ్యాటర్ నితీశ్ రాణా (81బీ 36 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్సు) భారీ ఇన్నింగ్స్ ఆడాడు. రియాన్ పరాగ్ (37), సంజు శాంసన్ (20), హెట్మయర్ (19) పరుగులు చేశారు. యశస్వి జైస్వాల్ (4), ధ్రువ్ జురెల్ (3), వానిందు హసరంగ (4) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు.

21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ, ఖలీల్ అహ్మద్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లో మొదటి బంతికే బౌండరీ బాది ఊపు మీద కనిపించిన జైస్వాల్.. అదే ఓవర్ లో మూడో బంతికి అశ్విన్కు చిక్కాడు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన నితీశ్ ఆరంభం నుంచే ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఖలీల్ బౌలింగ్ ఫోర్తో ఖాతా తెరిచిన నితీశ్.. ఓవర్టన్, అశ్విన్ను లక్ష్యంగా చేసుకుని చెలరేగాడు. ఓవర్టన్ వేసిన తొలి రెండు ఓవర్లలో మూడు ఫోర్లు, ఒక సిక్స్ బాదాడు. అశ్విన్ వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో వరుసగా 6,6,4 బాదేశాడు. ఖలీల్ వేసిన ఆరో ఓవర్ లో రెండు బౌండరీలు, ఓ సిక్స్ రాబట్టాడు. ఈ క్రమంలో 21 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. నిలకడగా ఆడుతున్న శాంసన్ను నూర్ అహ్మద్ వెనక్కి పంపాడు. అనంతరం కూడా నితీశ్ జోరు కొనసాగించాడు. పతిరన బౌలింగ్లో సిక్స్ అశ్విన్ వేసిన 12 ఓవర్లో వరుసగా సిక్స్, ఫోర్ బాదేసి సెంచరీ చేసేలా కనిపించాడు. కానీ, నెక్ట్స్ బాల కు భారీ షాట్ ఆడేందుకు ముందుకు వచ్చి స్టంపౌట్ అయ్యాడు. తర్వాత వచ్చిన జురెల్.. నూర్ అహ్మద్ బౌలింగ్లో పతిరనకు క్యాచ్ ఇచ్చాడు. హసరంగను జడేజా పెవిలియను పంపాడు. మరోవైపు, రియాన్ పరాగ్ నిలకడగా బౌండరీలు రాబట్టాడు. 18వ ఓవర్లో పరాగ్ను పతిరన సూపర్ యార్కర్తో క్లీన్ బౌల్డ్ చేశాడు. జోఫ్రా ఆర్చర్ (1)ను ఖలీల్ అహ్మద్ ఔట్ చేశాడు. కుమార్ కార్తికేయ (1) రనౌట్ అయ్యాడు. చివరి ఓవర్ లో హెట్మయర్ని పతిరన వెనక్కి పంపాడు.



# మండలం ఘనంగా ఉగాది వేడుకలు

**మర్పల్లి మార్చి 30 (జనంసాక్షి):** మర్పల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో ఆది వారం ఉగాది పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో దేవాలయాలు ఉగాది పండుగ వేళ భక్తులతో కిటకిటలాడాలి. మండలంలోని ప్రధాన ఆలయాలలో విశ్వావసు పంచాంగ శ్రవంతిని పూజా కార్యక్రమం నిర్వహించచారు. మండల కేంద్రంలో శ్రీ హనుమాన్ దేవాలయం వద్ద పంచాంగ శ్రవంతిని నీర్వహించి గ్రామ పెద్దల రాశి ఫలితాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వ్యవస్థాపకుని జయంతి




**రాజేంద్రనగర్, మార్చి 30 (జనంసాక్షి) :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను స్థాపించిన డాక్టర్ కేశవ్ రామ్‌బలే రామ్ హెగ్డే వార్ జయంతి మణికొండ గాంధీ పార్క్ హుడా కాలనీ నందు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి జయంతి నివాళులు అర్పించారు. సమస్త హిందూ సమాజం తమ అంతరాలను వీడి సమైక్యతతో సంఘటిత శక్తిగా ఉన్నపుడే ఈ సమాజము యొక్క జాతి యొక్క సర్వాంగీణ వికాసం జరుగుతుందని ఆయన తెలియజేసిన, అలాగే దేశానికి సేవచేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వక్త ఎర్ర నర్సింగ్ ఆర్.యస్.యస్. ప్రాంత సహ కార్యవాహ వక్త ఎర్ర నర్సింగ్, నగర్ సంఘచాలక్ కళ్ళ శ్రీరాంరెడ్డి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘటనా స్థలంలో 'ఆ ఔషధాలు'

### షేన్‌వార్న్ మరణం కేసులో కొత్తకోణం..

: ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం షేన్ వార్న్ మరణం కేసులో కొత్త కోణం వెలుగు చూసింది. థాయ్లాండ్లో ఓ విల్లాలో వార్న్ చనిపోగా.. అందుకు గుండెపోటు కారణమని భావించారు. దీనికి సంబంధించి తాజాగా ఓ కీలక విషయం తెరపైకి వచ్చింది. ఆ విల్లా నుంచి ఓ 'వస్తువు'ను తొలగించినట్లు బ్రిటన్ మీడియా సంస్థ డైలీ మెయిల్ సంచలన కథనం ప్రచురించింది.

వార్న్ చనిపోయిన సమయంలో ఘటనా స్థలానికి వెళ్లిన ఓ సీనియర్ పోలీసు అధికారి ఇటీవల మీడియాతో మాట్లాడుతూ.. "ఘటనా స్థలానికి వెళ్లగా.. అక్కడ ఓ ఔషధ బాటిల్ తో పాటు వాంతులు, రక్తపు మరకలు కనిపించాయి. ఆ మాత్రలను అక్కడ నుంచి తొలగించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. మేం వాటిని మాత్రం తొలగించాం. అయితే, ఆ మాత్రలను వార్న్ ఎంత మోతాదులో తీసుకున్నాడనే విషయం తెలియదు. ఆ సమయంలో ఇది సున్నితమైన అంశం" అని పేర్కొన్నాడు. దీనిని 'కప్పిపుచ్చే వ్యవహారంలో ఆస్ట్రేలియాకు చెందిన సీనియర్ అధికారుల పాత్ర ఉండవచ్చని అన్నాడు. వారి దేశానికి చెందిన ప్రముఖుడు ఈ స్థితిలో చనిపోయాడన్న విషయాన్ని బయటకు చెప్పకుండా ఉండేందుకు అలా చేసి ఉండవచ్చని అభిప్రాయపడ్డాడు. థాయ్ లాండ్‌లోని కోహ్ సమూయి ద్వీపంలోని విల్లాలో షేన్వార్న్ 2022 మార్చి 4న హఠాన్మరణం చెందారు. ఆ వార్త ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులను ఆవేదనకు గురిచేసింది. అయితే, షేన్వార్న్ తన విల్లాలో అచేతనంగా పడి ఉన్నారని, వైద్య బృందం ఎంతగా ప్రయత్నించినా ఆయన ప్రాణాలు కాపాడలేకపోయారని అతడి సిబ్బంది అప్పట్లో వెల్లడించారు. వార్న్ మరణానికి గుండెపోటు కారణమై ఉండొచ్చని భావిస్తున్నామని చెబుతూ.. వారి కుటుంబం గోప్యతను కోరుకుంటోందని చెప్పారు. అయితే, స్థానిక ఆసుపత్రి ఇచ్చిన పోస్టుమార్టం నివేదికలో మాత్రం వారిది సహజ మరణమని, నేరపూరిత కోణం కనిపించలేదని పేర్కొంది.

# హైదరాబాద్‌ను వదిలి వెళ్లిపోతాం

## సన్‌రైజర్స్ యాజమాన్యం



ఉచిత పాస్ల విషయంలో (ఐపీఎల్ 2025) సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మధ్య గొడవలు పతాకస్థాయికి చేరాయి. పాస్‌ల కోసం హెచ్సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు తీవ్రంగా వేధిస్తున్నాడని సన్‌రైజర్స్ మేనేజ్మెంట్ సంచలన ఆరోపణలు చేసింది. ఇలా చేస్తే హైదరాబాద్ నుంచి వెళ్లిపోతామని బెదిరించింది. ఈ అంశానికి సంబంధించి సన్రైజర్స్ జనరల్ మేనేజర్ టిబి శ్రీనాథ్ హెచ్సీఏ కోశాధికారి సీజే శ్రీనివాస్ రావు ఓ ఘాటు లేఖ రాశారు.

ఉచిత పాస్‌ల కోసం హెచ్సీఏ ఉన్నతాధికారులు, ముఖ్యంగా అధ్యక్షుడు ఏ జగన్మోహన్ రావు వేధింపులు తీవ్రమయ్యాయి. ఇలాంటి ప్రవర్తనను మేము ఏమాత్రం సహించం. ఇలాగే కొనసాగితే మేము వేదికను మార్చుకునేందుకు కూడా వెనకాడము. వారి ప్రవర్తన చూస్తే మేము ఉప్పల్ స్టేడియంను హోం గ్రౌండ్‌గా ఎంచుకుని మ్యాచ్లు ఆడటం వారికి ఇష్టం లేనట్లుంది.

ఇలా అయితే లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరుతున్నాను. తద్వారా ఈ విషయాన్ని బీసీసీఐ, తెలంగాణ ప్రభుత్వం మరియు మా యాజమాన్యానికి తెలియజేయగలము. మీకు ఇష్టం లేకపోతే మీరు కోరుకున్నట్లే హైదారబాద్ నుంచి తరలిపోతామని సన్రైజర్స్ ప్రతినిథి హెచ్సీఏ కోశాధికారికి రాసిన ఈ-మెయిల్లో పేర్కొన్నారు.

సన్‌రైజర్స్ జనరల్ మేనేజర్ టిబి శ్రీనాథ్ ఈ విషయాలను కూడా తన ఈ-మెయిల్లో రాశారు. గత 12 సంవత్సరాలుగా హెచ్సీఏతో కలిసి పనిచేస్తున్నాము. గత సీజన్ నుండి మాత్రమే ఈ సమస్యలు, వేధింపులు ఎదుర్కొంటున్నాము. ముందుగా చేసుకున్న ఒప్పందంలో భాగంగా వారికి ప్రతి సీజన్లో 50 కాంప్లిమెంటరీ టికెట్లు ఇస్తున్నాము. ఈ ఏడాది వారు అదనంగా మరో 20 టికెట్లు అడుతున్నారు. ఈ విషయం మా దృష్టికి వచ్చినప్పుడు పరస్పరం చర్చించి స్నేహపూర్వక పరిష్కారానికి వస్తామని వారికి తెలియజేసాము.

అయినా పట్టించుకోకుండా హెచ్సీఏ ప్రతినిథులు ఓవరాక్షన్ చేశారు. సన్‌రైజర్స్ -లక్నో మ్యాచ్ రోజున సీటింగ్ బాక్స్‌కు తాళం వేశారు. మేము అడిగిన అదనపు టికెట్లు ఇవ్వకపోతే తాళం తెరవమని బెదిరించారు. గత రెండేళ్లలో హెచ్సీఏ నుంచి మా సిబ్బందికి ఇలాంటి బెదిరింపులు చాలా వచ్చాయి. అధ్యక్షుడు జగన్మోహన్ రావు ఈ ఏడాదే చాలాసార్లు మా వారిని బెదిరించారు. ఇది ఏమాత్రం సహించరానిది. మేము స్టేడియంకు అద్దె చెల్లిస్తున్నాము. ఐపీఎల్ సమయంలో స్టేడియం మా ఆధీనంలో ఉండాలి అని శ్రీనాథ్ తన ఈ-మెయిల్లో పేర్కొన్నారు. కాగా, ఐపీఎల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీకి హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం (ఉప్పల్ స్టేడియం) హోం గ్రౌండ్‌గా ఉన్న విషయం తెలిసిందే.

*"ఉచిత టికెట్ల కోసం హెచ్సిఏ నుంచి ఎదురవుతున్న బెదిరింపులు, బ్లాక్మెయిలింగ్ నేపథ్యంలో తీవ్ర ఆందోళనతో లేఖ రాస్తున్నాం. పన్నెండేళ్లుగా హెచ్సీఏతో కలిసి పని చేస్తున్నాం. కానీ గత రెండు సీజన్ల నుంచే వేధింపులు ఎదురవుతున్నాయి. ఒప్పందం ప్రకారం హెచ్సీఏకు 10 శాతం (3900) కాంప్లిమెంటరీ టికెట్లు కేటాయిస్తున్నాం. 50 సీట్ల సామర్థ్యం ఉన్న ఎఫ్12ఏ కార్పొరేట్ బాక్స్ టికెట్లు కూడా అందులో భాగమే. కానీ ఈ ఏడాది దాని సామర్థ్యం 30 మాత్రమే అని పేర్కొంటూ, అదనంగా మరో బాక్స్లో 20 టికెట్లు కేటాయించాలని అడిగారు. దీనిపై చర్చిద్దామని చెప్పాం. మేం స్టేడియానికి అద్దె చెల్లిస్తున్నాం. ఐపీఎల్ సమయంలో స్టేడియం మా నియంత్రణలోనే ఉంటుంది. కానీ గత మ్యాచ్ సందర్భంగా ఎఫ్-3 బాక్సుకు తాళాలు వేశారు. అదనంగా 20 టికెట్లు ఇస్తే తప్ప తెరవమంటూ బెదిరించారు.*

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
31 మార్చి 2025

# కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలి

- 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలి
- బిసి సంక్షేమ సంఘం ఉద్యమానికి సిపిఐ(ఎం) మద్దతు



**హైదరాబాద్, మార్చి 30 (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా కులగణన జరపాలని, 42శాతం రిజర్వేషన్లను అమలు జరపాలని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఆమోదించిన బిల్లును పార్లమెంట్‌లో చట్టరూపంలో తేవాలని డిమాండ్ చేస్తూ జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో ప్రతినిధివర్గం సిపిఐ(ఎం) రాష్ట్రకార్యదర్శి వెస్లీ, రాష్ట్రనాయకులను ఎంబి భవన్‌లో కలిసి మద్దతు కోరింది. ఈ మేరకు ఏప్రిల్ 2న ఢిల్లీలో జరగనున్న మహాధర్నాకు మద్దతు తెలుపుతున్నట్టు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. తక్షణమే కేంద్రప్రభుత్వం ఈ రెండు అంశాలను పరిగణనలోకి తీసుకొని, అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్త కులగణనను వ్యతిరేకిస్తున్నదని, కానీ కులగణనకు, రిజర్వేషన్లకు అనుకూలంగా రాష్ట్రంలో బిజెపి నాయకులు మాట్లాడుతున్నారని తెలిపారు. కేంద్ర మంత్రులుగా వున్న కిషన్‌రెడ్డి, బండిసంజయ్ తదితరులు ఇలాంటి ద్వంద్వ వైఖరితో మాట్లాడుతుండటాన్ని బలహీన వర్గాల ప్రజలు వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని, అగ్రవర్ణ ఆధిపత్యంతో కూడికొని వున్న పార్టీగా, మనువాద ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరించేది పార్టీగా బిజెపి వున్నదని తెలిపారు. మతోన్మాద రాజకీయాలను, కులరాజకీయాలను ప్రేరేపిస్తూ, పెంచి పోషిస్తున్నదని, అందువల్ల సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటంలో కులగణన అనేది అత్యంత అవసరమని తెలిపారు. ఇలాంటి అంశాలపై ఉద్యమిస్తున్న సంఘాలు, పార్టీలకు పూర్తిగా మద్దతు తెలుపుతున్నట్టు వివరించారు.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో 37వ రోజూ కొనసాగుతున్న సహాయక చర్యలు

**నాగర్‌కర్నూల్, మార్చి 30 (జనంసాక్షి) :** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో 37వ రోజు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. మిగతా ఆరుగురి ఆచూకీ కోసం గాలింపు చర్యలు నడుస్తున్నాయి. సహాయక బృందాల ఉన్నతాధికారులతో ఎస్-ఎల్‌బీసీ టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ లోతేటి మాట్లాడుతూ.. సహాయక బృందాలకు తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పండుగ నాడు కుటుంబాలకు దూరంగా ఉంటూ సహాయక చర్యల్లో పాల్గొంటున్న సహాయక సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. టన్నెల్ లోపల చిక్కుకున్న వారిని రక్షించడానికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఏ ఒక్క అవకాశాన్ని వదిలిపెట్టకుండా వివిధ రకాల నిష్ణాతులైన సిబ్బందిని, సాంకేతికతను ఉపయోగించుకుంటున్నట్లు తెలిపారు. మొదటి రోజు నుంచే టన్నెల్ లోపల రెస్క్యూ ఆపరేషన్ చేయగల ఆర్మీ సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి, హైడ్రా, రైల్వే, జీఎస్ ఐ, ఎన్‌జీఆర్ ఐ, ర్యాట్ హెూల్ మైనర్స్ , ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్లు, కేరళ నుంచి ప్రత్యేక శిక్షణ పొందిన క్యాడవర్ డాగ్స్, రోబోటిక్ సహా అన్ని రకాల నిష్ణాతులను, సాంకేతికతను ఉపయోగించుకుంటూ టన్నెల్ లోపల చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రతి రోజూ నిరంతరాయంగా కొనసాగుతున్న సహాయక చర్యలపై సమీక్షలు నిర్వహిస్తూ, పలు సూచనలు, సలహాలు అందజేస్తూ సహాయక పనులను వేగవంతం చేస్తున్నామని శివశంకర్ వివరించారు . నిర్విరామంగా డీ వాటరింగ్, ప్రక్రియలను చేపడుతూ, సహాయక పనులకు ఆటంకంగా ఉన్న స్టీల్‌ను తొలగిస్తూ లోకో ట్రైన్ ద్వారా టన్నెల్ బయటికి తరలిస్తున్నామని తెలిపారు. సొరంగం లోపల అత్యధికంగా ఉన్న మట్టి తవ్వకాలు చేపడుతూ కన్వేయర్ బెల్ట్ ద్వారా మట్టిని బయటకు తరలిస్తున్నట్లు ప్రత్యేక అధికారి శివ శంకర్ లోతేటి తెలియజేశారు.



# దేవాదుల టన్నెల్‌కు బీటలు


**వరంగల్, మార్చి 30 (జనంసాక్షి) :** దేవాదుల ఎత్తిపోతల పథకం మోటర్ పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఆదివారం దేవాదుల టన్నెల్‌కు భారీ పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో పెద్ద ఎత్తున నీళ్లు ఉబికి వచ్చాయి. రైతుల పంట పొలాలకు నష్టం జరిగింది. దీంతో దేవాదుల మోటర్‌ను నిలిపివేశారు. ప్రారంభించిన మూడు రోజులకే మోటర్ ఆగిపోవడంతో రైతులు నిరాశ చెందారు. టన్నెల్ నుంచి నీరు లీక్ అయిన ఘటనలో పక్కనే ఉన్న భగీరథ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ కు భారీ ప్రమాదం తప్పింది. పైపులైన్ దిమ్మలకు పగుళ్లు ఏర్పడ్డాయి. అవి పగిలి పోయి నట్లయితే 270 గ్రామాలు, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజల కు తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యేది.



# నషీర్‌కు పురస్కారం!

(ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి)

చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్ కుబి ఆదివారం నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందజేశారు. విశ్వావసు నామ ఉగాది పర్వదినం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఉగాది సంబరాలు భాగంగా “ ఉగాది పురస్కారాల ప్రధానోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా 86 కళారత్న, 186 ఉగాది పురస్కారాలను ముఖ్యమంత్రి స్వయంగా అందజేశారు. పలువురు మంత్రులు, శాసన సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో నశీర్ అహమ్మద్ తన సరికొత్త పుస్తకం “ భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్ర ముస్లిం యోధులు” ను ముఖ్యమంత్రికి అందజేసి, గత పాతికేళ్ళుగా తాను సాగిస్తున్న స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పుస్తకాల రచన, ప్రచురణ, ప్రచార కార్యక్రమాల వివరాలను ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి వివరించారు. ఈ విశేషాలను సావధానంగా వున్న ముఖ్యమంత్రి నశీర్ అహమ్మద్ ను అభినందించారు.







# గ్రీన్ కార్డ్ ప్రాసెసింగ్‌ను ఆపేసిన అమెరికా

**భారతీయులకు భారీ షాక్**

**వాషింగ్టన్, మార్చి 30 (జనంసాక్షి) :** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి అక్రమ వలసదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. సరైన డాక్యుమెంట్లు లేని వారిని దేశం నుంచి పంపేస్తున్నారు. వలసదారులను నియంత్రించే కార్యక్రమంలో భాగంగా అమెరికా ప్రభుత్వం మరో చర్య తీసుకుంది. శరణార్థులతో పాటు మరి కొందరి గ్రీన్ కార్డ్ ప్రాసెసింగ్ ను నిలిపివేసింది. శరణార్థులు లేదా ఆశ్రయం పొందిన వారు అమెరికాలో శాశ్వత నివాసం కోసం పెట్టుకున్న అభ్యర్థనలను ట్రంప్ ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసినట్టు సీబీఎస్ న్యూస్ తెలిపింది. అమెరికా తీసుకున్న నిర్ణయంతో భారతీయులు తీవ్రంగా నష్టపోనున్నారు. 2023లో 51 వేల కంటే ఎక్కువ మంది ఇండియన్స్ గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. గ్రీన్ కార్డ్ ప్రాసెసింగ్ ను మళ్లీ ఎప్పుడు పునరుద్ధరిస్తారనే విషయాన్ని అమెరికా వెల్లడించలేదు.

# ఆయిల్ పామ్ వైపు రైతులు దృష్టి సారించాలి

- ఆయిల్ పామ్ పంటకు మద్దతు ధర కల్పించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి
- జూన్ నెలలో గోదావరి జలాలతో సాగు ప్రారంభించేలా చర్యలు
- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు
- వేంసూరు మండలం కల్లూరు గూడెంలో నూతన ఆయిల్ పామ్ కర్మాగారానికి శంకుస్థాపన
- ఆగస్టు 15 నాటికి జాతీయ రహదారి పనులు పూర్తి



**ఖమ్మం, మార్చి 30 (జనంసాక్షి) :** లాభసాటి పంట ఆయిల్ ఫామ్ వైపు రైతులు దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ,జౌళి ,మార్కెటింగ్ , సహకార శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వేంసూరు మండలం కల్లూరు గూడెం లో నూతనంగా నినించనున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీకి ఆయన శంకుస్థాపన చేసిన సందర్భంగా జరిగిన సభలో మాట్లాడు ..కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, టి.జి. ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ బాషా, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రతి పనికి ఆటంకాలు ఎదురవుతాయని, ఆయిల్ ఫెడ్ నుంచి ఇచ్చే ఏ మొక్కలు కూడా కల్తీవి లేవని, నర్సరీ దశలోనే కల్తీ మొక్కలు కనిపెట్టడం జరుగుతుందని అన్నారు. వర్షాలతో సంబంధం లేకుండా ఖమ్మం జిల్లా రైతులు జూన్ నెలలో గోదావరి జలాలతో సాగు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటు న్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సత్తుపల్లిలో అభివృద్ధి పనులు ప్రత్యేక శ్రద్ధతో చేపట్టడం జరుగుతుందని అన్నారు. వేంసూరు మండలంలో రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో గతంలో ఎన్టిఆర్ కాలువ పూర్తి చేశామని అన్నారు. రాజీవ్ లింక్ కాలువ పూర్తి చేసి వైరా నియోజకవర్గ పరిధిలో సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు అందించామని అన్నారు. జూన్ నెలలోపు సత్తుపల్లి ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకొని వస్తామని, నాగార్జున సాగర్ నిండకపోయినా గోదావరి నీటితో వేంసూరు మండల చెరువులు నింపు తామని అన్నారు. వర్షాలతో సంబంధం లేకుండా ఖమ్మం జిల్లాలో 10 లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందేలా సీతారామ ఎత్తిపోతల పథకం నీటి సరఫరా చేసేందుకు పెండింగ్ పనులకు సవరించిన అంచనాలను సీఎం ఆమోదించారని అన్నారు. జాతీయ రహదారుల, ఆయిల్ పామ్ పంటల వృద్ధి ఖమ్మం జిల్లాను చూసి ఇతర జిల్లాలు నేర్చుకోవాలని అన్నారు. ఆయిల్ పామ్ పంటకు గిట్టుబాటు ధర 21 వేలు దాటే విధంగా అధికారులు కృషి చేయాలని మంత్రి సూచించారు. హార్టికల్చర్ వ్యవసాయ సాగు వైపు రైతులు దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. ఈ సంవత్సరం ఎక్కువ ఆయిల్ పామ్ పంట సాగు ప్రారంభమైందని, రాబోయే 10 సంవత్సరాలలో 20 లక్షల ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంట సాగు చేయాలని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ పంటకు కరువు, వరదలతో ఇబ్బందులు లేవని, 3 సంవత్సరాలలో పంట వచ్చే మొక్కలు అందిస్తున్నామని, రైతులు ఆలోచించి ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని, పంట సాగు పెరిగే కొద్దీ అవసరమైన ఫ్యాక్టరీలను ప్రతి జిల్లాలో ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీతో రైతులకు మంచి రేటు లభిస్తుందని, గతంలో కూడా ఈ ఫ్యాక్టరీ ప్రైవేట్ పరం కాకుండా కాపాడామని అన్నారు. ఆయిల్ పామ్ పంటకు సైతం కనీస మద్దతు ధర ప్రకటించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని వస్తామని అన్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ, రైతులకు లాభం జరగాలనే ఉద్దేశంతో ఆయిల్ పామ్ పంటను మంత్రి తుమ్మల ప్రోత్సహిస్తున్నారని అన్నారు.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వేంసూరు మండల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నారని, కల్లూరుగూడెం గ్రామంలో ఏర్పాటు చేసే ఫ్యాక్టరీ వచ్చే ఉగాది నాటికి పూర్తి అవుతుందని, నేరుగా 100 నుంచి 200 మంది యువతకు ఉపాధి లభిస్తుందని, పరోక్షంగా వేలాది రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. ఆయిల్ పామ్ పంటకు ప్రభుత్వం అనేక రకాల సబ్సిడి అందిస్తుందని, 4 సంవత్సరాల కాలంలో దాదాపు 50 వేల రూపాయల సబ్సిడీ ప్రభుత్వం చెల్లిస్తుందని, తక్కువ నీటితో పంట పండుతుందని, ఎకరం పంటతో లక్షల రూపాయలు సంపాదించవచ్చని, మొదటి నాలుగు సంవత్సరాల పాటు అంతర్ పంటల సాగు చేయవచ్చని, రైతులంతా ఆలోచించి లాభసాటి ఆయిల్ పామ్ వైపు దృష్టి సారించాలని అన్నారు. సీతారామ ప్రాజెక్టు క్రింద యాతాలకుంట టన్నెల్ పనులు వేగవంతం చేయడంలో మంత్రి తుమ్మల కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే దగ్గర మనకు ఉపయోగపడేలా 2 ఎగ్జిట్ లు ఏర్పాటు చేశామని అన్నారు. బుగ్గపాడులో ఫుడ్ పార్క్ నిర్మాణం పూర్తి చేశామని, త్వరలోనే అక్కడ కంపెనీల ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని అన్నారు. టి.జి.ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ బాషా మాట్లాడుతూ, ఉగాది పర్వదినం సందర్భంగా 4వ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని అన్నారు. గంటకు 15 నుంచి 60 మెట్రిక్ టన్నుల గెలల క్రషింగ్ సామర్థ్యంతో 102 కోట్ల రూపాయల అంచనాతో అధునాతన ఆయిల్ పామ్ కర్మాగారం ఏర్పాటుకై ప్రణాళికలు రూపొందించామని, ఈ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసామని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటికే 30 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతుందని, సంవత్సరానికి 60 వేల మెట్రిక్ టన్నుల ఆయిల్ పామ్ దిగుబడి వస్తుందని, ఇది భవిష్యత్తు రోజుల్లో లక్షా 50 వేల మెట్రిక్ టన్నులకు చేరుతుందని అన్నారు. అత్యున్నత టెక్నాలజీతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం వల్ల మంచి దిగుబడి సాధ్యం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, కల్లూరు ఆర్డీఓ ఎల్. రాజేందర్, వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యానవన శాఖల అధికారులు, తెలంగాణ, ఆంధ్రా ఆయిల్ పామ్ అధ్యక్షులు, ప్యాక్స్ డైరెక్టర్ లు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకాక్ భూకంపం నుంచి తప్పించుకుని..
# స్వదేశానికి క్షేమంగా ఎమ్మెల్యే ఫ్యామిలీ!

**హైదరాబాద్, మార్చి 30 (జనంసాక్షి) :** బ్యాంకాక్ భూకంపంలో చిక్కుకున్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ కుటుంబ సభ్యులు స్వదేశానికి చేరుకున్నారు. ఆయన భార్య మనాలి, కుమార్తె మానస, కుమారులు ప్రతీక్, నిధిశ్ నలుగురు శనివారం మధ్యాహ్నం క్షేమంగా స్వస్థలానికి చేరుకున్నారు. తృటిలో ప్రాణాలు దక్కించుకుని శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చి తన ఫ్యామిలీని చూసి ఎమ్మెల్యే భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బంధువుల పెళ్లి కోసం వారు బ్యాంకాక్ వెళ్లారు. ఊహించని పెను ప్రమాదం నుంచి తప్పించుకుని ప్రాణాలతో బయటపడటం అనేది దేవుడి దయ వల్లే జరిగింది. అని మక్కాన్ సింగ్ ఎమోషనల్ అయ్యారు. ఎమ్మెల్యే భార్య మనాలి మాట్లాడుతూ ‘బంధువుల వివాహ వేడుక కోసం బ్యాంకాక్ వెళ్లిన మేము నొవాటెల్ హెూటల్‌లోని 35వ అంతస్తులోని ఓ గదిలో దిగాం. శుక్రవారం ఉదయం భూప్రకంపనలు మొదలు కావడంతో ముగ్గురు పిల్లలను తీసుకుని మెట్ల మార్గంలో వేగంగా బయటకు వచ్చాను. బిల్డింగ్ పైకప్పు పెచ్చులు ఊడిపోవడం, ఓ పక్కకు ఒరిగిపోవడంతో ప్రాణాలపై ఆశలు వదులుకున్నాం. బయటకు వచ్చి చూసేసరికి కళ్ల ముందే భవనాలు పేకమేడల్లా కూలిపోవడం చూసి చాలా భయమేసింది’ అని మనాలి చెప్పుకొచ్చారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370